శనివారం 29-7-2023



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 315

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

నేడు మొహర్రం (యౌమె ఆషూరా)

● ఇమామ్ త్యాగం

స్మరణీయం స్ఫూర్తిదాయకం

ఇస్లామీ క్యాలండరు ప్రకారం 'ముహర్రం' ఒక ప్రత్యేక ప్రాముఖ్యత కలిగిన మాసం. ఇది ముస్లిమ్ జగత్తుకు నూతన సంవత్సరం. ముహర్రం మాసంతోనే ఇస్లామీయ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇస్లామ్‌కు పూర్వం అప్పటి సమాజంలో కూడా కొత్తసంవత్సరం 'ముహర్రం' నుండే ప్రారంభమయ్యేది. ముహమ్మద్ ప్రవక్త(స) ముహర్రం మాసాన్ని అల్లాహ్ నెల అని అభివర్ణించారు. రమజాన్ రోజాల (ఉపవాసాలు) తరువాత అత్యంత శుభప్రదమైన రోజా ఆషూరా రోజానే. అంటే ముహర్రం పదవ తేదీన పాటించే రోజా అన్నమాట. రమజాన్ రోజాలు విధిగా నిర్ణయించక ముందు ఆషూరా రోజాయే ఫర్జ్ రోజాగా ఉండేది. కాని రమజాన్ రోజాలు విధిగా నిర్ణయించబడిన తరువాత ఆషూరా రోజా నఫిల్‌గా మారిపోయింది.

కాకతాళీయంగా 'కర్బలా' సంఘటన కూడా ఇదే రోజున జరగడం వల్ల దీని ప్రాముఖ్యత మరింతగా పెరిగిపోయింది. అంత మాత్రాన ముహర్రం మాసమంతా విషాద దినాలుగా పరిగణించడం, ఎలాంటి శుభకార్యాలూ నిర్వహించక పోవడం సరికాదు. ఎందుకంటే సత్యం కోసం, న్యాయం కోసం, ధర్మం కోసం, హక్కులకోసం, ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరగతి పొందారు. ధర్మయుద్ధంలో అమరుడు కావడం మానవ సహజ భావోద్రేకాలపరంగా బాధాకరం కావచ్చునేమోగాని, లౌకికంగా సత్కర్మల ఆచరణ అనివార్యంగా జరగాల్సిన నేపథ్యం లో పూర్తిగా విషాదానికి పరిమితం కావడమూ అంత సరికాకపోవచ్చు. ముహమ్మద్ ప్రవక్త(స) నిర్యాణం తరువాత తొలి నలుగురు ఖలీఫాల సారథ్యంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ జనరంజకమైన ప్రజాస్వామ్య పాలన పరిఢవిల్లింది. ఇస్లామీయ ప్రజాస్వామ్యంలో మొట్టమొదటి సూత్రం,'దేశం దైవానిది, దేశవాసులు ఆయన పాలితులు'. అంతేకాని పాలకులు ప్రజలకు ప్రభువులు ఎంతమాత్రం కాదు. ఇస్లామీయ రాజ్యానికి దైవభీతి, సచ్ఛీలత, జవాబుదారీతనం ప్రాణం లాంటివి. పాలకులు ఈ సుగుణాలకు ప్రతిరూపంగా, ఆదర్శంగా ఉండేవారు. అధికారులు, న్యాయమూర్తులు, సేనాపతులు, అన్నిశాఖల అధికారులు ఎంతో నిజాయితీపరులుగా, న్యాయ ప్రేమికులుగా ఉండేవారు. అనుక్షణం దైవానికి భయపడుతూ, ప్రజాసేవలో ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్తపడేవారు. ప్రజలకు సమాధానం చెప్పుకునే విషయంలో కూడా వారు, 'ఎప్పుడైనా, ఎక్కడైనా తాము ప్రజలకు జవాబుదారులమని భావించేవారు. ప్రతిరోజూ నమాజుల సమయంలో ప్రజల్ని కలుసుకొని, వారి అవసరాలు తీర్చేవారు. అవసరమైన సూచనలు, హితవులు చేసేవారు. కాని ఖలీఫాల తదనంతర కాలంలో పరిస్థితులు మారిపోయాయి. దైవభీతి, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య భావనలకు భంగం ఏర్పడింది. యజీద్ రాచరికం రూపంలో పురుడు పోసుకున్న దుష్పరిణామాలు ఇస్లామీయ ప్రజాస్వామ్య భావనను, ఆ సూత్రాలను తుంగలో తొక్కాయి. ఈ విధంగా కుటుంబ పాలన, చక్రవర్తుల పరంపర ప్రారంభమైంది. ఈ దురదృష్టకర పరిణామాల కారణంగా ముస్లిం సమాజం నేటి వరకూ ఇస్లామీయ ప్రజాస్వామ్య స్ఫూర్తికి దూరంగానే ఉండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణకు హజ్రత్ ఇమామె హుసైన్ (ర) కంకణబద్ధులయ్యారు. లక్ష్యసాధన కోసం ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోడానికి సిద్ధపడ్డారు. విలువల పరిరక్షణ కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడలేదు.

ప్రజాకంటకమైన రాచరిక వ్యవస్థను ఎదుర్కొన్న క్రమంలో సంభవించిన పరిణామ ఫలితాలు ఈనాడు మన ముందున్నాయి. ఇమామె హుసైన్ ఇంతటి ప్రమాదాన్ని కూడా లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి, ఇస్లామీయ ప్రజాస్వామ్య సంక్షేమరాజ్యాన్ని, దాని ప్రత్యేకతల్ని కాపాడుకోడానికి 'కర్బలా' సాక్షిగా ఒక విశ్వాసి పోషించవలసిన పాత్రను ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆ మహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అందుకే ప్రతియేటా 'మొహర్రం' పదవ తేదీన (యౌమె ఆషూరా) ఆయన త్యాగాన్ని స్మరించుకుంటారు. ఈ నేపథ్యంలో చూసినప్పుడు హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరత్వం ఆషామాషీ మరణం కాదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ధర్మసంస్థాపన, దైవప్రసన్నతే ధ్యేయంగా సాగిన సమరంలో పొందిన వీరమరణం. అందుకని ఆయన ఏ లక్ష్యం కోసం, ఏ ధ్యేయం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి అమరుడయ్యారో మనం దాన్నుండి స్ఫూర్తిని పొందాలి.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్



సమాజంలో దుర్మార్గం ప్రబలినప్పుడు, ఉన్మాదం జడలు విప్పినప్పుడు, విలువల హననం జరుగుతున్నప్పుడు, ప్రజాస్వామ్య వ్యవస్థ బీటలు వారుతున్నప్పుడు సమాజ శ్రేయోభిలాషులు, ప్రజాస్వామ్య ప్రియులు, న్యాయ ప్రేమికులు, పౌరసమాజం తక్షణం స్పందించాలి. న్యాయంకోసం, ధర్మం కోసం, మానవీయ విలువల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పరిధిలో శక్తివంచన లేకుండా పోరాడాలి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినప్పుడల్లా దాన్ని కాపాడుకోడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. విలువల ప్రేమికులందరూ ఒక్కటిగా ముందుకు కదలాలి. దానికి ఇమామ్ త్యాగం స్ఫూర్తిగా నిలవాలి.

హెయిర్ కేర్

గోరువెచ్చని నూనెతో మర్దన

వర్షాకాలం శిరోజాల సౌందర్యం కాపాడుకోవాలంటే కొన్ని కనీస జాగ్రత్తలు...

- తలస్నానం చేయడానికి రెండు గంటల ముందు గోరువెచ్చని నూనె వెంట్రుకు కుదుళ్లకు పట్టించి, మృదువుగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల కురులు మృదుత్వాన్ని కోల్పోవు.
- తలస్నానం చేసిన తర్వాత అలోవెరా జెల్ రాసుకొని, పది నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. అలోవెరా జెల్‌లో ఉండే ఔషధ గుణాలు చుండ్రును, వెంట్రుకలు చిట్లడాన్ని నివారిస్తాయి. దీంతో పాటు శిరోజాలలో ఉండే బాక్టీరియా, మాడుపై దురద.. వంటి సమస్యలను నివారిస్తాయి. వెంట్రుకలు పెరగడానికి కూడా దోహదం చేస్తాయి.



- తలస్నానానికి రసాయన గాఢత తక్కువగా ఉన్న షాంపూలనే వాడాలి.
- తీసుకునే ఆహారంలో ప్రొటీన్ల శాతం ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. సోయాబీన్, గుడ్లు, కొవ్వు తక్కువగా ఉండే ఛీజ్, బీన్స్.. వంటివి ఉండేలా జాగ్రత్తపడాలి.
- తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలతో చేసిన సలాడ్స్ ఈ కాలం తీసుకోవడం చాలా అవసరం. అలాగే మొలకెత్తిన గింజలను సలాడ్ రూపంలో తీసుకోవాలి. ఆహారంలో ఈ తరహా పదార్థాలు చేర్చడం వల్ల శరీరానికి తగినన్ని పోషకాలు అంది జుట్టు రాలడం తగ్గుతుంది.
- కాఫీ, టీ లలో ఉండే కెఫిన్ వెంట్రుకలు రాలడానికి దోహదం చేస్తుంది. కాఫీ, టీలకు బదులుగా పండ్లరసాలు, పాలు, హెర్బల్ టీ... వంటి కెఫిన్ లేని ద్రవపదార్థాలను తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు వర్షాకాలంలో ఎదురయ్యే శిరోజాల సమస్యలను దూరం చేస్తాయి.

కిచెన్ టిప్స్



- కిచెన్ ర్యాక్స్‌లో బొద్దింకలు తిరుగుతూ ఇబ్బంది పెడుతుంటాయి.. ర్యాక్స్‌లో అక్కడక్కడా బిర్యానీ ఆకులను ఉంచితే, బొద్దింకలు చేరవు.



- వేడిగా ఉన్న ఆయిల్‌లో టొమాటో, ఉల్లిపాయ పేస్టు వేసినప్పుడు నూనె ఒక్కసారిగా చిందుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే.. కాగిన నూనెలో ముందుగా నీళ్ల కలిపిన పసుపు మిశ్రమం కొద్దిగా వేసి కలపాలి. తరువాత ఉల్లిపాయ, టొమాటో పేస్టు వేస్తే ఆయిల్ పైకి చిందదు.



- బాగా మురికిపట్టిన గ్యాస్ లైటర్‌ను ముందుగా కొద్దిగా ఫ్లోర్ క్లీనర్ వేసి తుడవాలి. తరువాత నిమ్మచెక్కకు కొద్దిగా బేకింగ్ సోడా అద్ది లైటర్‌పై ఉన్న మొండి మరకలపై రుద్దితే కొత్తదానిలా మెరుస్తుంది.

✻ మనం మాట్లాడుకోవాల్సిందే!

పిల్స్ వాడుతున్నారా!?

**నిద్రపట్టడం లేదు.. ఆందోళనగా ఉంది.
మూడ్ బాగోలేదు.. స్ట్రెస్‌గా ఉంది.
వీటన్నింటికీ మనవాళ్లు ఎంచుకుంటున్న మార్గం 'పిల్'.
ఒక మోతాదులో టాబ్లెట్ వాడితే
సమస్య తగ్గిపోతుంది కదా! అనుకుంటారు.
ఇది చెడు అలవాటు కాదనుకుంటారు.
కానీ, ప్రతి చిన్న అనారోగ్య సమస్యకు
టాబ్లెట్ వేసుకోవడం కూడా వ్యసనమే.**



నేటి రోజుల్లో చాలామంది వర్క్ టెన్షన్ అనో, స్ట్రెస్ అవుతున్నామనో స్లీపింగ్ పిల్స్‌కు అలవాటు పడిపోయేవారు పెరుగుతున్నారు. వీటిని ముందుగా డాక్టర్ని కలిసి వారి సలహాతో తీసుకోవడం మొదలుపెడతారు. ఆ టాబ్లెట్ వేసుకున్న కొన్ని రోజులు బాగా అనిపించి, ఆ పాత ప్రిస్క్రిప్షన్ పైన ఆ టాబ్లెట్లను అలాగే కంటిన్యూ చేస్తుంటారు. యాంగ్జైటీ పిల్స్, స్ట్రెస్ పిల్స్, మూడ్ ఎలివేటర్స్.. ఇలా విభిన్న రకాలుగా ఉండే ఈ పిల్స్‌ను ఆందోళనగా అనిపించినప్పుడల్లా వాడతారు, క్రమేణా వాటికి అలవాటు పడిపోయి మరిన్ని సమస్యల్లోకి కూరుకుపోతున్నారు.

●●●

వసుధ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రాజెక్ట్ టీమ్ లీడర్‌గా బిజీ షెడ్యూల్ తనది. ఓ వైపు కుటుంబం, మరోవైపు ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగం. కొన్నాళ్లు బాగానే మేనేజ్ చేసినా ఎదురయ్యే సమస్యలు టెన్షన్ పెట్టేవి. దీంతో ఆందోళన పెరిగిపోయేది. ఒత్తిడిని తగ్గించుకోవాలంటే బాగా నిద్రపోవాలని చెబుతుండేవారు స్నేహితులు. కానీ, ఆ ఒత్తిడి వల్లే నిద్ర పట్టడం లేదనేది వసుధ కంప్లైంట్. ఫ్రెండ్ సలహా మేరకు డాక్టర్ని కలిసింది. కొన్ని రోజులు ఆందోళన తగ్గడానికి ఒక మెడికల్ కోర్సును వాడమని చెప్పాడు డాక్టర్. ఆ కోర్స్ వాడాక తనకు చాలా రిలీఫ్‌గా అనిపించింది. ఆందోళనగా అనిపించినా, పనిభారంతో తల బరువుగా అనిపించినా అవే టాబ్లెట్స్ తెచ్చుకొని వాడటం మొదలుపెట్టింది. ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు టాబ్లెట్ లేనిదే పరిష్కారం కాదు అనేంత స్థాయికి వచ్చేసింది. నిద్ర పట్టడం లేదని రాత్రిళ్లు స్లీపింగ్ పిల్స్ వేసుకునేది. కానీ, ఆఫీసుకు వెళ్లినా ఆ మత్తు ఆమెను వదిలేది కాదు. దీంతో తీసుకున్న ప్రాజెక్ట్ వర్క్స్ చేయడంలో ఆలస్యం అవుతూ ఉండేది. రోజులో ఎక్కువ సమయం మత్తుగా ఉండటంతో జాబ్ పోయే పరిస్థితి ఎదురైంది.

లాయర్, డాక్టర్, ఇంజినీర్.. ప్రతీ వృత్తి, ఉద్యోగం చేస్తున్నవారిలో ఎన్నో ఆందోళనలు ఎదుర్కోవడం చూస్తున్నాం. ఈ ఆందోళన స్థాయి వారి శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో సమస్యను సాల్వ్ చేసుకోవడానికి టాబ్లెట్స్‌ను ఆశ్రయించే వారు పెరుగుతున్నారు. శరీరానికి ఏ కొద్దిగా కెమికల్‌ను బయట నుంచి అలవాటు చేసినా మైండ్ మరికొంత మోతాదు పెంచేలా ప్రేరేపిస్తుంది. ఫలితంగా కెమికల్ మోతాదు శరీరంపై చెడు ప్రభావం చూపడానికి దోహదం చేస్తాయి.

సహజమే కానీ..

ఈ సమస్యను ఎదుర్కొనేవారిలో అధిక శాతం చదువుకున్నవారే. 'ఇదేమీ చెడు అలవాటు కాదు కదా! నేను సరైన విధంగా మానేజ్ చేసుకోగలుగుతున్నాను కదా' అనుకుంటారు. బయటి వాళ్లకు కూడా వీళ్ల 'పిల్స్'వాడుతున్నారనే విషయం తెలియదు. కొంత కాలం బాగానే గడిచిపోతుంది. కానీ, సమస్య మాత్రం పెరుగుతూనే ఉంటుంది.

- ఏ వ్యక్తిలో అయినా భావోద్వేగాలు మారిపోతుండటం సహజంగా జరుగుతుంది.
- కొందరు మాత్రం ప్రతి చిన్నదానికి ఆందోళన పడేవారుంటారు. మన వ్యక్తిత్వం ఇలాంటిది అని అర్థం చేసుకొని, ఈ సమస్యనుంచి బయటకు రావడానికి నిపుణులు సాయం తీసుకోవాలి.
- కొందరికి రకరకాల ఫోబియాలు ఉంటాయి. వీటిని అధిగమించడానికి కూడా టాబ్లెట్స్‌ని ఆశ్రయిస్తుంటారు. ఇవీ మానసిక సమస్యలే అని గుర్తించాలి.

బయటపడాలంటే టెక్నిక్స్

మనకు తెలియదు కానీ, చాలా మంది మహిళల పర్సులలో కొన్ని టాబ్లెట్లు ఉంటాయి. అవి, పెయిన్ కిల్లర్స్, మూడ్ స్టెబిలైజర్స్, స్ట్రెస్ పిల్స్, స్లీపింగ్ పిల్స్... వంటి వాటిలో ఏవైనా ఉండచ్చు. ముందుగా వాటిని బయట పడేయాలి.

- ఏ సమస్య బాధిస్తోందో దానిని కుటుంబ సభ్యుల మధ్య లేదా నిపుణుల ముందు వ్యక్తం చేయాలి. ఆ సమస్యకు సంబంధించిన బ్లాక్స్‌ను క్లియర్ చేసుకుంటే సులువుగా బయటపడచ్చు.
- ప్రతి ఒక్కరిలోనూ సాధారణ ఆందోళనలు ఉంటాయి. కానీ, కొంతమంది మాత్రం ప్రతి చిన్న విషయానికీ ఆందోళన పడిపోతుంటారు. ఇది కొన్నిరోజులకు పెద్ద ఆందోళనగా మారుతుంటుంది. ఆందోళన తగ్గించుకోవడానికి పిల్స్ వాడకం బదులు, దానిని అధిగమించేలా మానసిక స్థైర్యాన్ని పెంచుకోవాలి.
- శరీరం కెమికల్ మీద ఎంతవరకు డిపెండ్ అయిందో గుర్తించి దానిని బ్రేక్ చేస్తాం. మైండ్‌ను రిలాక్స్‌గా ఉంచే యోగా, ధ్యానంతోపాటు సరైన పోషకాహారం మీదా దృష్టి పెట్టాలి.
- శరీరం బయట నుంచి తీసుకునే కెమికల్ కాకుండా సహజ సిద్ధంగా మార్పులకు లోనయ్యేలా అలవాటు చేసుకున్నప్పుడు ఇంటర్నల్ సిస్టమ్ రీ యాక్టివేట్ అవుతుంది.

– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్



**బుద్ధి గడ్డి తినడం కాదిది.
బుద్ధిగా గడ్డి ప్లేట్‌లో తినడం.
పర్యావరణ పరిరక్షణ పట్ల బుద్ధి వచ్చిన తర్వాత చేసే పని.
దీనికి పెట్టిన అందమైన పేరే బయో డిగ్రేడబుల్ టేబుల్ వేర్.**

బుద్ధిగా తిందాం!




రిషభ్, రోహన్

కేరళకు చెందిన రిషభ్, రోషన్ సోదరుల ప్రయోగం ఇది. సముద్రాన్ని కూడా వదలని కాలుష్యం నుంచి తీసుకున్న నిర్ణయం. వీళ్లు ప్లేట్‌ల తయారీకి వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగిస్తున్నారు. వేడుకల సందర్భంగా ఇప్పుడు ఉపయోగిస్తున్న ఫైబర్, పాలిథిన్ పొర ఉన్న పేపర్ ప్లేట్‌లలో భోజనం చేసి బయట పారేసినప్పుడు చెత్త కుండీల దగ్గర చేరిన కుక్కలు, ఆవులు, ఇతర జంతువులు ఆ ప్లేట్లలో మిగిలిపోయిన ఆహారంతోపాటు ప్లేట్లను కూడా నమిలి మింగేస్తుంటాయి. దాంతో అవి అనారోగ్యాల బారిన పడుతుంటాయి. ఫైబర్ బదులు బయో డీగ్రేడబుల్ ప్లేట్ వాడినట్లయితే... మూగజీవులు మనం పారేసిన మిగులు ఆహారంతోపాటు ప్లేట్‌ని తిన్నప్పటికీ వాటి ఆరోగ్యానికి ఎటువంటి హానీ కలగదు. ఈ ప్లేట్‌లను నానబెట్టి ఎరువుగా మార్చుకుని పంటకు వాడుకోవచ్చు. ఏమీ చేయకుండా వదిలేసినా కూడా ఈ మెటీరియల్ మట్టిలో కలిసిపోయి ఆ మట్టి జవజీవాలను పెంచుతుంది.



బయో డీగ్రేడబుల్ ప్లేట్



బయో డీగ్రేడబుల్ ప్లేట్‌లో ఆహార పదార్థాలు

■ గడ్డి కంచం ఇలా పుట్టింది!

అసలీ గడ్డి ప్లేట్ ఆలోచన ఎలా వచ్చిందంటే... రిషభ్‌కి సర్ఫింగ్ ఇష్టం. కేరళ, కోవళమ్, అరేబియా సముద్రంలో సర్ఫింగ్ చేసేవాడు. సముద్రపు అలలను తప్పించుకుంటూ బోర్డు మీద పెడలింగ్ చేయడం అత్యంత సాహసంతో కూడిన ఆట. ప్రాక్టీస్‌లో ఉన్నప్పుడు రిషభ్ తలకు, దేహానికి పాలిథిన్ పేపర్, ప్లాస్టిక్ వస్తువులు తగులుతుండేవి. ఒక్కోసారి పాలిథిన్ షీట్ వచ్చి కాళ్లకు చుట్టుకునేది. ఇలాంటిదే మరో సంఘటన ఈ సోదరులిద్దరికీ ఆఫ్రికాలోని ఉగాండా దేశంలో ఎదురైంది. అక్కడి పర్వత శిఖరాల మీదకు ట్రెకింగ్ చేస్తున్నప్పుడు ఎటు చూసినా ప్లాస్టిక్ కాలుష్యమే. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడం కంటే పాలిథిన్ వ్యర్థాలను తప్పించుకుంటూ అడుగులు వేయడంతోనే ట్రెకింగ్ పూర్తయింది. ఈ సమస్య ఒక్క కేరళనే కాదు, ప్రపంచం అంతటినీ వేధిస్తోందనిపించింది. పర్యావరణం ఎదురుగా భూతంలా నిలిచిన ఈ సవాల్‌కు జవాబు వెతికే ప్రయత్నంలో వీరికి వచ్చిన ఆలోచన ఈ బయో డీగ్రేడబుల్ టేబుల్ వేర్. క్వాడ్రాట్ పేరుతో మొదలు పెట్టిన ఈ ప్రయోగంలో ప్లేట్ తయారీకి తవుడు, పొట్టు, గడ్డి ఉపయోగించారు. ఇరవై నెలల నిరంతర పరిశోధన, ప్రయోగాలతో ఒక రూపం వచ్చింది. వేడుకల్లో ఉపయోగించే పేపర్ ప్లేట్, అల్యూమినియం ఫాయిల్ అద్దుకున్న ప్లేట్, ఫైబర్ ప్లేట్‌ల స్థానాన్ని భర్తీ చేయగలుగుతుందా అనే పరీక్షలన్నింటినీ ఈ బయోడీగ్రేడబుల్ ప్లేట్ పాసయింది.

■ ఇలా చేస్తున్నారు!

పంట పొలాల నుంచి గడ్డిని, రైస్ మిల్లుల నుంచి తవుడు, పొట్టు సేకరించి శుభ్రం చేసిన తర్వాత హీటర్‌లో వేడి చేసి, మెత్తగా పొడి చేసి ప్లేట్, కప్పు, స్పూన్ ఆకారంలో ఉన్న మౌల్డ్ ఆధారంగా రూపం తెస్తారు. ఈ ప్లేట్‌లు భోజనం చేసే లోపు నానిపోతాయేమో అనే సందేహం కలుగుతుంది. పులుపు, రసం, మజ్జిగతో హాయిగా భోజనం చేయవచ్చని, నీటిలో నానబెట్టిన తర్వాత అరగంట సేపటి వరకు వాటి షేప్ మారదని చెప్పారు. అలాగే కప్పులు మరింత దృఢంగా 70 నిమిషాల సేపు ద్రవాలను నిలిపి ఉంచుతాయి. ఒకసారి తయారైన ఈ టేబుల్ వేర్‌ని ఏడాది పాటు నిల్వ ఉంచుకోవచ్చు.

■ విదేశాలకెళ్తున్నాయి!

ఢిల్లీ, ముంబయి, బెంగళూరు నగరాలతోపాటు అండమాన్ నికోబార్ దీవులు, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాలు ఈ ప్రత్యామ్నాయాన్ని ఆదరిస్తున్నాయి. అంతేకాదు, యూఎస్, యూకే, కెనడా, మెక్సికోలు కూడా ఈ బయోడీగ్రేడబుల్ టేబుల్ వేర్‌కు స్వాగతం పలికాయి. నెలకు ప్లేట్‌లు, కప్పులు, స్ట్రాలు, స్పూన్‌లు అన్నీ కలిపి పాతిక వేలు అమ్ముడవుతున్నాయని చెప్పారు రిషభ్, రోహన్‌లు.

పొట్ట ఉబ్బిపోతుంది!

జంతువులు మనం తినే ఆహారం వైపు చూస్తున్నాయంటే వాటికి వాటి ఆహారం దొరకడం లేదని అర్థం. వీధికుక్కలతోపాటు ఆవులు మరికొన్ని జంతువులు ఓ దశాబ్దకాలంగా జీర్ణవ్యవస్థ సమస్యలతో మరణిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ప్లాస్టిక్ వ్యర్థాలే. ప్లాస్టిక్ వ్యర్థాలను వరుసగా నెలరోజుల పాటు తిన్నాయంటే వాటి పెద్దపొట్టలో పదహారు నుంచి పద్దెనిమిది కిలోల ప్లాస్టిక్ పేరుకుంటుంది. ఐదారు కిలోలు చేరినప్పటి నుంచి వాటికి ఇబ్బందులు మొదలవుతాయి. గ్యాస్‌తో కడుపు ఉబ్బిపోతుంది. అక్యూట్ బ్లోటింగ్‌తో కొద్ది రోజుల్లోనే మరణిస్తాయి. ఎవరి పెంపకంలో లేని జంతువులకు ఈ ప్రమాదం ఎక్కువ. పరిస్థితి ఎంత దయనీయమంటే... ఆవులు నెమరు వేసుకునే ప్రక్రియలో ఆహారాన్ని తిరిగి నోట్లోకి తెచ్చుకున్నప్పుడు ఫైబర్, ప్లాస్టిక్ వ్యర్థాలు ముక్కలు ముక్కలుగా బయటపడుతుంటాయి. బయటపడడం కొంతలో కొంత నయం. పాలిథిన్ కవర్లు లోపల చుట్టచుట్టుకుని పోతే వాటంతట అవి బయటకు రాలేవు. ఆపరేషన్ చేయడమే మార్గం. ఈ జంతువులకు వైద్యం చేసి ప్రాణాలు కాపాడాలన్నా కూడా ప్లాస్టిక్ పెద్ద పొట్టలో ఉన్నప్పుడు మాత్రమే సాధ్యం. అది విసర్జక వ్యవస్థలోకి వెళ్లాయంటే ఇక ఏమీ చేయలేం. మరణాన్ని ఆపలేం.

– డాక్టర్ మల్లేశ్ పాటిల్,
అసిస్టెంట్ డైరెక్టర్, యానిమల్ హజ్బెండరీ,
ఆంధ్రప్రదేశ్




'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 315

శనివారం 29-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




విదేశాల్లో దేశీ సంస్థల లిస్టింగ్

కేంద్రం గ్రీన్ సిగ్నల్.. త్వరలో నోటిఫికేషన్ ఆర్థిక మంత్రి నిర్మల వెల్లడి - 11లో



లక్ష్య సేన్ జోరు..

ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో సెమీఫైనల్లోకి.. - 11లో



పట్టు వీడని విపక్షాలు

మణిపూర్ ఘటన, అవిశ్వాసంపై వెంటనే చర్చ చేపట్టాలని కోరుతూ ప్రతిపక్షాలు పార్లమెంట్ ఉభయ సభలను స్తంభింపజేశాయి.

వివరాలు 6లో ▸



ఆ పరిశ్రమలకు ఆర్థిక సాయం

భారత్‌లో సెమికండక్టర్ల తయారీ పరిశ్రమలు నెలకొల్పే సంస్థలకు 50% ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



అణు క్షిపణులతో పరేడ్

శక్తివంతమైన అణు క్షిపణులను ఉత్తర కొరియాలో రష్యా, చైనా ప్రతినిధులతో కలిసి అధ్యక్షుడు కిమ్ తిలకించారు.

వివరాలు 6లో ▸



విపత్తులతో బతుకు చిత్తు..

2022లో 81 విపత్తులు ఆసియా దేశాలను వణికించాయని ప్రపంచ వాతావరణ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్


పేద విద్యార్థులకు చేరువగా వైద్య విద్య



పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువచేయాలన్న సంకల్పంతో మెడికల్ కళాశాలల నిర్మాణానికి సీఎం జగన్ చర్యలు చేపట్టారని మంత్రి విడదల రజిని అన్నారు. రాష్ట్రంలోని 5 మెడికల్ కళాశాలల్లో సెప్టెంబర్ నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు.

వివరాలు 12లో ▸

అవిశ్వాసం సరికాదు



ఈశాన్య ప్రాంత చిన్న రాష్ట్రమైన, దేశ సరిహద్దులో ఉన్న మణిపూర్‌లోని వివాదాస్పద అంశంపై విపక్షాలు కేంద్రానికి మద్దతుగా కలిసి రావాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. సరిహద్దు దేశాల కుట్రల దృష్ట్యా ఈ విషయంలో అందరూ సమష్టిగా ఉండాల్సిన అవసరం ఉందని, కేంద్రంపై ప్రవేశపెట్టిన అవిశ్వాసాన్ని తిప్పికొట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు.

వివరాలు 3లో ▸


ఉదారంగా వరద సాయం

అత్యంత సమర్థంగా సహాయ, పునరావాస కార్యక్రమాలు అమలు కావాలి: సీఎం జగన్

- అధికార యంత్రాంగం మానవీయ కోణంలో వ్యవహరించాలి
- ఒక రూపాయి అదనంగా ఖర్చు అయినా సరే బాధితులకు అండగా ఉండాలి
- శిబిరాల నుంచి తిరిగి వెళ్లేటప్పుడు ప్రతి కుటుంబానికి రూ.2 వేలు.. వ్యక్తులైతే రూ.1,000 సాయం
- కచ్చా ఇళ్లు దెబ్బ తిన్న బాధితులకు రూ.10వేలు అందించాలి.. ఎలాంటి వర్గీకరణ వద్దు
- ముంపు ప్రాంతాల్లో 25 కేజీల బియ్యం, కిలో చొప్పున ఉల్లిపాయలు, ఆలూ, కందిపప్పుతోపాటు పామాయిల్
- శిబిరాల్లో మంచి సదుపాయాలు.. అధికారులే ఉంటే ఎలా కోరుకుంటారో అలాంటివే కల్పించాలి



- సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలి
- ముంపు బాధిత గ్రామాలు, లంకలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి
- నిత్యావసరాలు సహా జనరేటర్లు లాంటివి సిద్ధంగా ఉంచాలి.. తాగునీటి కొరత లేకుండా జాగ్రత్తలు
- ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు.. ఆరోగ్య శిబిరాలు
- విలేజ్ క్లినిక్స్, పీహెచ్‌సీల్లో సరిపడా మందులను అందుబాటులో ఉంచాలి
- వరద తగ్గగానే పంట నష్టం వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలి
- వరదలు, సహాయ, పునరావాస చర్యలపై కలెక్టర్లతో సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలు



రాజమహేంద్రవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



విజయవాడలో పరవళ్లు తొక్కుతున్న కృష్ణా నది

సాక్షి, అమరావతి: వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను అత్యంత సమర్థంగా అమలు చేయాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. వరద బాధితులకు మానవీయ కోణంలో సహాయం అందించాలని స్పష్టం చేశారు. ఇలాంటి విపత్తు పరిస్థితుల్లో ఉండాల్సిన దాని కన్నా ఎక్కువగా మానవత్వంతో పని చేయాలనే విషయాన్ని అంతా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఒక రూపాయి అదనంగా ఖర్చు అయినా సరే బాధితులకు అండగా ఉండాలన్నారు. కలెక్టర్లు మాకు మంచి చేశారనే మాటే వినిపించాలని, మన వల్ల జిల్లాకు మంచి జరిగిందని, మంచి కలెక్టర్ అనిపించుకునేలా పని చేయాలని సూచించారు. ప్రధానంగా ఐదు జిల్లాల్లో కలెక్టర్లు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సహాయ శిబిరాల నుంచి బాధితులు తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు

మిగతా 2వ పేజీలో ▶

లంకల్ని ముంచెత్తిన వరద

విలీన మండలాల్లో ముంపు బారిన గోదావరి తీర గ్రామాలు

కాజ్‌వేల వద్ద పడవలు, ట్రాక్టర్లపై రైతుల్ని దాటిస్తున్న అధికారులు

2 లో

ఫ్యాక్ట్ చెక్

సీఎం జిల్లా వారైతే అనర్హులా..!

- ఆ జిల్లా వారు టెండర్లకు అనర్హులనేలా ఈనాడు కథనం
- విద్యుత్ డిమాండు తీర్చేందుకే సీలేరులో అదనపు యూనిట్లు
- రివర్స్ టెండరింగ్ ద్వారా పారదర్శకంగా కాంట్రాక్టు అప్పగింత
- అతి తక్కువ మొత్తానికి కోట్ చేసిన సంస్థకే కాంట్రాక్టు
- రివర్స్ టెండరింగ్‌తో ఏపీ జెన్‌కోకు రూ.10 కోట్లు ఆదా
- ప్రాజెక్టుల నిర్మాణం కోసం రుణం తీసుకోవడం సర్వసాధారణం
- ఇందులో తప్పుబట్టడానికి అవకాశమే లేదు
- సీలేరు విద్యుదుత్పత్తి టెండర్లలో వాస్తవాలివీ..

5 లో

హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

ప్రమాణస్వీకారం



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

ప్రమాణం చేయించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

అభినందనలు తెలిపిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ చేత గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. అంతకుముందు జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను సీజేగా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు చదివి వినిపించారు. అనంతరం జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేశారు. జస్టిస్ ఠాకూర్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందలు తెలియజేశారు. అనంతరం అందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

మిగతా 3వ పేజీలో ▶

ఛీటింగ్ 'మార్గ'ం మూత!

ఉషాకిరణ్, ఉషోదయలో మార్గదర్శి వాటాలు అటాచ్

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ కీలక నిర్ణయం
- చందాదారుల సొమ్ముతో అనుబంధ సంస్థల్లో అక్రమ పెట్టుబడులు
- ఉషాకిరణ్‌లో 88.50 శాతం.. ఉషోదయలో 44.55 శాతం
- ఆ వాటాల అటాచ్‌కు సీఐడీకి హోంశాఖ అనుమతి.. చందాదారులకు తెలియకుండా వారి పేరిట పిటిషన్లు దాఖలు
- న్యాయస్థానాన్నే మోసగించిన మార్గదర్శి చిట్‌ఫండ్స్.. చట్టపరమైన చర్యలకు సీఐడీ సమాయత్తం
- రెండు కేసుల్లో రామోజీరావు, శైలజా కిరణ్‌పై చార్జిషీట్లు దాఖలు
- త్వరలోనే మిగిలిన ఐదు కేసుల్లో కూడా.. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ది అతిపెద్ద కార్పొరేట్ మోసం: సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్
- శుక్రవారం సాయంత్రం నుంచి మూతబడ్డ మార్గదర్శి వెబ్‌సైట్




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్. చిత్రంలో సీఐడీ ఐజీ శ్రీకాంత్

అతిపెద్ద కార్పొరేట్ మోసం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ దేశంలోనే అతిపెద్ద కార్పొరేట్ మోసానికి పాల్పడిందని సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. మార్కెట్‌లో పేరుందని చెప్పుకున్నప్పటికీ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే దర్యాప్తు సంస్థలు కఠిన చర్యలు తీసుకుంటాయని స్పష్టం చేశారు. గతంలో విద్యుత్ కుంభకోణంలో ఎన్‌రాన్ కంపెనీపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో సీఐడీ మరో కీలక చర్య తీసుకుంది. ఈ కేసులో ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజా కిరణ్ కేంద్ర చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల డబ్బులను మళ్లించి అనుబంధ సంస్థల్లో పెట్టిన పెట్టుబడులపై కొరడా ఝుళిపించింది. ప్రధానంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయా ఎంటర్ ప్రైజస్‌లో ఉన్న వాటాలను అటాచ్ చేయాలని నిర్ణయించింది. రామోజీరావు వ్యాపార సామ్రాజ్యంలో ఇవే ప్రధాన విభాగాలు కావడం గమనార్హం. మరోవైపు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలకు సంబంధించి నమోదు చేసిన ఏడు కేసుల్లో రెండింటిలో సీఐడీ న్యాయస్థానంలో చార్జిషీట్లు దాఖలు చేసింది. సీఐడీ ఐజీ సీహెచ్.శ్రీకాంత్‌తో కలసి శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిట రామోజీరావు, శైలజా కిరణ్ అతిపెద్ద కార్పొరేట్ మోసానికి పాల్పడ్డారని చెప్పారు. నిబంధన ప్రకారం

మిగతా 3వ పేజీలో ▶



ఆయన టేబుల్ మీద ఎరుపు రంగులో ఉన్న ఏ వస్తువూ పెట్టొద్దని చెప్పానా?

యాంకర్ యూనిట్లకు ప్రత్యేక రాయితీలు

- 2023 – 27 పారిశ్రామిక పాలసీ విధివిధానాలను విడుదల చేసిన ప్రభుత్వం
- యాంకర్ యూనిట్ల కనీస పెట్టుబడి రూ.500 కోట్లు ఉండాలి
- 1000 మందికి పైగా ఉద్యోగాలు కల్పించాలి
- ఈ పరిశ్రమ ఆధారంగా కనీసం మరో 5 యూనిట్లు ఏర్పాటవ్వాలి
- 75% స్థానికులకు ఉపాధి కల్పించాలి.. టైలర్ మేడ్ విధానంలో పరిశ్రమలు కోరుకొనే రాయితీలు



12 లో

- వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు
- ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత
- జగనన్న కాలనీల్లో వాక్ టు వర్క్ విధానంలో సూక్ష్మ యూనిట్ల క్లస్టర్లు

నాడు-నేడు గణాంకాలను విడుదల చేస్తున్న మేధావులు, ప్రజాసంఘాల నాయకులు



సంక్షేమాభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా ఏపీ

ఆంధ్రప్రదేశ్‌లో సర్వతోముఖాభివృద్ధి జరుగుతోంది

- అభివృద్ధి అంటే బిల్డింగులు, పరిశ్రమలు, వంతెనలే కాదు
- రాష్ట్రంలో డీబీటీ ద్వారా సామాజిక అభివృద్ధి
- ఫలితంగానే జీడీపీలో 16.22 శాతం వృద్ధి నమోదైంది
- పేదరికం 6.6 శాతానికి దిగివచ్చింది.. తలసరి ఆదాయం రూ. 2.30 లక్షలకు పెరిగింది.. ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలవి అసత్య ప్రచారం
- మేధావులు, ప్రజా సంఘాల నేతల వెల్లడి.. 'ఆంధ్రప్రదేశ్ ప్రగతి నాడు–నేడు' నివేదిక విడుదల చేసిన ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్

12 లో

నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు

- వివేకా హత్యపై చార్జిషీట్‌లో సీబీఐ పూర్తిగా అవాస్తవాలను పేర్కొంది
- కావాలని దర్యాప్తును తప్పుదారి పట్టిస్తోంది.. కొందరిని ఇరికించే ఉద్దేశంతోనే ఇలా వ్యవహరిస్తోంది
- చార్జిషీట్ నుంచి నా వాంగ్మూలాన్ని తొలగించేలా ఆదేశాలివ్వండి
- తెలంగాణ హైకోర్టులో ఏపీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం పిటిషన్



సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థ.. హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేసిన చార్జిషీట్‌లో తన వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేసిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం తెలంగాణ హైకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. చార్జిషీట్ నుంచి తన వాంగ్మూలం తొలగించేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీబీఐ తన వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేయడం చట్టవిరుద్ధమని, రాజ్యాంగాన్ని

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

త్యాగానికి ప్రతీక మొహర్రం: గవర్నర్ జస్టిస్ నజీర్



సాక్షి, అమరావతి: మానవాళి శ్రేయస్సు కోసం అత్యున్నత త్యాగానికి ప్రతీక మొహర్రం అని గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్‌నజీర్ పేర్కొన్నారు. సద్భావన, త్యాగాలను స్మరించుకుని మానవాళి మేలు కోసం పునరంకితం కావడమే మొహర్రం స్ఫూర్తి అని అన్నారు. ఇస్లాం మూలసూత్రమైన మానవత్వాన్ని మొహర్రం మూర్తీభవిస్తుందని గవర్నర్ పేర్కొన్నట్లుగా రాజ్‌భవన్ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

ప్రపంచంలోని 70 శాతం పులులు మన దేశంలోనే..



సాక్షి, అమరావతి: నేడు ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో ఉన్న పులుల్లో 70 శాతం భారత్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో 3,167 ఉన్నాయి. 1973లో 'ప్రాజెక్టు టైగర్'ను ప్రారంభించి ఇప్పటి వరకు దేశంలో 53 టైగర్ రిజర్వులు ఏర్పాటు చేశారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ 3,727 చదరపు కి.మీ. విస్తీర్ణంతో దేశంలోకెల్లా అతి పెద్ద పులుల సంరక్షణ కేంద్రంగా ఉంది. 1983లో నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వు ఏర్పాటు చేసే నాటికి సుమారు 30 పులులుండగా, ప్రస్తుతం 75కి పెరిగాయి.

'ఆహార ఉత్పత్తులకు కేంద్ర బిందువు ఆంధ్రా'

కేసీసీఐ డైరెక్టర్ అమిత్ జోషి


తాడేపల్లిరూరల్: ఆహార ఉత్పత్తులకు, వ్యవసాయ వ్యాపార రంగానికి కేంద్ర బిందువుగా ఆంధ్రప్రదేశ్ ఉందని నాలెడ్జ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(కేసీసీఐ) డైరెక్టర్ అమిత్ జోషి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరికి సమీపంలోని ప్రాతూరు పార్ఛ్యూన్ గ్రాండ్‌లో శుక్రవారం జరిగిన కాన్‌క్లేవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మీడియాతో మాట్లాడారు. నాబార్డ్ ప్రాజెక్ట్ లీడ్ కె.సుభాష్ కిరణ్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రి బిజినెస్‌ల ప్రోత్సాహకానికి ఏపీ ప్రభుత్వం ప్రత్యేక విధానాల అమలుతో పాటు రాయితీలు కూడా ఇస్తోందన్నారు. ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు నాబార్డు డీజీఎం ఎంఎస్ఆర్‌సీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూడురోజులు తేలికపాటి వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, రుతుపవన ద్రోణి, నైరుతి రుతుపవనాల చురుకుదనం ప్రభావంతో ఐదారు రోజులు రాష్ట్రంలో పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. అల్పపీడనం బలహీనపడడంతో పాటు నైరుతి రుతుపవనాల చురుకుదనం కూడా తగ్గింది. ఫలితంగా శుక్రవారం నుంచి వానలు చిరుజల్లులకే పరిమితమయ్యాయి. శుక్రవారం కర్నూలు జిల్లా కామవరంలో మాత్రమే గరిష్టంగా 1.2 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. మరెక్కడా ఒక్క సెంటీమీటరుకు మించి వర్షం కురవలేదు. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.

బీసీలకు ఏం చేశారో చెప్పే దమ్ముందా? : మోపిదేవి



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

సాక్షి, న్యూఢిల్లీ: గత ఐదేళ్ల టీడీపీ హయాంలో బీసీలకు ఏం మేలు చేశారో చెప్పే దమ్ముందా అని టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌లను వైఎస్సార్‌సీపీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ప్రశ్నించారు. 2014 నుంచి 2019 వరకు బీసీ సామాజికవర్గాలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయపరంగా టీడీపీ ఏం మేలు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ప్రశ్న పలుసార్లు అడిగినా సమాధానం చెప్పడానికి ఎందుకు భయపడి వెనుకంజ వేస్తున్నారో తెలియడం లేదన్నారు. బీసీల భవిష్యత్తు, అభ్యున్నతికి ఫలానా పథకాలు అమలు చేశామని చెప్పే దమ్ము, ధైర్యం టీడీపీ నేతలకు లేవని ఎద్దేవా చేశారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, బీద మస్తాన్‌రావు, బి.వి.సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీసీ సామాజికవర్గ సోదరులంతా తన వాళ్లంటూ అక్కునచేర్చుకున్న మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని గర్వంగా చెబుతున్నామన్నారు.

ఉదారంగా వరద సాయం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతి కుటుంబానికి రూ.2 వేలు చొప్పున ఇవ్వాలని, వ్యక్తులైతే రూ.1,000 చొప్పున అందచేయాలని ఆదేశించారు. కచ్చా ఇళ్లను నష్టపోయిన బాధితులకు రూ.10 వేల చొప్పున సాయం అందించి ఆదుకోవాలని నిర్దేశించారు. శిబిరాల్లో తలదాచుకునే బాధితులకు మంచి సదుపాయాలను కల్పించడంతోపాటు ముంపు ప్రాంతాల్లో బియ్యం, ఉల్లిపాయలు, కందిపప్పు, బంగాళా దుంపలు, పామాయిల్ పంపిణీ చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, నదుల్లో వరద ప్రవాహం, సహాయ, పునరావాస కార్యక్రమాలపై ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...



వరదలు, సహాయ, పునరావాస చర్యలపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్

ఐదు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం భద్రాచలం వద్ద నీటిమట్టం 49.60 అడుగులు ఉంది. శనివారం 53.81 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ధవళేశ్వరం వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 13 లక్షల క్యూసెక్కులు ఉంది. ఇది రేపటికి (శనివారం) సుమారు 16 లక్షలకు చేరుకుని ఆ తర్వాత క్రమేపీ తగ్గుముఖం పట్టే అవకాశాలున్నట్లు అంచనా. ప్రవాహం 17 లక్షల క్యూసెక్కులు ఉంటే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తుతం రెండు, మూడు ప్రమాద హెచ్చరికల మధ్యలో అంటే 13–17 లక్షల క్యూసెక్కుల లోపే ప్రవాహం ఉంటుంది. గతేడాది గోదావరిలో 26 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని చూశాం.

శిబిరాల్లో మంచి సదుపాయాలు

లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇప్పటికే కొన్ని చోట్ల ఖాళీ చేశారు. 16 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అవసరం అనుకుంటే పరిస్థితిని అంచనా వేసి మిగిలిన వారిని కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. బాధితులకు సహాయ శిబిరాల్లో మంచి సదుపాయాలు కల్పించాలి. శిబిరాల్లో స్వయంగా అధికారులే ఉంటే ఎలాంటి సదుపాయాలను కోరుకుంటారో అలాంటి సదుపాయాలన్నీ కల్పించాలి. ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి.

కచ్చా ఇళ్లపై వర్గీకరణే వద్దు..

మరో ముఖ్యమైన అంశం.. కచ్చా ఇళ్ల విషయంలో కలెక్టర్లు మానవీయ దృక్పథంతో ఉదారంగా వ్యవహరించాలి. కచ్చా ఇళ్ల బాధితులను సహాయ శిబిరాల నుంచి తిరిగి పంపించేటప్పుడు రూ.10 వేల చొప్పున సాయంగా అందించాలి. అది వారికి తిరిగి కచ్చా ఇంటిని నిర్మించుకునేందుకు, మరమ్మతులు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. లేదంటే వారు ఎక్కడికి వెళ్లాలో తెలియక అవస్థలు ఎదుర్కొంటారు. కచ్చా ఇంటి విషయంలో పాక్షికంగా దెబ్బతిందా? లేక పూర్తిగా దెబ్బతిందా? అనే వర్గీకరణే వద్దు. వారు ఉండేదే కచ్చా ఇళ్లు అయినప్పుడు ఇక వర్గీకరణ అనవసరం. అలాంటి వారి జీవితాలపై మరింత భారం పడేలా వ్యవహరించకూడదు. అందుకే మానవీయ దృక్పథంతో ఉండాలని కలెక్టర్లను కోరుతున్నా. ఇలాంటి సమయాల్లో వారికి బాసటగా నిలిచామనే మాట రావాలి.

బియ్యం, ఉల్లిపాయలు, కందిపప్పు, బంగాళా దుంపలు, పామాయిల్..

ముంపునకు గురైన ఇళ్లు, వరదనీరు ప్రవహించిన ప్రాంతాల్లో నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలి. ఉదారంగా నిత్యావసరాలను అందించాలి. 25 కేజీల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు, కేజీ పామాయిల్, కేజీ కందిపప్పు ఇవ్వాలి. మొత్తంగా బాధితుల పట్ల మరింత ఉదారంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.

సచివాలయాల స్థాయిలో కంట్రోల్ రూమ్స్

రాష్ట్రంలో నాలుగేళ్లుగా ప్రతి ఏటా ఇలాంటి పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటున్నాం. ఇప్పుడు కూడా అప్రమత్తంగా ఉండాలి. కంట్రోల్ రూమ్స్‌కు సంబంధించి జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకూ ఏర్పాటు చేయాలి. సచివాలయాల స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయండి. సచివాలయాల సిబ్బందితో పాటు వలంటీర్ల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలి.

ముంపు గ్రామాలు, లంకలపై ప్రత్యేక దృష్టి

ముంపు బాధిత గ్రామాలు, లంకలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఆయా ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులు సరిపడా నిల్వ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనిపై మరోసారి సమీక్షించి సిద్ధంగా ఉండాలి. లంక గ్రామాలలో జనరేటర్లు లాంటి వాటిని కూడా సిద్ధం చేసుకోండి.

తాగునీటి కొరత లేకుండా..

తాగునీటి కొరత లేకుండా, సరఫరా వ్యవస్థలకు ఆటంకాలు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలి. తాగునీటి ప్యాకెట్లను సిద్ధం చేసుకోండి. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టండి. బ్లీచింగ్, ఫినాయిల్ లాంటివి సిద్ధంగా ఉంచాలి. ఆరోగ్య శిబిరాల ఏర్పాటుపై కూడా ప్రత్యేక ధ్యాస పెట్టాలి. విలేజ్ క్లినిక్స్, పీహెచ్‌సీలలో సరిపడా మందులను ఉంచాలి. వీటిపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించుకోవాలి. వరదల కారణంగా పాము కాట్లు లాంటి ఘటనలు జరిగితే అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి.

వరద తగ్గాక పంట నష్టం నమోదు

వరద నీరు తగ్గాక పంట నష్టం వివరాలను నమోదు చేసుకుని రైతులకు బాసటగా నిలవాలి. అత్యంత పారదర్శక పద్ధతిలో ఎన్యుమరేషన్ జరగాలి. వరద ప్రభావిత ప్రాంతాల్లో గర్భవతులు, బాలింతల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్యం, మంచి సదుపాయాలు ఉన్నచోటకు ముందే తరలించాలి. ప్రతి విషయంలోనూ ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందన్న సందేశాన్ని అందించాలి.

సమావేశంలో హోం, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి తానేటి వనిత, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి. సాయిప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, ఆర్ అండ్ బీ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఏ.సూర్యకుమారి, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ జి.లక్ష్మీషా, ఏపీ విపత్తు నిర్వహణశాఖ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

లంకల్ని ముంచెత్తిన వరద

- విలీన మండలాల్లో ముంపు బారిన గోదావరి తీర గ్రామాలు
- కాజ్‌వేల వద్ద పడవలు, ట్రాక్టర్లపై రైతుల్ని దాటిస్తున్న అధికారులు
- అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాయనపేట వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన కారు
- ప్రమాదం నుంచి బయటపడిన ముగ్గురు వ్యక్తులు
- కూనవరం వద్ద వాగులో కొట్టుకుపోయి వృద్ధురాలు మృతి
- ఏలూరు జిల్లా బలివే అడ్డరోడ్డు వద్ద తమ్మిలేరుపై కొట్టుకుపోయిన రహదారి
- నందిగామ సమీపంలో ఐతవరం వద్ద హైవేపై రాకపోకల పునరుద్ధరణ

సాక్షి నెట్‌వర్క్: గోదావరి నదిలో ప్రవాహం మహోగ్ర రూపం దాల్చడంతో లంక గ్రామాల్లో ముంపు తీవ్రత మరింత పెరిగింది. లంకలను పూర్తిస్థాయిలో వరద ముంచెత్తగా.. విలీన మండలాల్లోని పలు గ్రామాల్లోకి వరద నీరు చేరింది. పోలవరం ప్రాజెక్ట్ ముంపు మండలాలైన వేలేరుపాడులో 10 గ్రామాలు, కుక్కునూరు మండలంలో 9 గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో అక్కడి ప్రజలను అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేలేరు–బూర్గుంపాడు, వేలేరు–సీతానగరం రహదారులు నీట మునిగాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో వరద పరిస్థితులు నెలకొన్నాయి. గోదావరి ఉధృతికి శబరి నది ఎగపోటుకు గురికావడంతో చింతూరు మండలంలోనూ వరద పెరుగుతోంది. ముందుగా ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించిన అధికారులు ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు. వరద బాధిత కుటుంబాలకు కేజీ చొప్పున కందిపప్పు పంపిణీ చేశారు. శుక్రవారం శబరి నది కొంత తగ్గడంతో ఆంధ్రా నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు కొనసాగాయి.



అంబేడ్కర్ కోనసీమ జిల్లా జి.పెదపూడి రహదారిపై మోకాలి లోతు నీటిలో నడిచివెళ్తున్న రైతులు

దిగువన లోతట్టు ప్రాంతాల్ని ముంచెత్తుతున్న వరద

గోదావరికి దిగువన గల అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ముంపు తీవ్రత మరింత పెరిగింది. నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లను, రోడ్లను, కాజ్‌వేలను వరద ముంచెత్తుతోంది. పి.గన్నవరం మండలంలోని నాలుగు లంకలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోగా.. మరో నాలుగు లంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. ఈ గ్రామాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నాయి. అయినవిల్లి మండలంలో ఎదురు బిడియం, మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేపై ముంపు తీవ్రత పెరగడంతో ట్రాక్టర్లు, పడవల మీద ప్రయాణికులు, రైతులను దాటిస్తున్నారు. కోనసీమ జిల్లాలోని పది మండలాల పరిధిలోని 48 గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు వరద నీరు వచ్చి చేరింది. సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు భోజనాలను అందిస్తున్నారు. అల్లవరం మండలం బోడసుకుర్రు పల్లిపాలెంలో వరద ముంపు మరింత పెరిగింది. 50 వరకు ఇళ్లు నీట మునిగాయి. ఎదురుబిడియం కాజ్‌వే వద్ద వరద తీవ్రతను గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్, బోడసకుర్రు వద్ద ముంపు ప్రాంతాలను రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పరిశీలించారు. ఏటిగట్ల పరిరక్షణకు ప్రతి అర కిలోమీటర్‌కు ఒక వలంటీర్ చొప్పున 740 మంది వలంటీర్లను రక్షణగా ఏర్పాటు చేశామని కోనసీమ కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా కనకాయలంక, పుచ్చల్లంక వద్ద వరద ఉధృతి మరింతగా పెరిగింది. యలమంచిలి మండలం కనకాయలంక, ఆచంట మండలం అయోధ్యలంక గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వాగులో కొట్టుకుపోయి వృద్ధురాలి దుర్మరణం

అల్లూరి జిల్లా కూనవరం మండలం దూగుట్టకు చెందిన మడకం భద్రమ్మ (65) అనే వృద్ధురాలు పశువులను మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయి మృతి చెందింది. అదే జిల్లాలోని ఎటపాక మండలంలో రాయనపేట వద్ద ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద నీటిలో కారును దాటించేందుకు ప్రయత్నించగా.. ప్రవాహ ఉధృతికి కారు గల్లంతైంది. అందులో ప్రయాణిస్తున్న భద్రాచలం వాసులు ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు. స్థానికుల సాయంతో నడుచుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. కాగా.. ఏలూరు జిల్లా పెదవేగి మండలంలో బలివే అడ్డరోడ్డు వద్ద తమ్మిలేరుపై గల రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోయింది.

వరద విధుల్లో వలంటీర్లు

అల్లూరి జిల్లా చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో 873 మంది గ్రామ వలంటీర్లు ఉండగా.. వరద ప్రభావిత ప్రాంతాల్లో 550 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ముంపు ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా వారి అవసరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తున్నారు.

ఐతవరం వద్ద రాకపోకలు పునరుద్ధరణ

ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో మున్నేటి వరద ఉధృతి క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. 65వ నంబర్ జాతీయ రహదారిపై ఐతవరం సమీపంలో విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలను గురువారం సాయంత్రం నిలిపివేయగా.. శుక్రవారం 7 గంటల నుంచి వాటి రాకపోకలను అనుమతిస్తున్నారు. ముందుగా కేవలం విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలను మాత్రమే పంపుతున్నట్టు ఏసీపీ జనార్దన్ నాయుడు తెలిపారు. పూర్తి స్థాయిలో వరద తగ్గిన తర్వాతే రెండు వైపులా అనుమతిస్తామన్నారు.

ముంపు ముంగిట్లో రాజధాని అమరావతి

- నిపుణుల కమిటీల నివేదికలు పక్కన పెట్టిన ఫలితమే రాజధాని ముంపు
- హైకోర్టు, సచివాలయం, విట్, ఎస్ఆర్ఎం కళాశాలలను చుట్టుముట్టిన వరద నీరు
- కళాశాలలు, విధులకు వెళ్లేందుకు విద్యార్థులు, ఉద్యోగులకు తప్పని అవస్థలు



కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించడంతో నీరుకొండలోని ఎస్ఆర్ఎం కళాశాల సమీపంలో నీరు

తాడికొండ : ప్రపంచ ప్రఖ్యాత రాజధాని నిర్మిస్తానని చంద్రబాబు చెప్పిన గొప్పలు చిన్నపాటి వర్షానికే వెక్కిరిస్తున్నాయి. అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి పనికిరాదని, శివరామకృష్ణన్, బోస్టన్, జీఎన్ రావు వంటి నిపుణుల కమిటీలు ఇచ్చిన నివేదికలను తొక్కిపెట్టిన చంద్రబాబు నారాయణ కమిటీ వేసి తనకు అనుకూలంగా రాజధాని నిర్మించుకున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన చంద్రబాబు నిర్వాకం ఫలితంగా రాజధాని ప్రాంతానికి ఇబ్బందులు తప్పడం లేదు. కొండవీటి వాగు, కోటేళ్ల వాగు, చీకటి వాగుకు వచ్చే భారీ వరద నీటిని మళ్లించేందుకు గత ప్రభుత్వ హయాంలో తగిన చర్యలు తీసుకోకపోవడంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సచివాలయం, హైకోర్టును వరద నీరు భారీగా చుట్టుముట్టింది. విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు వెళ్లే రహదారులు సైతం పూర్తిగా నీట మునగడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేదు. కొండవీటి వాగుకు భారీగా వచ్చిన వరదతో పెదపరిమి, నీరుకొండ, ఐనవోలు, నేలపాడు ప్రాంతాల్లో పొలాలు, రోడ్లు ముంపునకు గురయ్యాయి. కోటేళ్ల వాగుకు బుధ, గురువారాలు ఉప్పొంగడంతో సచివాలయ, హైకోర్టు ఉద్యోగులు మంగళగిరి మీదుగా తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. ముందుచూపు లేకుండా ముంపు ప్రాంతంలో రాజధాని నిర్మించిన చంద్రబాబు నిర్వాకం ఫలితంగా ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరు జిల్లా వేలేరుపాడులో వరద బాధితులను తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం



వరద సహాయక చర్యల్లో పాల్గొన్న వలంటీర్లు



ఎన్టీఆర్ జిల్లా ఐతవరం వద్ద నిలిచిపోయిన భారీ వాహనాలు

ఉగ్ర గోదావరి

- కాళేశ్వరం, తుపాకులగూడెం, దుమ్ముగూడెం నుంచి భారీగా వరద
- భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ

సాక్షి, అమరావతి: గోదావరి పరీవాహక ప్రాంతమైన తెలంగాణలో కుండపోత వర్షాలు.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో ఉప నదులైన కడెం వాగు, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, తాలిపేరు, కిన్నెరసాని పొంగిపొర్లుతున్నాయి. దీంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ నుంచి 13,79,910 క్యూసెక్కులు, తుపాకులగూడెం వద్ద సమ్మక్క బ్యారేజీ నుంచి 14,47,560 క్యూసెక్కులు, దుమ్ముగూడెం వద్ద ఉన్న సీతమ్మ సాగర్ నుంచి 13,48,091 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తుండటంతో శుక్రవారం రాత్రి 8.43 గంటలకు భద్రాచలం వద్ద ప్రవాహం 14,32,336 క్యూసెక్కులకు చేరింది. నీటిమట్టం 53.1 అడుగులకు చేరుకోవడంతో భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

వచ్చిన వరదను వచ్చినట్టుగా..

భద్రాచలం నుంచి వస్తున్న వరదను వచ్చినట్టుగా.. పోలవరం ప్రాజెక్ట్ వద్ద 48 గేట్లను పూర్తిగా ఎత్తేసి దిగువకు వదిలేస్తున్నారు. దాంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి గంటగంటకూ పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీలోకి 13,04,652 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 4 వేల క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 13,00,652 క్యూసెక్కులను 175 గేట్లను ఎత్తేసి సముద్రంలోకి వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 13.90 అడుగుల వద్ద ఉండటంతో రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ఎగువ నుంచి శనివారం ధవళేశ్వరం బ్యారేజీలోకి గరిష్ఠంగా 15.84 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి ఎగువన వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. శ్రీరాంసాగర్‌లోకి 1.75 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. ప్రాజెక్టులో నీటిని నిల్వ చేస్తూ 88 వేల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 6.44 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 6.94 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన వరద తగ్గిన నేపథ్యంలో ఆదివారం నుంచి భద్రాచలం, పోలవరం, ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

కృష్ణమ్మకు భారీగా వరద

- ప్రమాదకర స్థాయిలో మున్నేరు ప్రాజెక్ట్ వద్ద వరద
- పొంగిపొర్లుతున్న కట్టలేరు, బుడమేరు, వైరా, వాగులు

సాక్షి, అమరావతి: తెలంగాణలోని ఖమ్మం, ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో విస్తారంగా కురిసిన వర్షాలకు మున్నేరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలోని మున్నేరు ప్రాజెక్ట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 1.97 లక్షల క్యూసెక్కుల ప్రవాహం రాగా.. అదే స్థాయిలో దిగువకు వదిలేశారు. ఈ ప్రవాహానికి కట్టలేరు, బుడమేరు, పాలేరు తదితర వాగులు, వంకల ప్రవాహం తోడవుతుండటంతో పులిచింతల ప్రాజెక్ట్‌కు దిగువన కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ప్రకాశం బ్యారేజీలోకి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 2,60,875 క్యూసెక్కులు చేరుతుండటంతో.. అంతే స్థాయిలో వరదను 55 గేట్లను 6 అడుగులు, 15 గేట్లను ఏడు అడుగుల మేర ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు. జూలై చివరి వారంలో ప్రకాశం బ్యారేజీకి ఈ స్థాయిలో వరద రావడం.. గేట్లు ఎత్తి సముద్రంలోకి ఈ స్థాయిలో వరదను వదిలేయడం ఇదే తొలిసారి. ఖమ్మం, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో శుక్రవారం వర్షాలు తెరిపి ఇవ్వడంతో శనివారం ప్రకాశం బ్యారేజీలోకి చేరే ప్రవాహం తగ్గనుంది.

ఎగువ కృష్ణాలో స్థిరంగా ప్రవాహం

పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గుముఖం పట్టినా కృష్ణా ప్రధాన పాయలో ఎగువన వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి 1.66 లక్షల క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. ప్రధాన ఉప నది తుంగభద్రలో వరద కాస్త తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1.07 లక్షల క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 59 టీఎంసీలకు చేరుకుంది. జూరాలకు ఎగువ నుంచి 1.22 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. అంతే స్థాయిలో స్పిల్ వే గేట్లు, విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువకు వదిలేస్తున్నారు. జూరాల నుంచి 1,20,390 క్యూసెక్కులు, స్థానికంగా కురిసిన వర్షాల వల్ల సుంకేశుల బ్యారేజ్ నుంచి 4,311, హంద్రీ నుంచి 117 వెరసి 1,24,818 క్యూసెక్కులు శ్రీశైలంలోకి చేరుతుండటంతో నీటి నిల్వ 45.53 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో శనివారం శ్రీశైలం ప్రాజెక్ట్‌లోకి చేరే వరద పెరగనుంది. ఇక తెలంగాణలో హైదరాబాద్, నల్గొండ జిల్లాల్లో విస్తారంగా కురిసిన వర్షాలకు మూసీ నుంచి పులిచింతలలోకి 55,144 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 28.03 టీఎంసీలకు చేరుకుంది. మరో 17 టీఎంసీలు చేరితే పులిచింతల ప్రాజెక్ట్ గేట్లు ఎత్తేయనున్నారు.

సహాయక చర్యలు ముమ్మరం

- ఉమ్మడి గోదావరి జిల్లాలకు రూ.12 కోట్లు విడుదల
- సురక్షిత ప్రాంతాలకు 2,659 మంది తరలింపు
- పునరావాస కేంద్రాలకు 1,528 మంది

సాక్షి, అమరావతి: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా ప్రభుత్వం ప్రత్యేక బృందాలను రంగంలోకి దిగింది. వరద పెరుగుతుండటంతో సహాయక చర్యలను ముమ్మరం చేసింది. వరద ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న 5 జిల్లాలకు ఇప్పటికే తక్షణ సహాయ చర్యల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రూ.12 కోట్లు విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాలకు రూ.3 కోట్ల చొప్పున, పశ్చిమ గోదావరి జిల్లాకు రూ.2 కోట్లు, తూర్పు గోదావరికి రూ.కోటి చొప్పున విడుదల చేశారు. ఇప్పటివరకు ఆ జిల్లాల్లో 2,659 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారిలో 1,528 మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన 4 పునరావాస కేంద్రాల్లో ఉన్నారు. 33 వైద్య శిబిరాలు నెలకొల్పారు. కోనసీమ జిల్లాలోని 110 గ్రామాల కోసం 150 బోట్లను సిద్ధం చేశారు. పునరావాస కేంద్రాలకు నిత్యావసర సరుకులు తరలించారు. అల్లూరి జిల్లాలో 18 గ్రామాలు ముంపు బారినపడే అవకాశం ఉందని గుర్తించి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు.

ఛీటింగ్ 'మార్గ'ం మూత!

▶ మొదటి పేజీ తరువాయి

దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసు దర్యాప్తునకు సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి..

మ్యూచువల్ ఫండ్స్, ఇతర సంస్థల్లో పెట్టుబడులు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మళ్లించి పెట్టిన పెట్టుబడులను సీఐడీ అటాచ్ చేస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ వివిధ మ్యూచువల్ ఫండ్స్, ఇతర ఆర్థిక సంస్థల్లో పెట్టిన పెట్టుబడులు రూ.1,035 కోట్లను అటాచ్ చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే సీఐడీని అనుమతినిస్తూ రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఉషాకిరణ్ మీడియా లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లో వాటాలను అటాచ్ చేసేందుకు హోంశాఖ అనుమతినిచ్చింది. ఈ నేపథ్యంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిట ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్న 88.50 శాతం వాటాతోపాటు ఉషోదయ ఎంటర్ ప్రైజెస్‌లో 44.55 శాతం వాటా అటాచ్ కానుంది. ఆ సంస్థల్లో ప్రధాన వాటాలను సీఐడీ అటాచ్ చేయనుంది. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని సీఐడీ ఇప్పటికే న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేసింది. న్యాయస్థానం అనుమతితో వాటిని అటాచ్ చేయనుంది.

రెండు కేసుల్లో చార్జ్‌షీట్లు దాఖలు

చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించిన మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ ఏడు కేసులు నమోదు చేసింది. వాటిలో రెండు కేసుల్లో న్యాయస్థానంలో చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. ఏ–1 చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజా కిరణ్, ఏ–3 మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లు (ఫోర్‌మెన్)తోపాటు మొత్తం 15 మందిపై క్రిమినల్ కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగం, విశ్వాస ఘాతుకానికి పాల్పడటం, రికార్డులను తారుమారు చేయడం తదితర నేరాలతోపాటు ఏపీ డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఏడు కేసుల్లో రెండింటిలో చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. మిగిలిన కేసుల్లో కూడా త్వరలోనే చార్జ్‌షీట్లు దాఖలు చేయడంతోపాటు చట్టపరంగా తదుపరి చర్యలు చేపడతామని సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. సీఐడీ విచారణకు గైర్హాజరైౖ రామోజీరావు, శైలజా కిరణ్ దర్యాప్తునకు సహకరించడం లేదన్నారు. ఈ అంశంతోపాటు చార్జ్‌షీట్ దాఖలు తరువాత చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తున్నామని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

చందాదారులకు తెలియకుండా.. న్యాయస్థానం కళ్లుగప్పి

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన 23 చిట్టీ గ్రూపుల మూసివేతకు సంబంధించి రాష్ట్ర చిట్ రిజిస్ట్రార్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కొందరు పిటిషన్లు దాఖలు చేయడం వెనుక లోగుట్టు బయటపడింది. న్యాయస్థానంలో పిటిషన్లు వేసిన కొందరు చందాదారులకు అసలు తమ పేరుతో అవి దాఖలైన విషయమే తెలియదని వెల్లడైంది. కొన్ని పత్రాలపై చందాదారుల సంతకాలు తీసుకుని ఇతరులే పిటిషన్లు దాఖలు చేసిన విషయం తమ దృష్టికి వచ్చినట్లు అమిత్ బర్దర్ తెలిపారు. తమ పేరిట పిటిషన్లు దాఖలైన విషయమే తెలియదని పలువురు వెల్లడించినట్లు చెప్పారు. అది న్యాయస్థానాన్ని మోసం చేయడం కిందకే వస్తుందని స్పష్టం చేశారు. దీనిపై న్యాయపరమైన చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా పత్రాలు అందచేసి సంతకాలు చేయాలని కోరితే మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు క్షుణ్నంగా చదవాలన్నారు. పూర్తిగా చదవకుండా సంతకాలు చేయవద్దని సూచించారు.

మూతపడ్డ 'మార్గదర్శి' వెబ్‌సైట్

ఆర్థిక అక్రమాలకు పాల్పడి పీకల్లోతు కూరుకుపోయిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా తమ వెబ్‌సైట్‌ను మూసివేసింది. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ సంస్థల్లో వాటాల అటాచ్‌మెంట్‌కు ప్రభుత్వం అనుమతించినట్లు సీఐడీ ఎస్పీ అమిత్ బర్దన్ వెల్లడించిన కాసేపటికే మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ వెబ్‌సైట్‌ను మూసివేయడం గమనార్హం. మార్గదర్శి డాట్‌కామ్ పేరుతో నిర్వహిస్తున్న వెబ్‌సైట్ శుక్రవారం సాయంత్రం నుంచి ఓపెన్ కావడం లేదు. వెబ్‌సైట్‌పై క్లిక్ చేయగా 'నిర్వహణ పరమైన అంశాలతో వెబ్‌సైట్ అందుబాటులో లేదు. త్వరలోనే పునరుద్ధరిస్తాం' అనే సందేశం కనిపిస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు సంబంధించిన అధికారిక సమాచారం అంతా అందులోనే ఉంటుంది. హఠాత్తుగా వెబ్‌సైట్ పనిచేయకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడుల వివరాలను గోప్యంగా ఉంచేందుకే వెబ్‌సైట్‌ను మూసివేసినట్లు భావిస్తున్నారు.

చంద్రబాబు అధికారంలో లేకుంటే హింస కోరుకుంటారు

- వినుకొండలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా
- పోలవరంపై మాట్లాడే అర్హత బాబుకు లేదు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సాక్షిఅమరావతి/వినుకొండ (నూజెండ్ల) : చంద్రబాబు నాయుడు తాను అధికారంలో లేకపోతే రాష్ట్రమంతా హింస చెలరేగాలని కోరుకుంటారని అది ఆయన నైజమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడితో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. 'వినుకొండలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా. స్థానికులకు వాస్తవాలేంటో స్పష్టంగా తెలుసు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరపకపోయి ఉంటే అక్కడ ఘటన మరింత ఘోరంగా ఉండేది. ఇటీవల బ్రహ్మనాయుడు వల్లభ డెయిరీ పెట్టారు. ఈ ఫాం నిర్మాణం కోసం గోతులు తవ్వి, మట్టి బయటకు తీశారు. దీన్ని ఆసరాగా చేసుకుని వేరే చోట నుంచి మట్టిని తరలిస్తున్నారంటూ జీవీ ఆంజనేయులు, టీడీపీ నేతలు యాగీ చేశారు. గోడలు దూకి బ్రహ్మనాయుడు స్థలంలోకి వెళ్లి ఫొటోలు తీసి సెల్ఫీ చాలెంజ్ చేశారు. వాచ్‌మెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు ఫైల్ చేయరా?. దానికి ధర్నా, ఊరేగింపు చేస్తూ ఈ గొడవకు ఆజ్యం పోశారు. బ్రహ్మనాయుడు జగనన్న సురక్ష కార్యక్రమానికి వెళ్తుంటే చుట్టూ మూగి కారుకు టీడీపీ జెండా కట్టారు. గన్‌మెన్లకు దెబ్బలు తగిలాయి. రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తారనే ఫ్రస్టేషన్‌తో జీవీ అంజనేయులు ఈ దాడులు చేయించారు' అని అన్నారు.

పోలవరాన్ని ఏటీఎంగా వాడుకున్నారు..

ఇటీవల చంద్రబాబు టీవీ సీరియల్ లాగా పోలవరం, వ్యవసాయం, రాయలసీమ పరిస్థితులపై పచ్చమీడియాలో సుదీర్ఘ ప్రసంగాలు చేస్తున్నారని, వ్యవసాయంపై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని మంత్రి అంబటి ధ్వజమెత్తారు. పోలవరాన్ని రామోజీరావు బంధువుదైన నవయుగ కంపెనీకి ధారాదత్తం చేసి పోలవరాన్ని ఏటీఎం లాగా వాడుకున్నారని దుయ్యబట్టారు. 14 ఏళ్లు ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన చంద్రబాబు అనే శనిని వైఎస్ రాజశేఖరరెడ్డి వదిలించారని, మరలా 2019లో వైఎస్ జగన్ ఇంటికి పంపారని అన్నారు. బాబు ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఏపీలో 300 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క కరువు మండలం కూడా లేదని వివరించారు. పల్నాడు ప్రాంతానికి సాగు, తాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అన్ని అనుమతులు వచ్చాయని చెప్పారు.

అసత్య ప్రచారాలపై క్రిమినల్ కేసు నమోదు

- విస్సన్నపేట జెడ్పీ హైస్కూల్ వసతులపై అసత్య కథనాలిచ్చారని ఎంఈవో ఫిర్యాదు
- 336, 448, 501 (34) సెక్షన్ల కింద కేసు నమోదు

తిరువూరు/విస్సన్నపేట: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని విస్సన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారంటూ కొన్ని పత్రికలు, చానళ్లలో వచ్చిన వార్తలు అవాస్తవమని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విస్సన్నపేట ఎంఈవో సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు రమేశ్ ప్రోద్బలంతో విద్యార్థులను శిథిలమైన, నిరుపయోగంగా ఉన్న రేకుల షెడ్డులో కూర్చోబెట్టి కొందరు మీడియా ప్రతినిధులు వీడియోలు, ఫొటోలు తీసి అసత్యపూరిత వార్తలను ప్రచారం చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రేణుక నేతృత్వంలో విచారణ అనంతరం నిర్ధారించారు. ఎంఈవో సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అసత్య వార్తలను ప్రసారం, ప్రచారం చేసిన వ్యక్తులపై ఐపీసీ 336, 448, 501 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తిరువూరు సీఐ భీమరాజు తెలిపారు. పాఠశాల ఆవరణలోకి అక్రమంగా, అనుమతి లేకుండా ప్రవేశించి ఫొటోలు, వీడియోలు తీయడం, ప్రమాదకరంగా ఉన్న రేకుల షెడ్డులో విద్యార్థులను బలవంతంగా కూర్చోబెట్టడం, అసత్య కథనాలను ప్రచారం చేయడం వంటి ఆరోపణలపై కేసు నమోదు చేశామని, ఇందుకు బాధ్యులైన అందరిపైనా చర్యలు తీసుకుంటామని సీఐ వెల్లడించారు.





హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ , హాజరైన న్యాయమూర్తులు,అధికారులు, ప్రముఖులు

హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం

▶ మొదటి పేజీ తరువాయి

జస్టిస్ లావు నాగేశ్వరరావు, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జస్టిస్ ఠాకూర్ కుటుంబ సభ్యులు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎన్.హరినాథ్, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి, పలువురు ప్రభుత్వ న్యాయవాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు. తేనీటి విందు అనంతరం జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేరుగా హైకోర్టుకు చేరుకున్నారు. హైకోర్టు నాలుగో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అకుల వెంకట శేషసాయితో కలిసికేసులను విచారించారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అవిశ్వాసం సరికాదు

- మణిపూర్ అంశంపై విజయసాయిరెడ్డి
- 'జాతీయ మీడియా' చర్చలో వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ : ఈశాన్య ప్రాంత చిన్న రాష్ట్రమైన, దేశ సరిహద్దులో ఉన్న మణిపూర్‌లోని వివాదాస్పద అంశంపై విపక్షాలు కేంద్రానికి మద్దతుగా కలిసి రావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వి.విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. సరిహద్దు దేశాల కుట్రల దృష్ట్యా అందరూ సమష్టిగా ఉండాల్సిన అవసరం ఉందని, కేంద్రంపై ప్రవేశపెట్టిన అవిశ్వాసాన్ని తిప్పికొట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం రాత్రి ఓ జాతీయ మీడియా చర్చలో ఢిల్లీ ఆర్డినెన్స్, విపక్షాలు కేంద్రంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఆయన మాట్లాడారు. ఢిల్లీ ఆర్డినెన్స్‌కు సంబంధించి విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ పూర్తిస్థాయి రాష్ట్రం కాదన్న విషయం గుర్తు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన ఢిల్లీ ఆర్డినెన్స్ సమాఖ్య స్ఫూర్తిని ఏమాత్రం దెబ్బ తీయట్లేదని స్పష్టం చేశారు. ఢిల్లీ ఆర్డినెన్స్ సుప్రీం కోర్టు తీర్పును ఏమాత్రం ఉల్లంఘించడం లేదన్నారు. అందువల్లే ఈ రెండు అంశాలపై వైఎస్సార్‌సీపీ కేంద్రానికి మద్దతు ఇస్తోందన్నారు.

బాలింతల్లో రక్తహీనతకు చెక్

ప్రసూతి మరణాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

- బాలింతలకు ఉచితంగా రూ.2వేలకు పైగా విలువైన ఎఫ్‌సీఎం ఇంజెక్షన్లు
- ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లేముందు వేయాలని నిర్ణయం
- సోమవారం నుంచి ప్రారంభం



సాక్షి, అమరావతి: ప్రసూతి మరణాల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రసవానంతరం చోటు చేసుకుంటున్న మాతృ మరణాల్లో 60 శాతం రక్తహీనత కారణంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో బాలింతల్లో రక్తహీనతకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మధ్యస్థ, తీవ్ర రక్తహీనతతో బాధపడే బాలింతలకు వచ్చే వారం నుంచి ఫెర్రిక్ కార్బాక్సి మాల్టోస్ (ఎఫ్‌సీఎం) ఇంజెక్షన్‌లను పంపిణీ చేయడానికి సిద్ధమవుతోంది. బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.2 వేలకుపైగా ఉన్న ఈ ఇంజెక్షన్‌లను ప్రసవానంతరం బాలింతలకు ప్రభుత్వం ఉచితంగా అందించనుంది.

ఆస్పత్రులకు ఇంజెక్షన్‌ల సరఫరా

రాష్ట్రంలో ఏటా సుమారు 9 లక్షల ప్రసవాలు నమోదవుతున్నాయి. వీరిలో 28 శాతం మంది వరకు మహిళల్లో రక్తహీనత ఉంటోందని వైద్యశాఖ అంచనా. ఈ నేపథ్యంలో ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో బిడ్డకు జన్మనిచ్చి డిశ్చార్జి అనంతరం ఇంటికి వెళ్లే ముందు బాలింతలకు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) టెస్ట్ నిర్వహిస్తారు. మధ్యస్థ, తీవ్ర రక్తహీనత ఉన్నవారికి ఆస్పత్రిలోనే ఎఫ్‌సీఎం ఇంజెక్షన్ వేసి డిశ్చార్జి చేస్తారు. మూడు వారాల అనంతరం వీరికి మళ్లీ హెచ్‌బీ టెస్ట్ నిర్వహించి రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరిగాయా.. లేదా.. అని పరీక్షిస్తారు. దీని ఫలితం ఆధారంగా అవసరమైతే రెండో డోసు కూడా ఇస్తారు.

దుష్ప్రభావాలు ఉండవు..

క్లినికల్ ట్రయల్స్‌లో మధ్యస్థ, తీవ్ర రక్తహీనత ఉన్నవారికి వెయ్యి ఎంజీ గరిష్ట మోతాదులో ఎఫ్‌సీఎం ఇంజెక్షన్ వేయగా, మూడు వారాల్లో సుమారు 1.5 శాతం మేర హిమోగ్లోబిన్ పెరిగినట్టు వెల్లడైంది. ఈ ఇంజెక్షన్ ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని తేలింది. ప్రసవానంతరం బాలింతలకు ఇంజెక్షన్ వేయడంపై న్యూఢిల్లీ ఎయిమ్స్‌లోని నేషనల్ అనీమియా కంట్రోల్, రీసెర్చ్ విభాగం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఇప్పటికే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ సహా పలు రాష్ట్రాల్లో బాలింతలకు ఎఫ్‌సీఎం ఇంజెక్షన్‌లు వేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో పరిశీలన అనంతరం బాలింతలకు ఇంజెక్షన్‌లు వేయడం సురక్షితమేనని నిర్ధారణకు వచ్చాక మన రాష్ట్రంలోనూ పంపిణీకి చర్యలు చేపట్టారు.

మార్గదర్శకాలు జారీ చేశాం



రూ.8.46 కోట్ల విలువ చేసే ఎఫ్‌సీఎం ఇంజెక్షన్ వెయిల్స్‌ను ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) సెంట్రల్ డ్రగ్ స్టోర్లకు సరఫరా చేశారు. అక్కడి నుంచి ఆస్పత్రులకు చేరుస్తున్నారు. సోమవారం నుంచి బాలింతలకు ఇంజెక్షన్‌ల పంపిణీ మొదలుపెడతాం. రక్తహీనత నుంచి బయటపడటానికి ప్రభుత్వం ఉచితంగా మాత్రలు పంపిణీ చేసినా కొందరు వాడకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో వారి ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి మధ్యస్థ, తీవ్ర రక్తహీనత ఉన్నవారికి ఎఫ్‌సీఎం ఇంజెక్షన్‌లను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. బాలింతల్లో రక్తహీనతను నివారించడానికి ఇవి దోహదపడతాయి.

– డాక్టర్ కేవీఎన్ఎస్ అనిల్‌కుమార్, అదనపు సంచాలకులు, వైద్య శాఖ

ఇక డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీ కార్డులు

- పేపర్ రహిత కార్డుల దిశగా రవాణా శాఖ
- దేశంలోనే తొలిసారిగా నేటి నుంచి రాష్ట్రంలో అమలు
- డిజి లాకర్, ఎం–పరివాహన్‌లో లభ్యం



సాక్షి, అమరావతి: ఇక నుంచి పేపర్ డ్రైవింగ్ లైసెన్స్‌లు, పేపర్ ఆర్సీ కార్డులుండవు. పేపర్ రహిత డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు, డిజిటల్ ఆర్సీ కార్డుల దిశగా రాష్ట్ర రవాణా శాఖ ముందడుగు వేసింది. డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీ కార్డులను ప్రింట్ చేసి జారీ చేసే పాత విధానానికి స్వస్తి పలికింది. దేశంలోనే తొలిసారిగా డిజిటల్ కార్డుల జారీ విధానానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా రవాణా శాఖ కీలక విధాన నిర్ణయం తీసుకుంది. డిజి లాకర్ /ఎం–పరివాహన్‌లోఇవి అందుబాటులో ఉంటాయి. రాష్ట్రంలో దశాబ్దాలుగా రవాణా శాఖ ప్రింటింగ్ డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీ కార్డులను అందిస్తోంది. ఇందుకోసం దరఖాస్తుతో పాటు ఒక్కో కార్డుకు రూ.200 ఫీజు, రూ.35 పోస్టల్ చార్జీలు వసూలు చేస్తోంది. అయితే ఈ విధానానికి శుక్రవారం నుంచి రవాణా శాఖ ముగింపు పలికింది. దాదాపు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న 25 లక్షలకు పైగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీ కార్డులను ప్రింటింగ్‌లో జారీ చేస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం ఇటీవలే రూ.33.39 కోట్లు కేటాయించింది. ఇక శనివారం నుంచి డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు, డిజిటల్ ఆర్సీ కార్డుల విధానం అమల్లోకి రానుంది. ఇక నుంచి దరఖాస్తుతో కార్డు కోసం రూ.200, పోస్టల్ చార్జీలకు రూ.35 వసూలు చేయరు. దరఖాస్తులను పరిశీలించి తగిన ప్రక్రియ అనంతరం డిజిటల్ విధానంలోనే వీటిని జారీ చేస్తారు. ప్రత్యేకంగా ఎం–పరివాహన్, డిజి లాకర్‌లో అందుబాటులో ఉంచుతారు. వాహనదారులు, దరఖాస్తుదారులు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని తమ మొబైల్ ఫోన్లో అందుబాటులో ఉంచుకోవాలి. ఎక్కడైనా ట్రాఫిక్ పోలీస్, రవాణా శాఖ అధికారులు అడిగితే ఆ డిజిటల్ ఫార్మాట్‌లో ఉన్న కార్డులను చూపితే సరిపోతుంది. మొబైల్ ఫోన్లు వాడని వారు ఆ కార్డులను ప్రింట్ తీసుకుని కూడా తమతో ఉంచుకోవచ్చు. వాటిని చూపినా అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు. ఇక నుంచి రవాణా శాఖ జారీ చేసే అన్ని డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీ కార్డులను ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంచుతారు.

వాహనదారులకు సౌలభ్యం

డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు, డిజిటల్ ఆర్సీ కార్డుల జారీ విధానం వాహనదారులకు సౌలభ్యంగా ఉంటుంది. వారి నుంచి కార్డుల కోసం ఫీజులు కూడా వసూలు చేయం. అవసరమైన అన్ని కార్డులు డిజిలాకర్ విధానంలో మొబైల్ ఫోన్లో అందుబాటులో ఉంచుకుంటే చాలు.

– ఎంకే సిన్హా, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్

ప్రవీణ్‌ప్రకాశ్, హరీశ్‌గుప్తాలకు హైకోర్టు నోటీసులు

కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం



సాక్షి, అమరావతి: రాజకీయ ర్యాలీలు, సభలు, ఇతర రాజకీయ కార్యక్రమాలకు పాఠశాలల విద్యార్థులను బలవంతంగా తీసుకెళ్లరాదంటూ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదని, ఈ ఆదేశాలకు విరుద్ధంగా ఇటీవల ముఖ్యమంత్రి సభకు విద్యార్థులను తరలించారంటూ హైకోర్టులో కోర్టుధిక్కార పిటిషన్ దాఖలైంది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆదివాసి గిరిజన చైతన్యవేదిక శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు చొక్కారావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి ధర్మాసనం విచారించింది. ఇందులో ప్రతివాదులుగా ఉన్న హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్‌లకు నోటీసులు జారీచేసింది. పిటిషనర్ ఆరోపణలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. పిటిషనర్ న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఇటీవల కురుపాంలో ముఖ్యమంత్రి సభకు అధికారులు విద్యార్థులను తరలించారని చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఇందుకు సంబంధించి రాతపూర్వక ఆదేశాలున్నాయా? అని ప్రశ్నించింది. ఎంఈవో ఉత్తర్వులిచ్చారని శ్రవణ్ తెలిపారు. విద్యార్థులను సభలో నిర్బంధించారని, వారిచేత నినాదాలు చేయించారని కొన్ని ఫొటోలను ధర్మాసనం ముందుంచారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం.. ఫొటోలను పరిశీలిస్తే సభలో పాల్గొన్న పిల్లలందరూ సంతోషంగా ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ప్రతివాదులకు నోటీసులు జారీచేసి, విచారణను వాయిదా వేసింది.

ఏపీ ట్రాన్స్‌కోలో నకిలీ లేఖ కలకలం

- 17 మందికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- అలాంటి ఆదేశాలేమీ ఇవ్వలేదని స్పష్టం చేసిన అదనపు కార్యదర్శి

సాక్షి, అమరావతి: ఏపీ ట్రాన్స్‌కోలో నకిలీ లేఖ కలకలం రేపింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలపై సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన ఆ ఆదేశాల ప్రతులు నిజం కాదని, అదంతా తప్పుడు ప్రచారమని ట్రాన్స్‌కో అదనపు కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 17 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోమని చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌కు తాను రాసినట్లుగా చక్కర్లు కొడుతున్న లేఖ అబద్ధమని తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కోకి సంబంధించి శాశ్వత ప్రాతిపదికన చేపట్టే నియామకాలు, ఉద్యోగ ప్రకటనలు ట్రాన్స్‌కో, ఇతర విద్యుత్ సంస్థల అధికారిక వెబ్‌సైట్లు, ప్రింట్ మీడియాలో ప్రకటన ద్వారా తెలియజేస్తామని వివరించారు. ఇలాంటి నకిలీ వార్తలను ప్రచారం చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు హెచ్చరించారు.

బెయిలు దరఖాస్తుపై శివశంకర్‌రెడ్డి స్పష్టత కోరవచ్చు

- వివేకా హత్య కేసు పిటిషన్లన్నీ ఒకే ధర్మాసనం విచారించాలా?
- ఉత్తర్వులేమైనా ఉంటే పరిశీలిస్తాం : సుప్రీంకోర్టు
- తదుపరి విచారణ సోమవారానికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో బెయిలు దరఖాస్తు చేసుకోవడానికి నిందితుడు శివశంకర్‌రెడ్డి కోర్టు ఉత్తర్వుల్లో స్పష్టత కోరవచ్చని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఇందులో తప్పేముందని ప్రతివాదుల్ని ప్రశ్నించింది. దర్యాప్తు అధికారిని మార్చాలంటూ శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సమయంలో ఆరు నెలల్లో ట్రయల్ ప్రారంభం కాకుంటే ఆయన బెయిలుకు దరఖాస్తు చేసుకోవచ్చని జస్టిస్ ఎంఆర్‌షా, జస్టిస్ సీటీ రవికుమార్ ధర్మాసనం మార్చి 29న ఆదేశాలిచ్చింది. ట్రయల్ ప్రారంభం అయితే ఎప్పటికీ బెయిలు పిటిషన్ దాఖలు చేసుకొనే అవకాశం లేదని, అందువల్ల ఆ ఉత్తర్వులపై స్పష్టత ఇవ్వాలంటూ తులసమ్మ మిస్‌లీనియస్ అప్లికేషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. బెయిలు పిటిషన్ దాఖలుకు మార్చి 29 నాటి ఉత్తర్వులు అడ్డురావని స్పష్టత ఇవ్వాలని తులసమ్మ తరపు సీనియర్ న్యాయవాది గిర ధర్మాసనాన్ని కోరారు. ఈ సమయంలో సునీత నర్రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ జోక్యం చేసుకొని.. వివేకా హత్య కేసుకు సంబంధించి వేర్వేరు పిటిషన్లు మరో ధర్మాసనం విచారిస్తోందని తెలిపారు. ఆ అంశాలకు, ప్రస్తుత మిస్‌లీనియస్ అప్లికేషన్‌కు సంబంధం లేదని గిరి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సంబంధం లేని వాదనలు చేస్తుంటే ప్రధాన ప్రతివాది సీబీఐ న్యాయవాదులు ఏమీ మాట్లాడడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అన్ని పిటిషన్లూ ఒకే ధర్మాసనం విచారించాలని ఏమైనా ఆదేశాలు ఉన్నాయా అని జస్టిస్ సీటీ రవికుమర్ ప్రశ్నించగా లేవని అగర్వాల్ సమాధానమిచ్చారు. ఒకే ధర్మాసనం అన్ని పిటిషన్లు విచారించాలా అని ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో రిజిస్ట్రీ వద్ద పరిశీలిస్తామన్న ధర్మాసనం.. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

కేఎల్‌యూలో మరో విద్యార్థి ఆత్మహత్య

- నాలుగు రోజుల కిందటే ఓ విద్యార్థి ఆత్మహత్య
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ప్రదీప్‌రెడ్డి అన్నయ్యను విచారిస్తున్న తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి, సీఐ శేషగిరిరావు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో శుక్రవారం బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు రోజుల కిందట బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యార్థి ఇదే విధంగా మృతి చెందడంతో అటు యూనివర్సిటీలోను, అధికార యంత్రాంగంలోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ఘటనపై పోలీసులు, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. సీఐ శేషగిరిరావు, తాడేపల్లి తహశీల్దార్ నాగిరెడ్డితో కలిసి విచారణ చేపట్టారు. సీఐ తెలిపిన వివరాలు.. కర్నూలుకు చెందిన గడ్డం రామిరెడ్డి, జయలక్ష్మిల రెండో కుమారుడు గడ్డం ప్రదీప్‌రెడ్డి(18) స్నేహితుడు వేణుగోపాలరెడ్డితో కలిసి కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరంలో చేరాడు. తన అన్నయ్య రవీంద్రరెడ్డి కూడా ఇక్కడే చదువుకున్నాడు. పదిరోజుల కిందట ఇక్కడకు వచ్చిన ప్రదీప్‌రెడ్డి రోజూ అన్నయ్యతో ఫోన్‌లో మాట్లాడేవాడు. అమ్మానాన్న గుర్తుకొస్తున్నారు.. ఇంటికి వెళ్లాలనిపిస్తోంది.. అంటూ స్నేహితులతో చెప్పేవాడని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, బాయిస్ హాస్టల్ బాత్‌రూమ్‌లో ఉన్న పైపునకు నైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న రవీంద్రరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విచారణ కమిటీ ఏర్పాటు

నాలుగు రోజుల వ్యవధిలో ఒకే కారణంతో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడంతో అధికారులు యూనివర్సిటీలో ఏం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25న బీటెక్ మొదటి సంవత్సరం చదివేందుకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మదీనా జిల్లా కొత్తపల్లి నుంచి వచ్చిన సౌరదీప్‌చౌదరి(19) ఇంటికి వస్తానని తల్లిదండ్రులకు ఫోన్ చేయడం.. తల్లిదండ్రులు నిరాకరించడంతో 11వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల మీద బెంగతోనే ప్రదీప్‌రెడ్డి ఆత్యహత్య చేసుకున్నాడని యూనివర్సిటీ యాజమాన్యం చెబుతోంది. కాగా, ఈ ఆత్మహత్యలపై గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి స్పందించి విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

సేంద్రియ మత్స్య ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- విజయవాడలో దక్షిణ భారత సీఫుడ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో మంత్రి అప్పలరాజు
- త్వరలో ఇతర ప్రముఖ నగరాల్లో సీఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తామని వెల్లడి

సాక్షి, అమరావతి: సమాజంలో ప్రతి ఒక్కరు దృఢంగా, ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ మత్స్య ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ రోజురోజుకు పెరుగుతోందని, ఎలాంటి రసాయన అవశేషాల్లేని సముద్ర మత్స్యఉత్పత్తులను కూడా సేంద్రియ ఉత్పత్తులుగానే పరిగణించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో భూమి ఆర్గానిక్స్ సహకారంతో విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో మూడురోజులు నిర్వహించే 2వ దక్షిణ భారత స్థాయి సీఫుడ్ ఫెస్టివల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా 50 లక్షల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తితో దేశంలోనే నంబర్–1 స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సగటు వినియోగం ఎనిమిది కిలోలకు మించడం లేదన్నారు. స్థానిక వినియోగం పెంచడమే లక్ష్యంగా ఫిష్ ఆంధ్ర–ఫిట్ ఆంధ్ర బ్రాండింగ్‌తో హబ్స్ అండ్ స్పోక్స్ మోడల్‌లో పెద్ద ఎత్తున మార్కెటింగ్ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఆక్వాహబ్, దానికి అనుబంధంగా రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 1,400 అవుట్‌లెట్స్‌ను ఏర్పాటు చేశామని, మరో రెండువేల అవుట్‌లెట్స్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ఔత్సాహికులు ముందుకొస్తే 40 నుంచి 60 శాతం సబ్సిడీపై యూనిట్లు మంజూరు చేయడమేగాక ప్రభుత్వపరంగా అవసరమైన అన్ని రకాల చేయూత అందిస్తామని తెలిపారు. ఔత్సాహికులను ప్రోత్సహించడం, మాంసాహార ప్రియుల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సీఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే కాకినాడ, రాజమహేంద్రవరాల్లో నిర్వహించిన ఫెస్టివల్స్‌కు అనూహ్య స్పందన లభించిందన్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న ఫెస్టివల్‌లో రూ.699కి అన్‌లిమిటెడ్ సీఫుడ్ బఫెట్ ఇస్తున్నట్లు చెప్పారు. త్వరలో విశాఖపట్నం, కర్నూలు, నెల్లూరు వంటి నగరాల్లో సీఫుడ్ ఫెస్టివల్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఫిష్ ఆంధ్ర ఆన్‌లైన్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు, ఏఎఫ్‌సీవోఎఫ్ చైర్మన్ కె.అనిల్‌బాబు, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ అంజలి, జేడీలు వి.వి.రావు, హీరానాయక్ పాల్గొన్నారు.



మాకు ప్రసాదించిన ఆయువు, దేహముతో నిన్ను సదా స్తుతించుచుందుము కనుక మాకు మంచి ఆయువు, దేహ దారుఢ్యము ప్రసాదించుము.

– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 29 జూలై 2023

అటవీ సంరక్షణ ఇలాగేనా!

'నేను అరణ్యంలో సంచరించివచ్చిన ప్రతిసారీ ఆ వృక్షాలకు మించి ఎంతో ఎత్తుకెదిగిన భావన నన్ను చుట్టుముడుతుంది' అంటాడు అమెరికన్ ప్రకృతి ప్రేమికుడు హెన్రీ డేవిడ్ థోరో. నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడటానికి, మన కళ్లముందే చిన్నబోతున్న పర్యావరణానికి జీవం పోయడానికి అడవులు ఎంతగానో తోడ్పడతాయి. అందుకే లోక్‌సభలో ఎలాంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో అతి ముఖ్యమైన అటవీ సంరక్షణ (సవరణ) బిల్లు ఆమోదం పొందటం ఆందోళన కలిగిస్తుంది. నాలుగు దశాబ్దాల క్రితం...అంటే 1980లో ఆమోదం పొందిన అటవీ సంరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదించింది. బిల్లు ప్రారంభంలోని లక్ష్య ప్రకటన ఎంతో ఉదాత్తమైనది. భూమండలం వేడెక్కి, పర్యావరణం దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకుంటున్న వర్తమానంలో అడవుల విస్తరణ అత్యవసరమని ఆ ప్రకటన తెలిపింది. 2030 నాటికల్లా అదనంగా దాదాపు మూడువందల కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గిస్తామని పారిస్ ఒడంబడికలో మన దేశం హామీ ఇచ్చిన సంగతిని కూడా ప్రస్తావించింది. ఇవి సాధించాలంటే అటవీ విస్తరణ, అడవులపై ఆధారపడిన వర్గాల జీవికను మెరుగుపరచటం అవసరమని బిల్లు సరిగానే గుర్తించింది. కానీ అటు తర్వాత ప్రతిపాదించిన సవరణలన్నీ అందుకనుగుణంగా లేవు. మణిపూర్‌లో దుండగులు సాగించిన అత్యంత అమానవీయ దురంతాలపై విపక్షాలు ఆగ్రహోదగ్రమై చర్చకు పట్టుబట్టిన పర్యవసానంగా పార్లమెంటు స్తంభించిపోవటంతో ఈ సవరణ బిల్లు బుధవారం మూజువాణి ఓటుతో గట్టెక్కింది. ఈమధ్యకాలంలో అత్యంత ప్రాధాన్యతగల ఫైనాన్స్ బిల్లులే ఆ దోవన ఆమోదం పొందిన సందర్భాలుంటున్నాయి. ప్రభుత్వ లావాదేవీలు నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది గనుక అది తప్పనిసరి కూడా కావొచ్చు. కానీ అటవీ సంరక్షణ చట్టం సవరణ బిల్లుకు అంత తొందరేమొచ్చింది?

దేశంలో 1980లో అటవీ సంరక్షణ చట్టం ఎందుకు తీసుకురావాల్సివచ్చిందో గుర్తుచేసుకోవాలి. అంతకుముందు మూడు దశాబ్దాలపాటు ప్రభుత్వాలు ఎడాపెడా అడవుల నరికివేతకు అనుమతిచ్చిన పర్యవసానంగా 42 లక్షల హెక్టార్ల అడవులు కోల్పోయామని గ్రహించిన తర్వాత ఆ చట్టాన్ని తీసుకొచ్చారు. నిజానికి ఆ చట్టం తీసుకొచ్చేనాటికి పర్యావరణంపై ఇప్పుడున్నంత చైతన్యం లేదు. 1985 తర్వాతే అంతర్జాతీయంగా కూడా పర్యావరణ స్పృహ పెరిగింది. ఒకరకంగా అటవీ సంరక్షణ చట్టం అత్యంత కఠినమైనది. అందువల్లే ఆ చట్టం వచ్చాక ఈ నాలుగు దశాబ్దాల్లో కోల్పోయిన అటవీ భూములు 15 లక్షల హెక్టార్ల లోపే. మన భూభాగంలో కేవలం 21 శాతం మాత్రమే అడవులున్నాయి. అందులో దట్టమైన అరణ్యాలున్న ప్రాంతం కేవలం 12.37 శాతం. ఈ దట్టమైన అడవులు ప్రధానంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రల్లోనే ఉన్నాయి. వీటిని ప్రాణప్రదంగా కాపాడుకోవటం, వీలైనంతమేరకు విస్తరించటం ధ్యేయం కావలసిన సందర్భంలో తీసుకొచ్చిన సవరణ బిల్లు అందుకనుగుణంగా లేదు. ప్రభుత్వ రికార్డుల్లో అడవులుగా నమోదైన భూములన్నీ అటవీ భూములకిందికే వస్తాయని 1980 చట్టం చెబుతుండగా, 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దాన్ని మరింత విస్తరించింది. నిఘంటు అర్థాన్ని సంతుష్టి పరిచేలా ఉండే భూములు సైతం ఆ చట్టం పరిధిలోకొస్తాయని తెలిపింది. తాజా బిల్లు దాన్ని పూర్తిగా మారుస్తోంది. 1980 లేదా ఆ తర్వాత ప్రభుత్వ రికార్డుల్లో అటవీ ప్రాంతంగా నమోదైవున్న భూములకు మాత్రమే ఆ చట్టం వర్తిస్తుందని చెబుతోంది. నాగాలాండ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో శతాబ్దాలుగా అడవులుగానే ఉంటున్నా ఇప్పటికీ ప్రభుత్వ రికార్డులకెక్కని భూములున్నాయి. ముఖ్యంగా గడ్డి భూములు, మడ అడవుల వంటి వాటికి అడవులుగా గుర్తింపులేదు. వాటికి అటవీ సంరక్షణ చట్టం వర్తించదని చెబితే ఏం జరుగుతుందో ఊహించటం కష్టం కాదు. దేశంలోని అటవీ భూముల్లో 15 శాతం ప్రాంతానికి ఈ సవరణ వల్ల కీడు జరుగుతుందన్నది పర్యావరణవేత్తల ఆందోళన. తాజా బిల్లు దేశభద్రతను ప్రస్తావించి అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతాలైన అధీన రేఖ, వాస్తవాధీన రేఖ వంటి చోట్ల వంద కిలోమీటర్ల పరిధిలో అటవీభూములుంటే వ్యూహాత్మక అవసరాల కోసం ఆ భూములను ముందస్తు అనుమతి లేకుండానే తీసుకోవచ్చన్న సవరణను ప్రతిపాదించింది. అధీన రేఖ, వాస్తవాధీన రేఖ ఉన్న ప్రాంతాలు పర్యావరణపరంగా ఎంతో సున్నితమైన హిమాలయ సానువుల్లో ఉన్నాయి. అక్కడ పర్యావరణానికి విఘాతం కలిగితే అదెంత ప్రమాదమో వేరే చెప్పనవసరం లేదు. అలాగే తీవ్రవాద కార్యకలాపాల ప్రాంతాలకూ ఈ మాదిరి మినహాయింపే ఉంది. దేశ రక్షణ, భద్రత అత్యంత కీలకమైనవే. వాటినెవరూ కాదనరు. కానీ అందుకు పర్యావరణాన్ని పణంగా పెట్టడం ఎలాంటి విపరిణామాలకు దారితీస్తుందో మరిచిపోకూడదు.

పెరుగుతున్న జనాభాకు తగిన మౌలిక సదుపాయాలు ఏర్పర్చటానికి అవరోధాలుంటున్న మాట వాస్తవం. ప్రాజెక్టుల అనుమతుల్లో జాప్యం చోటుచేసుకుంటున్న సంగతి కూడా కాదనలేనిది. కానీ పర్యావరణ హాని, అందువల్ల కలిగే విలయంతో పోలిస్తే ఇదేమంత లెక్కలోనిది కాదు. ఉత్తరాఖండ్‌లో ఇటీవలి పరిణామాలైనా, ప్రస్తుతం దేశమంతా ముంచెత్తుతున్న వరదలను చూసినా అడవుల సంరక్షణ, జీవ వైవిధ్యత పరిరక్షణ ఎంత ప్రాణప్రదమో అర్థమవుతుంది. కనుక అవసరాలకూ, ముంచుకొస్తున్న పర్యావరణ ముప్పుకూ మధ్య సమతూకం ఉండేలా మరింత మెరుగైన ప్రతిపాదనలుండాలి. పార్లమెంటు ఉభయ సభల్లో లోతైన చర్చలు జరిగితే ఇలాంటి సమస్యలు ప్రస్తావనకొచ్చి దిద్దుబాటుకు అవకాశం ఉంటుంది. ఆ పరిస్థితి లేకపోవటం విచారకరం.



గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.ఏకాదశి ఉ.8.34 వరకు తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.8.40 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** తె.4.20 నుండి 5.54 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.5.41 నుండి 7.23 వరకు, **అమృతఘడియలు:** ప.12.02నుండి 1.34 వరకు.



సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సాయంతో మనసు గెలిచే యత్నం

విశ్లేషణ



ఎస్.డి.ముని

జూలై 21 నాటి రణిల్ విక్రమసింఘే భారత్ పర్యటన తాలూకూ అజెండా బహుముఖీనమైనది. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తవడం ఒక సందర్భమైతే, శ్రీలంక రాజకీయాల్లో అత్యున్నత పదవిని అందుకునేందుకు పరోక్షంగా ఆశీస్సులందించిన భారత్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవడం మరొకటి. శ్రీలంక ప్రస్తుత సంక్షోభం, ఆర్థికమే. అందుకే విక్రమసింఘే ఆర్థిక సహకారం కోరుతూనే భారత్‌ను సందర్శించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని దేశాలు సురక్షితంగా అభివృద్ధి చెందుతూండాలన్న లక్ష్యంతో రూపొందించిన 'సాగర్', 'తొలుత పొరుగు' విధానాలతో భారత్ కూడా శ్రీలంకతో గొప్ప ఆర్థిక సమన్వయాన్ని ఆశిస్తోంది. ఇది పెరుగుతున్న చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడమే కాకుండా, వ్యూహాత్మకంగా శ్రీలంకలో భారత్ తన ఉనికిని పెంచుకునేందుకూ ఉపయోగపడుతుంది.

శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే ఇటీవలే భారత్‌కు వచ్చిపోయారు. బోలెడన్ని ఒప్పందాలు కుదిరాయి. చాలావరకూ ఆర్థిక వ్యవహారాలే. రణిల్ మనకు మిత్రుడే అన్నది చాలాకాలంగా ఉన్న గట్టి అభిప్రాయం. గత ఏడాది జూలైలో అధ్యక్షుడు గొటబయ రాజకపక్స దేశం నుంచి పారిపోవడం, ప్రజాగ్రహం నేపథ్యంలో తన పదవిని వదులుకోవాల్సి రావడం మనకు తెలిసిన విషయమే. అలాంటి అనూహ్యమైన, మునుపెన్నడూ లేని పరిస్థితుల్లో రణిల్ గద్దెనెక్కారు. దారుణమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతోంది ఆ దేశం అప్పుడు. సాధారణంగా పదవి చేపట్టిన కొద్ది కాలానికి శ్రీలంక నేతలు భారత్ పర్యటనకు రావడం కద్దు. కానీ ఈసారి రణిల్ ముందు దేశంలో పరిస్థితులు కొంతైనా చక్కబెట్టుకున్న తరువాతే, విదేశీ పర్యటనల గురించి ఆలోచించాల్సిన వచ్చింది. అటు ఆర్థిక, ఇటు రాజకీయాలూ సర్దుకున్న తరువాత ఆహ్వానం పంపుదామని భారత్ కూడా వేచి చూసింది.

75 ఏళ్ల దౌత్య బంధం

జూలై 21 నాటి రణిల్ విక్రమసింఘే భారత్ పర్యటన తాలూకూ అజెండా బహుముఖీనమైనది. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తవడం ఒక సందర్భమైతే, శ్రీలంక రాజకీయాల్లో అత్యున్నత పదవిని అందుకునేందుకు పరోక్షంగా ఆశీస్సులందించిన భారత్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవడం మరో విషయం. దేశవాళీ ఆర్థిక, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు తగిన సాయం అందిస్తున్నందుకూ విక్రమసింఘే కృతజ్ఞతలు చెప్పుకుని ఉంటారు. ఈ సాయం భవిష్యత్తులోనూ కొనసాగించేందుకు భారత్‌తో సమావేశాలు ఉపయోగపడి ఉంటాయి. ఎందుకంటే భారత్‌తో పాటు ఐఎంఎఫ్ లాంటి సంస్థల సాయంతో శ్రీలంక ఆర్థిక వ్యవస్థలో కొంత స్థిరత్వం కనిపిస్తున్నప్పటికీ పరిస్థితి పూర్తిగా చక్కబడలేదు. సబ్సిడీల తగ్గింపు, పన్నుల పెంపు వంటి సంస్కరణలకు ఐఎంఎఫ్ షరతులు విధించిన విషయమూ చెప్పుకోవాలిక్కడ. ఈ సంస్కరణల భారం మోయడం సామాన్యుడికి కష్టమైతే, ఆ అసంతృప్తిని వాడుకుని తిరగబడేందుకు శ్రీలంకలోని కొన్ని నియోజకవర్గ నేతలు కాచుకుకూర్చున్నారు.

శ్రీలంకకే చెందిన అంతర్జాతీయ ఆర్థికవేత్తలు సీపీ చంద్రశేఖర్, అహిల్ కదిర్గమర్ వంటి వారు ఐఎంఎఫ్ పథకం సమస్య పరిష్కారానికి అస్సలు ఉపయోగపడదనీ, పరిస్థితిని మరింత దిగజారుస్తుందనీ అభిప్రాయపడుతున్నారు. ఐఎంఎఫ్ షరతుల ప్రకారం శ్రీలంక 2031 వరకూ సంస్కరణలు కొనసాగించాల్సి ఉంటుంది. అంటే ఇంకో ఎనిమిదేళ్లు. చాలా సమయం. విక్రమసింఘేకు ఈ విషయమే కాకుండా, భవిష్యత్తులో ఎదురుకాగల సవాళ్ల గురించి కూడా తెలుసు. విదేశీ అప్పులు ప్రస్తుతం 40 బిలియన్ డాలర్ల వరకూ ఉంటే, అందులో 30 శాతం అయినా తగ్గించుకోవాలని చూస్తున్నారు. అలాగే



తొమ్మిదేళ్లపాటు రుణాల చెల్లింపులను నిలిపివేయడం అప్పులిచ్చే వారి ఆగ్రహానికి కారణమవుతోంది.

పొరుగుకు ప్రాధాన్యత

శ్రీలంక ప్రస్తుత సంక్షోభం ఆర్థికమే. అందుకే విక్రమసింఘే ఆర్థిక సహకారం కోరుతూనే భారత్‌ను సందర్శించారు. దేశ ఆర్థిక వ్యవహారాల్లో భారత్ జోక్యం పెరగాలని లంక ఆశిస్తోంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని దేశాలు సురక్షితంగా అభివృద్ధి చెందుతూండాలన్న లక్ష్యంతో భారత్ రూపొందించిన 'సాగర్'(సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ద రీజియన్), 'తొలుత పొరుగు' విధానాలతో భారత్ కూడా శ్రీలంకతో గొప్ప ఆర్థిక సమన్వయాన్ని ఆశిస్తోంది. వీటి ప్రకారం, పెరుగుతున్న చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడమే కాకుండా... వ్యూహాత్మకంగా శ్రీలంకలో భారత్ తన ఉనికిని పెంచుకునేందుకూ ఉపయోగపడుతుంది. ఇరుదేశాల మధ్య అనుసంధానాన్ని పెంచేందుకు, ఆర్థిక సమృద్ధికి ఉపయోగపడే కొన్ని చర్యలకు ప్రధాని మోదీ, విక్రమసింఘే తమ దార్శనిక పత్రం ద్వారా శ్రీకారం చుట్టారు. దీని ప్రకారం ఇరుదేశాల మధ్య అటు సముద్ర మార్గం ఇటు విమాన, భూతల మార్గాల ద్వారా కూడా కనెక్టివిటీ పెంచుకునేందుకు ప్రాధాన్యం ఉంటుంది. ఇందుకు తగ్గట్టుగానే తెగల పోరు నేపథ్యంలో 1980లో నిలిపివేసిన పడవల సేవలను పునరుద్ధరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

శ్రీలంక అధ్యక్షుడు విక్రమసింఘే పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య ఐదు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. యూపీఐ ద్వారా శ్రీలంకలో రూపాయి ద్వారా చెల్లింపులు జరపాలన్నది వీటిల్లో ఒకటి. ఇంధన రంగంతోపాటు ట్రింకోమలై ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి అదాని వంటి భారతీయ వ్యాపారవేత్తలకు సరికొత్త అవకాశాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. భారత పర్యటనలో విక్రమసింఘేను గౌతమ్ అదాని కూడా కలిసిన విషయం గమనార్హం.

శ్రీలంక తమిళుల సమస్య సున్నితత్వాన్ని గుర్తించిన విక్రమసింఘే ఆ విషయంలో తాను తీసుకోబోయే చర్యల గురించి ప్రధాని నరేంద్ర మోదీకి వివరించారు. 13వ రాజ్యాంగ సవరణ ప్రకారం, దక్షిణాఫ్రికా తరహాలో తమిళుల కోసం ఓ నిజనిర్ధారణ కమిటీ ఒకదాన్ని ఏర్పాటు చేయడం కూడా ఇందులో ఉంది. ప్రాంతాల వారీగా అధికార పంపిణీ జరగాలని 13వ సవరణ చెబుతోంది. అయితే దీని అమల్లో ఉన్న సాధకబాధకాల గురించి కూడా శ్రీలంక అధ్యక్షుడు భారత ప్రధానికి వివరించినట్లు తెలుస్తోంది. పార్లమెంటు అనుమతి లేకుండా పోలీసు తదితర సున్నితమైన వ్యవస్థల అధికారాలను పంపిణీ చేయడం కష్టమని వివరించారు. యునైటెడ్ నేషనల్ పార్టీ విక్రమసింఘే వర్గానికి ప్రతినిధి ఈయనొక్కరే. పార్లమెంటులో మద్దతు లభిస్తున్నది కూడా రాజపక్సే పార్టీ నుంచి మాత్రమే. రాజపక్సే పార్టీకి అధికార పంపిణీ సుతరామూ ఇష్టం లేకపోవడం గమనార్హం. ఈ విషయాలన్నింటినీ గుర్తు పెట్టుకునే ప్రధాని మోదీ రాజ్యాంగ సవరణ అమలును మరోసారి గుర్తు చేశారు. తమిళులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల కౌన్సిల్ ఎన్నికలు తొందరగా జరిపించడం గురించి ప్రస్తావించారు. తమ ప్రాంతంలో పెద్దగా అభివృద్ధి జరగడం లేదనీ, విక్రమసింఘే అధికార పంపిణీ ప్రణాళిక తమకు సమ్మతం కాదనీ తమిళ వర్గాలు ఇప్పటికే మోదీకి వేరుగా లేఖలు రాశాయి. తమిళ సామాజిక వర్గపు ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేలా లంకను ఒప్పించాలని వీరు కోరుతున్నారు.

కలిసి పనిచేయాలి

విక్రమసింఘే పర్యటనలో భద్రతా పరమైన అంశాలపై చర్చలు జరక్కపోయినా, చైనా అంశం కచ్చితంగా ఇద్దరు నేతల మనసుల్లో ఉండి ఉంటుంది. విక్రమసింఘే కొన్ని రోజుల క్రితమే ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా శ్రీలంకలో చైనా భద్రతా వ్యవహారాలు లేవని స్పష్టం చేయడం గమనార్హం. అంతేకాకుండా, భారత్‌కు ముప్పు కాగల ఎలాంటి విషయానికైనా శ్రీలంక వేదిక కాదని కూడా ఆయన ప్రకటించారు. ఇది చైనాకు చెక్ పెట్టేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు కొంత ఫలితం లభించినట్లే భావించాలి. భారత ప్రధాని మాట్లాడుతూ, 'భారత్ భద్రత, శ్రీలంక అభివృద్ధి రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. కాబట్టి ఇరు దేశాలు భద్రత, సున్నితత్వాలను దృష్టిలో ఉంచుకుని కలిసి పని చేయాలి' అన్నారు. అభివృద్ధి పనులతో భద్రతను పొందాలనుకోవడం భారత్ ఎంత సమర్థంగా, సకాలంలో తన ఆర్థిక హామీలు నెరవేర్చగలదన్న అంశంపై ఆధారపడి ఉంటుంది.

వ్యాసకర్త మాజీ దౌత్యవేత్త, శ్రీలంక రత్న అవార్డు గ్రహీత
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అవే సరిపోతాయి!



వైద్య విద్యార్థులంత బోరింగ్ మనుషులు ఈ భూమ్మీద ఉండరు. వాళ్లు ఎప్పుడూ అకాడమిక్స్, పరీక్షలు, పోస్టింగులు, అటెండెన్సుల గురించి తప్ప మాట్లాడరు. బాధాకరంగా నేను కూడా అందులో ఒకడిని.

– శుభం శర్మ, ఎంబీబీఎస్ విద్యార్థి

అయితే ద్రోహినే!



తీవ్ర టర్కిష్ జాతీయవాదులు నన్ను 'ద్రోహి' అంటున్నారు. ఎందుకంటే వాళ్ల అభిప్రాయంలో నిజమైన టర్క్ అంటే, ఆర్మేనియన్లను రూపుమాపడాన్ని గొప్పగా భావించాలి. దీని గురించి ఒక నిమిషం ఆలోచించండి.

– ఉజయ్ బులూత్, టర్కీ జర్నలిస్ట్

ఎలా మారిపోయారు?



పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత తీవ్రవాదానికి దారితీస్తాయనీ, విద్యాధిక యువత ఆ ఉచ్చులో పడరనీ నమ్మడం అత్యంత తప్పు. తీవ్రవాదులు కోపంతో, మూఢభక్తితో ఉంటారనుకోవడం కూడా భ్రమ అని కౌంటర్–టెర్రరిజం నిపుణుడు సేజ్‌మాన్ అంటారు. సాధారణంగా జిహాదీ తీవ్రవాదులు మంచి ధార్మిక కుటుంబాల నుంచి వచ్చిన మధ్యతరగతి, విద్యాధిక యువత అని ఆయన పరిశోధన చూపించింది.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

తిండి మైండ్‌సెట్



మంచి ఆహారపుటలవాట్లకు మారడంలో ఉన్న ప్రధాన అవరోధం ఏమిటంటే– తక్కువ నాణ్యత గల ఆహారం పట్ల ఉండే చాపల్యం. ఆహారాన్ని ఇష్టం కోణంలో కాకుండా, పోషణగా చూడటం మొదలుపెడితే, మన మైండ్‌సెట్ మారుతుంది.

– ప్రమీలా ముంద్రా, న్యూట్రిషనిస్ట్

ఎవరి గోల వారిదే!



సోషల్ మీడియాలో గమ్మత్తు ఏమిటంటే, నిన్నటిదాకా కనీసం మ్యాపులో మణిపూర్ ఎక్కడుందో గుర్తించలేనివాళ్లు కూడా, ఇవ్వాళ ఉన్నట్టుండి మైతేయి–కుకీల వివాదంలో వాళ్ల కథనాలు చిన్నప్పటినుంచీ తెలుసు అన్నంత ఆత్మవిశ్వాసంతో ఒక పక్షం వహిస్తున్నారు.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

జవాబులున్నాయా?



కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వాళ్ల అబ్బాయి, మనవడు కూడా చెప్పగలిగే అతి మామూలు ప్రశ్నలు! మే 29న మణిపూర్ పర్యటనకు వెళ్లినప్పుడు ఎఫ్ఐఆర్లు రిజిస్టర్ అయిన విషయం ఆయనకు తెలుసా? వాటి గురించి ప్రధాని మోదీకి సమాచారమిచ్చారా? పోలీసు ఆయుధాగారాన్ని మే 4న లూటీ చేశారని ఆయనకు తెలుసా?

– అనురాధా రామన్, జర్నలిస్ట్

కనబడదా?




అసలు భారతదేశంలో ఔషధ నియంత్రణలు ఎందుకు? యథేచ్ఛగా ఉత్పత్తులు జరగనీ. గుజరాత్ కేంద్రంగా పనిచేసే ఫార్మా కంపెనీ తయారుచేసిన కలుషిత కంటి చుక్కల వల్ల శ్రీలంకీయుల్లో ఇన్‌ఫెక్షన్లు వచ్చాయి. కంటి చూపు కూడా పోయింది. అయినప్పటికీ ఆ కంటి చుక్కల్ని అలాగే తయారుచేయడానికి అనుమతించారు. సిగ్గుచేటు!

– ఆర్. ప్రసాద్, సైన్స్ జర్నలిస్ట్

రచన ఏదైనా ప్రశ్నించడమే లక్ష్యం

సందర్భం




వారాల ఆనంద్

జావేద్ అఖ్తర్ ప్రతిభావంతమయిన కవి, వక్త, స్క్రీన్ ప్లే రచయిత. సూటిగా తన భావాల్ని ఎలాంటి వెరపూ, బెదురూ లేకుండా ప్రకటిస్తున్న సామాజిక గొంతుక ఆయనది. ఇవ్వాళ మన దేశంలో అత్యంత ప్రభావవంతమైన స్వతంత్ర లౌకిక స్వరం, జావేద్ అఖ్తర్.

భావుకుడు, ప్రగతిశీల వాది అయిన జావేద్ అఖ్తర్ ఏడు తరాల సాహిత్య చైతన్యమున్న కుటుంబంలో జన్మించారు. తన కవిత్వం మత తత్వానికి, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా రాశారు. జాతీయ సమైక్యత, స్త్రీల హక్కుల కోసం మాట్లాడారు, రాశారు. తప్పు దోవ పట్టిన యువతను ఉద్దేశించి జావేద్ రాసిన గీతాన్ని 1995లో కేంద్ర మానవ వనరుల శాఖ యువతకోసం 'జాతీయ గీతం'గా ప్రకటించింది.

గ్వాలియర్‌లో పుట్టిన జావేద్ లక్నో అలీగఢ్, భోపాల్‌లలో ఎదిగారు. బాంబే చేరిన తర్వాత ఆయన పరిధి బాగా విస్తారమయింది. జావేద్ తన మిత్రుడు సలీం ఖాన్‌తో కలిసి రాసిన స్క్రీన్ ప్లేలు 70వ దశకం మధ్య నుండి ఒక కొత్త ఒరవడిని సృష్టించాయి. దాంతో వారికి మొట్ట మొదటి విజయవంతమయిన సినిమా రాసే అవకాశం వచ్చింది. 'హాథీ మేరె సాథీ'. అది సూపర్ హిట్ కావడంతో ఆ జంట హిందీ సినీ రంగంలో హాట్ కేక్‌గా మారింది. 'సీతా ఔర్ గీతా' చిత్రానికి పనిచేసే సమయంలో జావేద్‌కు 'హనీ ఇరానీ'తో అయిన పరిచయం పెళ్లిదాకా వెళ్ళింది. వారిద్దరికీ జోయా, ఫర్హాన్‌లు జన్మించారు.

1979లో తన మొదటి కవిత రాశారు జావేద్. ఇంచుమించు అదే కాలంలో 'షబానా ఆజ్మీ'తో పరిచయం సాన్నిహిత్యంగా మారింది. 1995లో ఆయన మొట్ట మొదటి కవితా సంకలనం 'తర్కశ్' వెలువడింది. మొదటి సంకలనమే కవిత్వాభిమానుల నుంచీ, విమర్శకుల నుంచీ ప్రశంసను అందు



జావేద్ అఖ్తర్

కుంది. అంతేకాదు మన దేశంలో మొదటి ఆడియో బుక్‌గా కూడా ప్రాచుర్యం పొందింది. 1983లో హనీ ఇరానీ, జావేద్ విడిపోయారు. కానీ స్నేహంగానే ఉన్నారు.

సలీం–జావేద్ జంటగా 'అందాజ్', 'యాదోం కీ బారాత్', 'జంజీర్', 'దీవార్', 'షోలే', 'డాన్', 'త్రిశూల్' లాంటి సూపర్ డూపర్ హిట్ సినిమాలకు స్క్రిప్టు రాశారు. వాళ్ళు రాసిన 24 సినిమా స్క్రిప్టుల్లో 20 హిట్లు. ఆ తర్వాత ఆ జంట విడిపోయింది. 1981లో సలీం, జావేద్‌ల జంట విడిపోయాక జావేద్ అఖ్తర్ చాలా సినిమాలకు స్క్రిప్ట్ రచన చేశారు. వాటిల్లో 'సాగర్', 'మిస్టర్ ఇండియా', 'బెతాబ్', 'లక్ష్య' లాంటి విజయవంతమయిన సినిమాలు ఉన్నాయి.

తర్వాత జావేద్ అఖ్తర్ ఫిలిం గీతాలవైపు కదిలారు. అలాగే గొప్ప కవితలూ రాశారు. ఆయన రాసిన కవితలు, గజల్స్ సూటిగా మనసుకు హత్తుకుంటాయి. 'లావా' కవితా సంపుటి 2012లో వెలువడింది. దీనికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చింది. ఈ రెండు సంకలనాల్లోంచి ఎంపిక చేసిన కవితల సమాహారమే 'ఇన్ ఆదర్ వర్డ్స్.' అందులో ఆయన కాలాన్ని గురించి..

కాలమంటే ఏమిటి, /అలుపూ విరామమూ లేకుండా /సాగిపోతున్నది /అదట్లా ప్రయాణించకుండా ఉండి వుంటే అదెక్కడుండేది / ఎక్కడో ఒక చోట ఉండేది కదా... అంటూ గొప్ప తాత్వికతతో రాశారు. ఆయన కవిత్వమంతా ఆయన ఆత్మ నుండి ఒక ప్రవాహంలా సాగుతుంది. హృదయపు లోతుల నుండి పెల్లుబుకుతుంది. వర్తమాన అవ్యవస్థ గురించి తనకోపమూ, తన తాత్వికత, వేదన, దుఃఖం, ప్రశ్న–జవాబు ఇట్లా అనేకానేక స్థితులు ఆవిష్కరించారు. ఇందులో వర్తమాన మత ఛాందసవాదం గురించి ఖండిస్తూ రాశారు, మాట్లాడారు. ఇక పార్లమెంట్ సభ్యుడిగా ముందుండి మేధో హక్కుల గురించి, కాపీ రైట్ చట్టం గురించీ పోరాడి సాధించారు. ప్రశ్నించడమే తన తత్వమని అనేక సందర్భాల్లో నిరూపించారు.

వ్యాసకర్త సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత
(జావేద్ అఖ్తర్‌కు నేడు సినారె పురస్కార ప్రదానం)

నైపుణ్య విద్యను ప్రోత్సహించేలా...

సందర్భం



ప్రొఫెసర్ టి.వి. కట్టిమణి

జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)–2020 అమలులోకి వచ్చి జూలై 29 నాటికి మూడేళ్లవుతోంది. మునుపటి విద్యా వ్యవస్థలలోని భారీ అంతరాలను గుర్తించి నాణ్యమైన విద్యావకాశాలు అందరికీ సమానంగా అందించడం దీని ప్రధాన లక్ష్యం. ప్రీస్కూల్ విద్య నుండి ఆరో తరగతి వరకు మాతృభాష బోధనా మాధ్యమంగా ఉండాలని ఎన్ఈపీ ఉద్దేశం. అదేవిధంగా, అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ల కోసం కరిక్యులం, క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ కింద చేసిన సవరణలు ఏకకాలంలో రెండు పూర్తికాల విద్యా కార్యక్రమాలను కొనసాగించడాన్ని అనుమతిస్తున్నాయి. భౌతిక, ఆన్‌లైన్ మోడ్‌తో సహా, 4–సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలను ప్రోత్సహించడం వంటివి ఉన్నత విద్యలోని ముఖ్యాంశాలు.

ఎన్ఈపీ–2020 నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తోంది. అలానే తల్లిదండ్రులు, తోటివారి ఒత్తిడి నుండి విద్యార్థికి ఉపశమనం కలిగించడానికి కూడా ప్రాధాన్యం ఇస్తోంది. విద్యార్థులు ఒక సంస్థ నుండి మరొక సంస్థకు, ఒక కోర్సు నుండి మరొకదానికి మారడానికి అవకాశం కల్పిస్తోంది. నైపుణ్య విద్యను ప్రోత్సహించడంలో భాగంగా ఎన్ఈపీ నేరుగా విద్యా సంస్థలతో పరిశ్రమలకు సంబంధాలు ఏర్పరచి చదువుకునే సమయంలోనే సమాంతరంగా వారికి వివిధ వృత్తుల్లో శిక్షణ ఇచ్చి జీవితంలో స్థిరపడే అవకాశాలను కల్పిస్తోంది.

వినూత్న బోధనా పద్ధతులపై శిక్షణ అందించడం, ఐసీటీ సాధనాల విస్తృత వినియోగం వంటివి కూడా ఎన్ఈపీలో ముఖ్యమైన అంశాలు. ఎన్ఈపీ అధునాతన పాఠ్యాంశాలు, బోధనపై దృష్టి కేంద్రీకరిస్తూనే విద్యార్థుల సంభావిత అవగాహన, విమర్శనాత్మక ఆలోచనలనూ ప్రోత్సహిస్తోంది. యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్, పెర్ఫార్మింగ్, విజువల్ ఆర్ట్స్‌తో పాటు పాఠ్యాంశాలను పునరుద్ధరించడం, సమగ్ర పరచడం, గిరిజన జీవనశైలిని అర్థం చేసుకోవడానికి గిరిజన గ్రామానికి వెళ్లి



జీవించడం, 'డూయింగ్ వైల్ లెర్నింగ్' వంటి విద్యార్థి–కేంద్రీకృత పాఠ్యాంశాలు ఇందుకు నిదర్శనం. ఎన్ఈపీ–2020 కింద విద్యార్థుల అంతర్లీన అవసరాలను అభివృద్ధి చేయడానికి నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్స్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌హెచ్ఈక్యూఎఫ్) వంటి వివిధ ప్రోగ్రామ్‌లు ప్రారంభించబడ్డాయి.

ఎన్ఈపీ–2020 ఈక్విటీ, ఇన్‌క్లూజన్ అలాగే భాగస్వామ్య పాలన సిద్ధాంతాలపై ఆధారపడింది. అందువల్ల దివ్యాంగులు, మహిళలు, ఎల్‌జీ బీటీక్యూలు, ఎస్సీ, ఎస్టీలు, పీవీటీజీలు, డీఎన్‌టీలు వంటి వారికి సాధికారత కల్పించడం, వారికి సమానమైన అవకాశాలను అందిస్తూ అందుబాటులో ఉండటం ఇందులోని చాలా ముఖ్యమైన అంశం. గిరిజనుల కోసం 'ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల'లను బలోపేతం చేయడం, కొత్త ఉపాధ్యాయుల నియామకానికి ప్రాధాన్యత ఇవ్వడం, కొత్త ఈఎమ్ఆర్ఎస్ ప్రారంభించడం, 10–15 చిన్న పాఠశాలలను కలుపుతూ 'వన్ స్కూల్ కాంప్లెక్స్' పునర్నిర్మాణం వంటివి ఇందుకోసం తీసుకున్న కొన్ని చర్యలు. అంతర్జాతీయీకరణ, సహకారం, భాగస్వామ్య పద్ధతిలో పథకాలను బలోపేతం చేయడం, విదేశీ విశ్వవిద్యాలయాల ఆఫ్–షోర్ క్యాంపస్‌లను స్థాపించడానికి ఆహ్వానించడం, అలాగే దేశంలో డిజిటల్ ఈ–విశ్వవిద్యాలయాల స్థాపన... ఎన్ఈపీ అమలు ప్రారంభించిన తర్వాత తీసుకున్న మరికొన్ని కార్యక్రమాలు. ఎన్ఈపీ 'ల్యాబ్ టు ల్యాండ్', 'ల్యాండ్ టు ల్యాబ్'ను ప్రమోట్ చేస్తుంది.

మొత్తం మీద ఎన్ఈపీ–2020 గత మూడు సంవత్సరాల్లో అనేక స్పష్టమైన ఫలితాలను సాధించగలిగింది. బహుళ ప్రవేశ–నిష్క్రమణ విధానం ద్వారా ఇది విద్యార్థులకు నేర్చుకునే సౌకర్యవంతమైన మార్గాన్ని అందించింది. ఆ విధంగా ఎన్ఈపీ–2020 భారతీయ విద్యా వ్యవస్థ చరిత్రలో నిజమైన గేమ్ ఛేంజర్ అని చెప్పవచ్చు.

వ్యాసకర్త వైస్ ఛాన్సలర్, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం
(ఎన్ఈపీ ప్రారంభమై మూడేళ్లు)

సీఎం జిల్లా వారైతే అనర్హులా!

సాక్షి, అమరావతి: విదేశీయులు మన దేశంలో కంపెనీలు, పరిశ్రమలు స్థాపిస్తున్నారు. మన రాష్ట్రం నుంచి ఎంతో మంది దేశ, విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఆ ఊరు, ఈ ఊరు అనే తేడా లేదు. జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు ఎక్కడైనా అర్హత ఉన్న ఎవరైనా చట్టం, నిబంధనల మేరకు ఏదైనా చేయవచ్చు. దీనిని విశ్వవ్యాప్తంగా ఎవరూ కాదనరు. కానీ ఈనాడుకు మాత్రం సీఎం సొంత జిల్లా వారు ఎలాంటి వ్యాపారాలు చేయకూడదని, టెండర్లు దక్కించుకోకూడదన్న అభిప్రాయం నరనరానా జీర్ణించుకుపోయింది. అందుకే వారు వ్యాపారాలకు అనర్హులనేలా కథనాలు అల్లుతోంది. పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చ దానికి సీలేరులో రెండు అదనపు విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) టెండర్లు పిలిచింది. అత్యంత పారదర్శకంగా బిడ్లు ఆహ్వానించి, రివర్స్ టెండరింగ్ ద్వారా టెండరు ఖరారు చేసింది. కానీ ఇదంతా తప్పన్నట్టు 'ఈనాడు' శుక్రవారం ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఆ పత్రిక అధినేత రామోజీరావు పచ్చళ్లు అమ్ముకోవచ్చు.. పత్రికనూ నడుపుకోవచ్చు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి మాత్రం విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు టెండర్ ఇవ్వకూడదు. వారికి, వారు కొమ్ముకాస్తున్న వారికి ఒక న్యాయం.. సీఎం సొంత జిల్లా వారైతే మరో న్యాయం.. ఇదేం రామోజీ జర్నలిజం. ఏపీ జెన్‌కో వెల్లడించిన వివరాల ప్రకారం ఈ టెండర్లలో వాస్తవాలు అంశాల వారీగా ఇలా ఉన్నాయి.

ఆరోపణ: వైఎస్సార్ జిల్లాకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ విద్యుత్ ప్రాజెక్టును కట్టబెట్టింది. ఈ సంస్థ వైఎస్సార్ జిల్లాకు చెందిన వ్యక్తికి సంబంధించినది కావడమే దానికి ఉన్న ఏకైక అర్హత.

వాస్తవం: ఏపీ జెన్‌కో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన రివర్స్ టెండరింగ్ ద్వారానే షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ఈ కాంట్రాక్టును కైవసం చేసుకుంది. ఇందులో ఏపీ జెన్‌కో, ప్రభుత్వం ప్రమేయం ఏమీ లేదు. ఈ కన్సార్టియం భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ప్రతిష్ఠాత్మక బీహెచ్‌ఈఎల్‌తో ఈ ప్రాజెక్టు యంత్ర పరికరాల సరఫరాకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం ఉన్న యూనిట్లకు కూడా బీహెచ్‌ఈఎల్ యంత్ర పరికరాలు సరఫరా చేసింది. కన్సార్టియంలోని మరో కంపెనీ పీఈఎస్‌కు ఇదివరకే ఈ ప్రాజెక్టులో సివిల్ పనులు చేసిన అనుభవముంది. ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుని, కాంట్రాక్టు సంస్థను ఎంపిక చేసింది. ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 2024కల్లా పూర్తవుతాయి.

ఆరోపణ: దిగువ సీలేరులో రెండు అదనపు యూనిట్ల నిర్మాణానికి అయ్యే వ్యయం, జీఎస్టీ, ఆలస్యానికి అయ్యే వడ్డీతో కలిపి రూ. 571 కోట్ల రుణాన్ని గ్రామీణ విద్యుత్ సంస్థ (ఆర్‌ఈసీ) నుంచి ప్రభుత్వం తీసుకుంది.

వాస్తవం: పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రుణం తీసుకోవడం సర్వసాధారణం. ఇందులో తప్పేముంది?

ఆరోపణ: ఇప్పటికే షిర్డీ సాయి, దాని అనుబంధ సంస్థలకు రూ. 92 వేల కోట్ల విలువైన వివిధ విద్యుత్ ప్రాజెక్టులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: ఏపీ జెన్‌కోగానీ, డిస్కంలు గానీ నామినేషన్ పద్ధతిలో ఏ పనులూ ఎవరికీ కేటాయించలేదు. వివిధ ప్రాజెక్టుల కోసం పారదర్శకంగా టెండర్లు నిర్వహించాయి. అర్హతల మేరకు పోటీ బిడ్డింగ్‌లో పాల్గొని ఏ సంస్థ అయినా పనులు దక్కించుకోవచ్చు.

ఆరోపణ: ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ (గ్లోబల్ టెండర్లు- ఇ ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం) ద్వారా ఏపీ జెన్‌కో టెండర్లు పిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జుడిషియల్ కమిషన్ కూడా సమీక్షించి ఈ ప్రాజెక్టు టెండర్లకు ఆమోదం తెలిపింది. రాఘవ ఎంటర్‌ప్రైజెస్, ఎస్‌సీసీ, పీఈఎస్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిపి షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ జాయింట్ వెంచర్ సంస్థ బిడ్లు దాఖలు చేసింది. టెండర్లలో కోట్ అయిన అతి తక్కువ మొత్తాన్ని గరిష్ఠంగా తీసుకుని ఏపీజెన్‌కో రివర్స్ టెండర్లు నిర్వహించింది. ఈ రివర్స్ టెండరింగ్‌లో షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ తక్కువ మొత్తానికి ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చి కాంట్రాక్టు దక్కించుకుంది. రెండు దశల (సాంకేతిక, ఆర్థిక) బిడ్డింగ్ ప్రాతిపదికన ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు సంస్థను ఎంపిక చేసింది. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ వల్ల ఏపీ జెన్కోకు దాదాపు రూ.10 కోట్లు ఆదా అయ్యింది.

ఆరోపణ: ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పర్యావరణ, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతులు రాకముందే హడావుడి చేసింది.

వాస్తవం: విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను ఏపీఈఆర్‌సీకి ముందే చెప్పారు. ప్రతిపాదనను పరిశీలించి డిస్కంలు, జెన్‌కో కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుని కమిషన్ అనుమతి కోసం అప్పుడు పంపాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అనుమతి ఈ నెల 7న వచ్చింది. ఈ ప్రాజెక్టు పెట్టుబడి వ్యయం రూ.1000 కోట్లు దాటనందున కేంద్ర విద్యుత్ ప్రాధికారిక సంస్థ (సీఈఏ) అనుమతి అవసరం లేదు.

ఆరోపణ: రెండు కొత్త యూనిట్లు నిర్మించడం వల్ల దిగువ సీలేరు ప్రాజెక్టు నుంచి అదనంగా ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఉత్పత్తి అయ్యే పరిస్థితి లేదు.

వాస్తవం: జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి మన గ్రిడ్ అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు 115 మెగావాట్ల యూనిట్లు ఏటా దాదాపు 1100 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయి. దిగువ సీలేరు విద్యుత్ కేంద్రం మొట్టమొదట నిర్మించినప్పుడే ఆరు యూనిట్ల ఏర్పాటుకు కావలసిన ప్రధాన మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో అదనంగా మరో రెండు 115 మెగావాట్ల యూనిట్లు నిర్మించాలని ఏపీ జెన్‌కో నిర్ణయించింది. కొత్త యూనిట్లు నెలకొల్పడం వల్ల ఈ విద్యుత్ కేంద్రం గరిష్ఠ లోడ్ సామర్థ్యం పెరుగుతుంది. దాంతో మార్కెట్ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనవలసిన అవసరం తగ్గుతుంది. ప్రతి 115 మెగావాట్ల యంత్రం పీక్ డిమాండ్ సమయంలో సగటున 175 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయగలదు. దీనివల్ల డిస్కంలకు ఏటా 350 మిలియన్ యూనిట్లు విద్యుత్ మార్కెట్‌లో కొనాల్సిన అవసరం తగ్గి, ఆ మేరకు లాభం చేకూరుతుంది. పీక్ సమయాల్లో మార్కెట్ రేటు యూనిట్‌కు దాదాపు రూ.10 ఉంటోంది. సరాసరి పీక్ లోడ్ విద్యుత్ ధర రూ.8.0 అనుకున్నా ఈ రెండు యూనిట్ల వల్లా ఏటా దాదాపు రూ .280 కోట్లు ఆదా అవుతుంది.

నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు

▶ మొదటి పేజీ తరువాయి



ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. సీబీఐ డైరెక్టర్‌ని, వివేకా కేసు విచారణాధికారి (ఏఎస్పీ)ని ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌లో ఆయన పేర్కొన్న వివరాలు.. 'ఏప్రిల్ 29న నేను వాంగ్మూలం ఇస్తుండగా.. అధికారి మరొకరిని లోపలికి పిలిచారు. ఆయన ల్యాప్‌ట్యాప్‌తో వచ్చి ఏదో రికార్డు చేసుకున్నాడు. ఆయన ఏం రికార్డు చేసింది నాకు చూపించలేదు. కనీసం చదివి వినిపించలేదు. నాకు తెలిసినంతవరకు నా వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డు కూడా చేయలేదు. సీబీఐ నా స్టేట్‌మెంట్‌ను తప్పుడు రికార్డు చేసినట్లు మే 17న ఓ పత్రికలో ప్రచురితమైన వార్త ద్వారా తెలుసుకున్నా. నా వాంగ్మూలం గురించి నేను ఎవరి వద్దా ప్రస్తావించలేదు. కానీ, ఆ పత్రికలో ఎలా వచ్చిందో నాకు అర్థంకాలేదు. ఆశ్చర్యం వేసింది. ఆ పత్రికలో పేర్కొన్నదంతా అసత్యపూరితం. పత్రికలో వచ్చిన దానిపై ఎల్రక్టానిక్ మీడియా చర్చా కార్యక్రమాలు పెట్టడంతో నేను విలేకరుల సమావేశం పెట్టి.. ఆ పత్రికది కట్టుకథ అని చెప్పాల్సి వచ్చింది. సీబీఐ నమోదు చేసింది కూడా నేను చెప్పింది కాదని తెలిసింది. అయితే సీఆర్‌పీసీ 161 కింద రికార్డు చేసిన కాపీ నావద్ద లేనందున నా వాంగ్మూలం తప్పుగా పేర్కొన్న విషయాన్ని తెలుసుకోలేకపోయా. 2019 మార్చి 15న ఉదయం 5.30 గంటల సమయంలో అటెండరు వచ్చి అమ్మ (భారతి) పిలుస్తున్నారంటూ జగన్‌కు చెప్పాడని తాను చెప్పినట్లు, బయటకు వెళ్లిన జగన్ పది నిమిషాల తరువాత తిరిగివచ్చి చిన్నాన్న ఈజ్ నో మోర్ అని అన్నారని, షాక్‌కు గురైన మేము కడపకు వెళ్లాలని ఆయనకు సూచించి బయటకు వచ్చేశామని జూన్ నెలలో వేసిన చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది. ఈ విషయం పత్రికల్లో వచ్చిన సమాచారం ద్వారా నాకు తెలిసింది.

ఏం చెప్పానంటే..

ఏప్రిల్ 29న నన్ను విచారించిన అధికారికి స్పష్టంగా ఏం చెప్పానంటే.. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో తయారీ సమావేశం 2019 మార్చి 15న ఉదయం సుమారు 5 గంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో ప్రారంభమైంది. అరగంట తర్వాత ఒక అటెండర్ సమావేశగది తలుపు తట్టాడు. బయటికి వెళ్లి విషయం తెలుసుకుని వచ్చిన ఓఎస్డీ.. జగన్ చెవిలో ఏదో చెప్పారు. దీంతో జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి, ఆశ్చర్యానికి గురయ్యారు. 'చిన్నాన్న చనిపోయారు' అని చెప్పారు. అంతేతప్ప జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన జీవిత భాగస్వామిని పిలవడం లాంటివి ఏమీ చెప్పలేదు. దురదృష్టవశాత్తు నేను చెప్పింది సీబీఐ సరిగ్గా రికార్డు చేయలేదు. చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది పూర్తిగా అసంబద్ధం. దర్యాప్తును తప్పుదారి పట్టించి.. ఇతరులను కేసులో ఇరికించే ధోరణితోనే సీబీఐ ఇలా తప్పుగా పేర్కొంది. నా స్టేట్‌మెంట్‌పై సంతకం చేసిన అధికారి, నన్ను విచారించిన అధికారి ఒకరు కాదు. దర్యాప్తు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాజ్యాంగ ధర్మాసనాలు పదేపదే చెబుతున్నా.. కొందరు మాత్రం వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దర్యాప్తు చేయడం అంటే అస్పష్టమైన సత్యాన్ని బయటికి తీసుకురావడం. కానీ, ఇక్కడ అధికారులు అలా వ్యవహరించలేదు. నేను చెప్పకున్నా చెప్పినట్లు సీబీఐ తప్పుడు వాంగ్మూలాన్ని సమర్పించడం ఎంత మాత్రం సరికాదు. ఇతర వ్యక్తులను చిక్కుల్లో పడేసేందుకే సీబీఐ తప్పుడు సమాచారం చేర్చింది. ఈ అంశాలను పరిశీలించి హైదరాబాద్ సీబీఐ కోర్టులో సమర్పించిన చార్జిషీట్ నుంచి తప్పుడు వాంగ్మూలాన్ని తొలగించాలి.'

ఏపీ ఇన్ పార్లమెంట్

ప్రత్యేకదళాల్లో చేరికకు లింగభేదం లేదు

సాక్షి, న్యూఢిల్లీ: భారత సాయుధ దళాల్లోని ప్రత్యేకదళాల్లో చేరడానికి లింగభేదం లేదని కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి అజయ్ భట్ తెలిపారు. గుణాత్మక అవసరాల మేరకు ఎంపిక, విజయవంతమైన శిక్షణ పూర్తిచేస్తే మహిళా అధికారులు ఎలాంటి లింగభేదం లేకుండా ప్రత్యేకదళాల్లో స్వచ్ఛందంగా చేరడానికి అర్హులని చెప్పారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు వంగా గీత, బి.వి.సత్యవతి, గొడ్డేటి మాధవి, ఆదాల ప్రభాకరరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. భారత వైమానిక దళంలో ఇద్దరు మహిళలు ప్రత్యేకదళాల శిక్షణకు స్వచ్ఛందంగా వచ్చారని, అయితే వారు ఉత్తీర్ణత సాధించలేకపోయారని తెలిపారు. నేవీలో 20 మంది అగ్నివీర్‌లు ప్రత్యేకదళంలో చేరడానికి పరీక్షకుహాజరయ్యారని, వారెవరూ అర్హత సాధించలేకపోయారని చెప్పారు.

దేశవ్యాప్తంగా 122 మంది మెడికోల ఆత్మహత్య

దేశవ్యాప్తంగా 559 వైద్య కళాశాలలు ఇచ్చిన సమాచారం మేరకు 122 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి భారతీప్రవీణ్ పవార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. నేషనల్ మెడికల్ కమిషన్‌లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆర్‌టీఐ దరఖాస్తుకు సమాధానంగా ఐదేళ్లలో ఆత్మహత్యలు, డ్రాప్ అవుట్‌ల వివరాలు ఇచ్చిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పీజీలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా.. తొమ్మిది కళాశాలల్లో 38 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని తెలిపారు. ఎంబీబీఎస్‌లో మూడు కళాశాలల్లో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా.. ఆరు కళాశాలల్లో 13 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని చెప్పారు.

మైన్స్ మినరల్స్ సవరణ బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు

మైన్స్, మినరల్స్ సవరణ బిల్లు-2023కు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. ఈ బిల్లుపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం 16,604 ఎకరాల్లో 16 బీచ్‌శాండ్ మినరల్స్ బేరింగ్ ఏరియాలను ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రిజర్వు చేసిందని తెలిపారు. 14 మినరల్ బేరింగ్ ఏరియాలకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ బీచ్‌శాండ్ మినరల్స్ ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్థాపించి వైఎస్సార్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా రాయలసీమ ప్రజలకు స్థిరమైన ఉపాధి, జీవనోపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఉక్కు కర్మాగారం ఏడాదికి మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతోపాటు హై-గ్రేడ్ స్టీల్ ఉత్పత్తిపై దృష్టి సారిస్తుందని తెలిపారు.

మాయల ఫకీరు బాబు మాయలో పడొద్దు

- పురందేశ్వరి వ్యాఖ్యలపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కౌంటర్

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాటలు ఆమె మరిది చంద్రబాబు స్క్రిప్టులా ఉన్నాయి తప్ప సొంతంగా మాట్లాడారని అనిపించడంలేదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలా? లేక బాబు గారి జనతా పార్టీకి అధ్యక్షురాలా? అనే సందేహం వస్తోందన్నారు. మంత్రి శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. మాయల ఫకీరు చంద్రబాబు ట్రాప్‌లో పడితే పురందేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వర్లు రాజకీయ జీవితం భూస్థాపితం అయిపోయినట్లే ఆమె రాజకీయ జీవితమూ ముగిసిపోతుందని చెప్పారు. ఆమె భర్త ఆనాడు రాసిన పుస్తకానికి పార్ట్-2 రాయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ మద్యం ఆదాయంతోనే ఇస్తున్నారని అంటున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మద్యం లేదా? ఆదాయం రావడంలేదా అని ప్రశ్నించారు. వివిధ విభాగాల ఆదాయంతోనే ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వ నిర్ణయాలు, హామీలను అమలు చేస్తారని చెప్పారు. పురందేశ్వరి ఆమె మరిది బాబు హయాంలోని భూ కుంభకోణాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. విశాఖ ఎంపీగా చేసిన ఆమె విశాఖ రైల్వే జోన్‌పైన, విశాఖ ఉక్కు పైన ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు.

ఏవోబీలో జల్లెడపడుతున్న బలగాలు

మావోయిస్ట్ వారోత్సవాల నేపథ్యంలో మరింత అప్రమత్తం



ఏవోబీలో జల్లెడ పడుతున్న పోలీసు బలగాలు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): నిషేధిత మావోయిస్ట్ పార్టీ చేపట్టిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు తొలిరోజైన శుక్రవారం ఏవోబీ వ్యాప్తంగా ప్రశాంతత నెలకొంది. జిల్లాతో పాటు ఏవోబీలో పోలీసు బలగాలు భారీగా కూంబింగ్ చర్యల్లో నిమగ్నమయ్యాయి. సరిహద్దులో ఉన్న ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు అధికారులతో ఎస్పీ తుహిన్ సిన్హా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఏవోబీ వ్యాప్తంగా పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టు పార్టీ కార్యకలాపాల నిరోధమే లక్ష్యంగా పోలీసు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు. చింతూరుకు సరిహద్దులో ఉన్న సుకుమా జిల్లా కొంట అటవీ ప్రాంతంలో మాత్రం మావోయిస్టులు అమరవీరుల పేరిట తాత్కాలిక స్థూపాన్ని ఆవిష్కరించారనే ప్రచారంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. మారుమూల ప్రాంతాలకు నైట్‌హాల్ట్ సర్వీసులను ఆర్టీసీ రద్దు చేసింది. మండల కేంద్రాలతో పాటు మారుమూల ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రైవేట్ వాహనాలు, బైక్‌లను పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. అనుమానిత వ్యక్తుల సంచారంపై పోలీసు నిఘా అధికంగా ఉంది. ప్రజాప్రతినిధులు కూడా మారుమూల ప్రాంతాల పర్యటనలను రద్దు చేసుకున్నారు.

హైకోర్టు జడ్జీల నియామకానికి రాష్ట్రపతి ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా అలిశెట్టి లక్ష్మీనారాయణ, జూకంటి అనిల్‌కుమార్, సుజనా కళాసికం నియామకంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. వీరిని హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 12న కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు వీరి నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ శుక్రవారం రాత్రి ట్వీట్ చేశారు.

తూర్పు తీరంలో డాల్ఫిన్ల సందడి

ఏపీ, ఒడిశా, బెంగాల్ జలాల్లో 2,703 డాల్ఫిన్ల గుర్తింపు

- ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ పరిధిలో 10,443 సముద్ర క్షీరదాలు
- వీటిలో 4 జాతులకు చెందిన 27 తిమింగలాలు గుర్తింపు
- ఎఫ్ఎస్ఐ సర్వేలో ఆసక్తికరమైన విషయాల వెల్లడి



రిసోస్ డాల్ఫిన్

సాక్షి, విశాఖపట్నం:భారత సముద్ర జలాల్లో డాల్ఫిన్లు, తిమింగలాలు సందడి చేస్తున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు. ఏకంగా 16 జాతులకు చెందిన డాల్ఫిన్లు ఉన్నట్టు భారత మత్స్య పరిశోధన సంస్థ సర్వేలో వెల్లడైంది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద నిర్వహిస్తున్న సర్వేలో సముద్ర క్షీరదాలకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. తూర్పు తీరం పరిధిలోని ఏపీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ సముద్ర జలాల్లో మొత్తంగా 2,703 డాల్ఫిన్లు ఉన్నట్టు లెక్క తేలింది. వీటిని సంరక్షించేందుకు అనుసరించాల్సిన అంశాలపైనా ఎఫ్ఎస్ఐ శోధన చేస్తోంది.

పరిశోధన ఎందుకంటే..

సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతిలో భారత్ గణనీయ వృద్ధి సాధిస్తోంది. మన దేశం నుంచి 2022-23 సంవత్సరంలో మొత్తం రూ.43,135.58 కోట్ల విలువైన 7,11,099 మెట్రిక్ టన్నుల రొయ్యల ఎగుమతి జరగ్గా.. ఇందులో అతి పెద్ద మార్కెట్ కలిగిన అగ్రరాజ్యం అమెరికా 2,75,662 మెట్రిక్ టన్నులు దిగుమతి చేసుకోవడం విశేషం. అమెరికా మన దేశ సముద్ర ఉత్పత్తులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తోంది. ఈ తరుణంలో అమెరికా వాణిజ్య విభాగం మెరైన్ మామల్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద షరతులు విధించింది. మత్స్య సంపద సేకరించే క్రమంలో సముద్రంలో ఉన్న క్షీరదాలకు ముప్పు వాటిల్లే ప్రయత్నాలు జరగడం లేదనే విషయాన్ని ధ్రువీకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇందులో భాగంగా.. భారత సముద్ర జలాల్లో ఉన్న క్షీరదాల సంఖ్య గణించాలని సూచించింది. అందుకే.. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) కింద సెంట్రల్ సెక్టార్ స్కీమ్‌లో భాగంగా సముద్ర క్షీరదాలైన డాల్ఫిన్లు, తిమింగలాల సంఖ్య గణించే ప్రక్రియకు ఎఫ్ఎస్ఎస్-2021 జూలైలో శ్రీకారం చుట్టింది.

ఇప్పటివరకూ 10,443 క్షీరదాల గుర్తింపు

దేశవ్యాప్తంగా ఉన్న 7,516.6 కి.మీ పొడవైన తీరం వెంబడి సర్వే ప్రారంభించారు. సంస్థ పరిశోధన నౌకలైన మత్స్య షికారి, మత్స్య దర్శినితో పాటు వివిధ సర్వే నౌకలతో మొదలైన గణనలో వివిధ అంశాల్ని ఇప్పటివరకూ శోధించారు. ముఖ్యంగా సముద్ర జలాల పరిధిలోని ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ (ఈఈజెడ్)లో 12 నుంచి 200 నాటికల్ మైళ్ల లోతులో భారత సాగర జలాల్లో ఇప్పటివరకూ 10,443 సముద్ర క్షీరదాలు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో 16 జాతులకు చెందిన 10,416 డాల్ఫిన్లు ఉండగా.. 4 జాతులకు చెందిన 27 తిమింగలాలు ఉన్నట్టు తేలింది. రిసోస్ డాల్ఫిన్, బాటిల్ నోస్ డాల్ఫిన్, కామన్ డాల్ఫిన్, పాంట్రోపికల్ స్పాటెడ్ తదితర డాల్ఫిన్ రకాలు మనదేశ జలాల్లో ఉన్నట్టు గుర్తించారు.

విశాఖ రీజియన్ పరిధిలో 2,703 డాల్ఫిన్లు

ఎఫ్ఎస్ఐ విశాఖపట్నం రీజియన్ పరిధిలో మత్స్యషికారి, మత్స్యదర్శిని సర్వే వెసల్స్ ద్వారా ఈ ఏడాది జూన్ వరకూ సర్వే జరిగింది. ఏపీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని ఈఈజెడ్ పరిధిలో 30 నుంచి 3,749 మీటర్ల లోతు వరకూ సర్వే నిర్వహించారు. ఇక్కడి జలాల్లో 2,703 డాల్ఫిన్లు, 4 తిమింగలాలను గుర్తించారు. ఇందులో ఎక్కువగా రిసోస్ డాల్ఫిన్లు ఉన్నట్టు తేలింది. సర్వేకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం పీఎంఎంఎస్‌వై నుంచి అందిస్తోంది. 2025 వరకూ సర్వే నిర్వహించి పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసి యూఎస్‌కు అందించనున్నారు.

క్షీరదాల సంరక్షణపై మత్స్యకారుల్లో అవగాహన

డైరెక్టర్ జనరల్ మార్గ దర్శకత్వంలో సముద్ర క్షీరదాల గణన నిరంతరాయంగా కొనసాగుతోంది. చేపల వేటకు వెళ్లే సమయంలో సముద్ర క్షీరదాలు వలలకు యాదృచ్ఛికంగా చిక్కుకుంటే ఏం చేయాలనే దానిపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నాం. సముద్ర జీవావరణ వ్యవస్థ విధులు, ప్రక్రియల్ని నిర్వహించడంలో సముద్ర క్షీరదాలు కీలకంగా వ్యవహరిస్తాయి. తిమింగలాలు ఉపరితలం దగ్గర ఆహారం తీసుకొనేటప్పుడు పోషకాలు అధికంగా ఉండే మలాన్ని విడుదల చేస్తాయి. వీటివల్ల ఉపరితల జలాలు సారవంతమవుతాయి. భారత సముద్ర జలాల్లో ఉన్న క్షీరదాల్ని సంరక్షించేందుకు ఎఫ్ఎస్ఐ నిరంతరం శ్రమిస్తోంది.

– డి.భామిరెడ్డి, ఎఫ్ఎస్ఐ మెకానికల్ మెరైన్ ఇంజినీర్

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా శంకరరావు బాధ్యతల స్వీకరణ



సాక్షి, అమరావతి: ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా డీవీజీ శంకరరావు విజయవాడలో ఎస్టీ కమిషన్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..తనపై సీఎం జగన్ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగానికి, గిరిజనులకు మధ్య ఎస్టీ కమిషన్ వారధిగా పనిచేస్తుందన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి సక్రమంగా అందేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్, లిల్లీ సురేష్, రామలక్ష్మి, విశ్వేశ్వరరాజులతో సమావేశమయ్యారు.కాగా, ఈ కార్యక్రమానికి హాజరైన ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజన సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసి వారికి మరింత మేలు చేశారన్నారు. దేశంలో మరే రాష్ట్రంలోను లేని విధంగా ఏపీలో మాత్రమే ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరుగా కమిషన్‌లు ఏర్పాటు చేయడం గొప్ప రికార్డు అన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, డైరెక్టర్ జేవీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల పేరుతో సైబర్ మోసాలు

- వినియోగదారులు ఎటువంటి లింక్‌లపై క్లిక్ చేయవద్దు
- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి

సాక్షి, అమరావతి: 'డియర్ కన్స్యూమర్... మీ మునుపటి నెల బిల్లు అప్డేట్ కానందున ఈ రాత్రికి మీ విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. దయచేసి బిల్లు చెల్లించడానికి కింది లింక్‌పై క్లిక్ చేయండి..' అంటూ వస్తున్న వాట్సప్, టెక్స్ట్ మెసేజీలను నమ్మవద్దని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల సైబర్, ఆన్‌లైన్ మోసాలు గత కొన్ని నెలలుగా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మోసగాళ్లు ఆన్‌లైన్‌లో ప్రజల ఫోన్లను హ్యాక్ చేసి ఇలాంటి సందేశం పంపుతారని, వినియోగదారులు తమకు వచ్చిన మెసేజ్, లింక్‌పై క్లిక్ చేయవద్దని ఆయన సూచించారు. పొరపాటున వారు పంపిన లింక్‌పై క్లిక్ చేస్తే వినియోగదారుల బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు వస్తే విద్యుత్ అధికారులకు గానీ, సైబర్ క్రైం పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఫోన్, గూగుల్ పే, పేటీఎం, సీపీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా మాత్రమే చెల్లించాలని ఆయన కోరారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



కుటుంబంతో జస్టిస్ సోమయాజులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పుట్టినప్పటి నుంచి టీడీపీలో ఉన్నా.. మాకు ఏం చేశారు?

- టీడీపీ నేత అమరనాథరెడ్డికి ఆ పార్టీ సీనియర్ నేత ప్రశ్న
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మాకు అన్ని పథకాలు అందుతున్నాయని వ్యాఖ్య



అమరనాథరెడ్డిని ఎదిరించి మాట్లాడుతున్న సూరి

వి.కోట(చిత్తూరు జిల్లా): ''నేను పుట్టినప్పటి నుంచి టీడీపీలోనే ఉన్నాను. కానీ నాకు ఇల్లు మంజూరు చేసి దానిని నిర్మించడానికి సహాయం చేసింది మాత్రం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం''అని మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డితో టీడీపీ సీనియర్ నాయకుడు అన్నాడు. వి.కోట మండలం గోనుమాకులపల్లి పంచాయతీలో శుక్రవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ''మీరు అధికారంలో ఉన్నన్నాళ్లు ఏమి లబ్ధి చేకూర్చారు. టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు మాకు ఒరిగిందేమీ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కుల, మత,రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. మీరు మాకు ఏం చేశారు''అంటూ అమరనాథరెడ్డిని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సూరి ఎదిరించారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

జంతర్‌మంతర్‌లో 'సేవ్ రాయలసీమ'

బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఢిల్లీలో ధర్నా



సాక్షి, న్యూఢిల్లీ: రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని రాయలసీమ పరిరక్షణ సమితి కన్వీనర్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆరోపించారు. 'సేవ్ రాయలసీమ' పేరుతో శుక్రవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించారు. రాయలసీమను రక్షించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా చేపడుతున్న అప్పర్ తుంగభద్ర డ్యాముల నిర్మాణాన్ని తక్షణమే అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనివల్ల కేవలం రాయలసీమకే కాకుండా తెలంగాణకు కూడా నష్టం జరుగుతుందన్నారు. రాయలసీమకు తీగల బ్రిడ్జ్ అవసరం లేదని, బ్రిడ్జ్ కం బ్యారేజ్ కావాలని చెప్పారు. రాయలసీమ ప్రజలకు కావాల్సింది నీళ్లు, నిధులు, నియామకాలు అని పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో పీజీలు చేసిన రాయలసీమ యువత హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబైలకు వెళ్లి మట్టిపనులు చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతం నుంచి ఎంతోమంది ముఖ్యమంత్రులు అయినా రాయలసీమకు ఒరిగిందేమీ లేదని చెప్పారు. రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదో తెలపాలన్నారు. సీఎం జగన్ విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అని మాట్లాడుతున్నారని, రాయలసీమకు హైకోర్టు బెంచ్ అని చెప్పినా.. అక్కడ కుర్చీ అయినా ఉందో లేదో తెలియదని పేర్కొన్నారు. విదర్భ ,రాజస్థాన్ కంటే ఘోరమైన పరిస్థితిలో రాయలసీమ ప్రాంతం ఉందన్నారు.

క్లుప్తంగా...

హత్య కేసులో చోటా రాజన్‌కు ఊరట

ముంబై: ట్రేడ్ యూనియన్ లీడర్ దత్తా సామంత్ హత్య కేసులో గ్యాంగ్‌స్టర్ చోటా రాజన్‌ను నిరపరాధిగా తేలుస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. 1997లో జరిగిన ఈ హత్యకు చోటా రాజన్ కుట్ర పన్నాడనడానికి ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు వెల్లడించింది. సామంత్ తన జీపులో పంత్ నగర్ నుంచి ఘట్కోపర్ వెళుతుండగా మోటార్‌బైక్‌పై వచ్చిన దుండగులు ఆయనపై 17 రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో సామంత్ అక్కడికక్కడే మరణించాడు. ఈ హత్య వెనుక చోటా రాజన్ హస్తం ఉందంటూ ప్రాసిక్యూషన్ కేసు నమోదు చేసింది. అయితే అందుకు గల సాక్ష్యాధారాలను సమర్పించడంలో ప్రాసిక్యూషన్ విఫలం కావడంతో ప్రత్యేక న్యాయమూర్తి బి.డి.షెల్కె రాజన్‌కు కేసు నుంచి విముక్తి కలిగించారు. అతనిపై మరిన్ని కేసులు పెండింగ్‌లో ఉండడంతో విడుదలయ్యే అవకాశాల్లేవు.

ఐఫోన్ కొనేందుకు.. కొడుకును అమ్మేశారు!

కోల్‌కతా: ఖరీదైన ఐఫోన్ కొనేందుకు దంపతులు తమ 8 నెలల కొడుకును అమ్మేసుకున్నారు.. ఈ ఘటన పశ్చిమబెంగాల్‌లో తాజాగా వెలుగుచూసింది. పోలీసులు తల్లిని అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న తండ్రి కోసం గాలింపు చేపట్టారు. గంగానగర్ ఏరియాకు చెందిన దంపతులు సొంతంగా తయారు చేసిన వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి డబ్బు సంపాదించాలనుకున్నారు. అందుకోసం ఎనిమిది నెలల వయస్సున్న తమ కొడుకును విక్రయించి ఖరీదైన ఐఫోన్ 14ను కొన్నారు. ఇది నెల క్రితం జరిగింది. చిన్నారి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చింది. ఈ నెల 24న వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నిజం వెల్లడించింది. ఇప్పటికే ఆ డబ్బును ఖర్చయినట్లు చెప్పింది. చిన్నారి తండ్రి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

2014 నుంచి 110% పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

న్యూఢిల్లీ: దేశంలో వైద్య కళాశాలలు 2014 నుంచి 82 శాతం పెరిగాయని కేంద్రం తెలిపింది. 2014 మెడికల్ కాలేజీలో 387 ఉండగా, నేడు వాటి సంఖ్య 704కు చేరుకుందని వివరించింది. ఇదే కాలంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 51,348 నుంచి 1,07,948కి చేరుకున్నాయని తెలిపింది. శుక్రవారం లోక్‌సభలో ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు.

వాతావరణ మార్పులతో... అల్లకల్లోలం

ఆసియాను అతలాకుతలం చేస్తున్న విపత్తులు

అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో ఆహార భద్రతకు ముప్పు



వాతావరణ మార్పుల ప్రభావం ఆసియా దేశాలను అల్లకల్లోలం చేస్తోంది. అయితే ఠారెత్తించే ఎండలు లేదంటే కుండపోత వర్షాలతో కేవలం భారత్ మాత్రమే కాకుండా ఇతర ఆసియా దేశాలు సతమతమవుతున్నాయి. 2022 సంవత్సరంలో 81 విపత్తులు ఆసియా దేశాలను వణికించాయి. అందులో అత్యధిక భాగం వరదలు తుపాన్లే ఉన్నాయి. కరువు కాటకాలతో కొన్ని దేశాలకు కంటి మీద కునుకు లేకుండా పోతే మరికొన్ని దేశాలు వరదలతో విలవిలలాడాయి. ఈ పరిస్థితులతో ఆసియాలో ఆహార భద్రత సమస్య తలెత్తుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఒ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇవి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో సామాజికంగా ఆర్థికంగా ఈ దేశాలు మరింత విచ్ఛిన్నమవుతాయని డబ్ల్యూఎంఒ తాజా నివేదిక హెచ్చరించింది. ప్రపంచంలోనే ఆసియా ఖండం అత్యంత వేగంగా వేడెక్కుతోంది. 1961–1990 మధ్య సగటు వేడి కంటే 1991–2022 మధ్య కాలంలో ఆసియా ఖండంలో వేడిమి రెట్టింపు అయింది. వరదలు, తుపాన్లతో పాటుగా పశ్చిమాసియా దేశాలు ఇసుక తుపాన్లతో విలవిలలాడాయి. ''2022లో వాతావరణ మార్పుల ప్రభావం ఆసియా దేశాలపై విపరీతమైన ప్రభావం చూపించింది. సాధారణం కంటే అధిక వేడి, పొడి వాతావరణంతో చైనా కరువు పరిస్థితుల్ని ఎదుర్కొంది. దీని వల్ల నీటి లభ్యత తగ్గిపోవడమే కాకుండా విద్యుత్ రంగంపై కూడా ప్రభావం పడింది. కేవలం కరువు కారణంగా చైనాలో ఒక్క ఏడాది 706 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం వచ్చింది. దీనికి విరుద్ధంగా పాకిస్తాన్, భారత్‌లు వరదలు, తుపాన్లతో అల్లాడిపోయాయి'' అని డబ్ల్యూఎంఒ ప్రధానకార్యదర్శి ప్రొఫెసర్ పెట్రి టాలస్ వెల్లడించారు. ఈ అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల వ్యవసాయం, ఆహార భద్రతపై అత్యధిక ప్రభావం చూపిస్తుందని, ఆసియా దేశాల్లో ప్రభుత్వాలు ఆహార భద్రత సవాల్‌ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆర్థిక నష్టం: 3,600 కోట్ల డాలర్లు (రూ.3 లక్షల కోట్లు)

విపత్తులు: 81

వరదలు: 83%

మృతులు: 5000లకు పైగా

బాధితులు: 5 కోట్లు

ఏ దేశానికి ఎంత నష్టం

దేశం	నష్టం
పాకిస్తాన్	1500 కోట్ల డాలర్లు (రూ.లక్ష 23 వేల కోట్లు)
చైనా	500 కోట్ల డాలర్లు (రూ.41 వేల కోట్లు)
భారత్	402 కోట్ల డాలర్లు (రూ.33 వేల కోట్లు)

నివేదిక ఏం చెప్పిందంటే ..!

ఆసియా ఖండంలో ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. 2022 రెండో అత్యంత వేడి సంవత్సరంగా రికార్డులకెక్కింది. 1991–2020 సగటు కంటే ఎక్కువగా 0.72డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- కరువుతో ఎన్నో ప్రాంతాలు అల్లాడిపోయాయి. నీటి వనరులు తరిగిపోయాయి. ఒక్క చైనాలో కరువు కారణంగా 706 కోట్ల అమెరికా డాలర్ల నష్టం వచ్చింది
- భారీ వర్షాలు, వరదలు పాకిస్తాన్‌ను అతలాకుతలం చేశాయి. కేవలం మూడు వారాల్లో ఏడాది మొత్తంగా కురవాల్సి వానలో 60% కురిసింది. పాక్ జనాభాలో 14% మందిపై వరదలు ప్రభావం చూపించాయి
- ఆసియాలోని పర్వత ప్రాంతాల్లో హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి. గత 40 ఏళ్లలో హిమానీనదాలు పరిమాణం భారీగా తగ్గిపోయింది. గత కొంతకాలంగా మరింత వేగంగా క్షీణిస్తోంది. 2022లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫలితంగా చాలా హిమానీనదాలు వేగంగా కరిగిపోవడం మొదలైంది. తూర్పు తియెన్ షాన్‌లో ఉరుమ్‌కీ గ్లేసియర్ ఉపరితలం నుంచి 1.25 మీటర్ల మేర క్షీణించింది.
- ఆసియా ఖండంలో సముద్ర ఉపరితలాలు వేడెక్కిపోతున్నాయి. 1982 నుంచి సముద్రాలు వేడెక్కడం మొదలైంది. వాయవ్య అరేబియన్ సముద్రం, ఫిలిప్పైన్స్ సముద్రం, తూర్పు జపాన్‌లో సముద్రం మొదలైనవి ప్రపంచంలో సముద్రాలు వేడెక్కే సగటు రేటు కంటే మూడు రెట్లు అధికంగా వేడెక్కుతున్నాయి. గత దశాబ్దంలో 0.5డిగ్రీల సెల్సియస్ అత్యధిక వేడిమి నమోదైంది.

ఈ ఏడాది ఇంతే

ఆసియాలో ఈ ఏడాది కూడా వివిధ దేశాలను విపత్తులు వణికిస్తున్నాయి. ఇండోనేసియా సమత్రాలో కొండచరియలు విరిగిపడి 15 వేల ఇళ్లు ధ్వంసమైతే లక్ష మందికి పైగా నిరాశ్రయులయ్యారు. చైనాను గత ఏడాది కరువు కాటేస్తే, ఈ ఏడాది వరదలతో అతలాకుతలమవుతోంది. వచ్చే నెలలో మరిన్ని టైఫూన్లు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. మన దేశంలో హిమాచల్ ప్రదేశ్‌లో కురిసిన భారీ వర్షాలు ఉత్తరాఖండ్, ఢిల్లీ, పంజాబ్, హరియాణాలను కూడా వణికించాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలకి 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఇక పాకిస్తాన్‌లోనూ ఈ ఏడాది వరదలకి ఇప్పటివరకు 150 మందికి పైగా మరణించారు. ఇలా వాతావరణ మార్పుల ప్రభావం అన్ని దేశాలకు సవాల్ విసురుతోంది.



కేరళ మున్సిపల్ మహిళా కార్మికులకు జాక్‌పాట్

రూ. 250తో కొన్న టికెట్‌కు రూ.10 కోట్ల లాటరీ

మలప్పురం: లాటరీ టికెట్ కొనేందుకు నానా హైరానా పడిన ఈ మహిళలు ఎన్నడూ ఊహించని విధంగా జాక్‌పాట్ కొట్టేశారు. కేరళ లాటరీ విభాగం ప్రకటించిన వర్షాకాల ఫలితాల్లో వీరు కొనుగోలు చేసిన టికెట్ ఒకటీ రెండూ కాదు..ఏకంగా రూ.10 కోట్లు గెలుచుకుంది. కేరళలోని పరప్పనంగడి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటింటికీ తిరిగి సేకరించిన చెత్త నుంచి 'హరిత కర్మ సేన'కు చెందిన 11 మంది మహిళా సభ్యులు ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తుంటారు. వీరు తలా రూ.25 కంటే తక్కువగా పోగేయగా జమయిన రూ.250 పెట్టి ఇటీవల కేరళ లాటరీ టికెట్ కొనుగోలు చేశారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో హరిత కర్మ సేన కొనుగోలు చేసిన టికెట్ రూ.10 కోట్ల జాక్‌పాట్ వరించింది. దీంతో, వీరి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గత ఏడాది కూడా ఓనమ్ పండుగ సందర్భంగా తలాకొంత పోగేసి కొన్న టికెట్‌కు రూ.7,500 రాగా అందరం సమానంగా పంచుకున్నామని చెప్పారు. అదే ధైర్యంతో ఈసారి కొన్న టికెట్‌కు ఏకంగా రూ.10 కోట్లు వస్తాయని ఊహించలేదన్నారు. ఈ డబ్బును అందరం సమంగా పంచుకుంటామని తెలిపారు. అప్పులు తీర్చుకుని, పిల్లల పెళ్లిళ్లు చేస్తామని, కుటుంబసభ్యులకు అవసరమైన వైద్యం చేయించుకుంటామని చెబుతున్నారు. వీరి నెలవారీ వేతనం రూ.7,500–రూ.14,000 వరకు ఉంది.

అణు క్షిపణులతో ఉత్తరకొరియా పరేడ్

రష్యా, చైనా ప్రతినిధులతో కలిసి తిలకించిన అధ్యక్షుడు కిమ్

సియోల్: ఉత్తరకొరియా శక్తివంతమైన అణు క్షిపణులను ప్రదర్శించింది. గురువారం సాయంత్రం రాజధాని ప్యాంగ్యాంగ్‌లో జరిగిన సైనిక పరేడ్‌లో రష్యా, చైనా ప్రతినిధులతో కలిసి అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ వీటిని తిలకించారు. 1950–53 కొరియా యుద్ధానికి విరామం పలికి 70 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఉత్తరకొరియా పలు కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్న వేళ అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, రష్యాతో బంధం మరింత బలోపేతమైందని చాటేందుకే కిమ్ పరేడ్‌ను వేదికగా మార్చుకున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. ఉత్తరకొరియా వ్యవస్థాపకుడు, కిమ్ తాత పేరుతో ప్యాంగాంగ్‌లో ఉన్న కిమ్–2 సంగ్ స్క్వేర్‌లో రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగు, చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రతినిధి లి హాంగ్‌జోంగ్‌లతో కలిసి ప్రదర్శనను కిమ్ వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది తరలివచ్చారు. సైనిక కవాతు మధ్య యుద్ధ ట్యాంకులు, భారీ ఖండాంతర క్షిపణు(ఐసీబీఎం)లతో కూడిన ట్రక్కులు కదులుతుండగా ముగ్గురూ చేతులు ఊపుతున్న ఫొటోలను అధికార వార్తాసంస్థ కేసీఎన్‌ఏ శుక్రవారం విడుదల చేసింది. కిమ్ ప్రసంగించిందీ లేనిదీ వెల్లడించలేదు. క్షిపణి వ్యవస్థలతో పాటు కొత్తగా అభివృద్ధి చేసిన నిఘా, అటాక్ డ్రోన్లను కూడా ప్రదర్శించారు. ఈ ఐసీబీఎంలన్నీ రష్యా డిజైన్ల ఆధారంగా తయారైనవేనని విశ్లేషకులు అంటున్నారు.



సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలకు 50 శాతం ఆర్థిక సాయం

'సెమీకాన్ ఇండియా-2023'సదస్సులో ప్రధానమంత్రి మోదీ ప్రకటన

- భారత్‌లో పరిశ్రమ అభివృద్ధికి పూర్తి అనుకూల వాతావరణం
- త్వరలో పార్లమెంట్‌లో 'నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' బిల్లు
- గుజరాత్‌లో 'సెమికాన్ ఇండియా-2023' సదస్సు



గాంధీనగర్: దేశంలో సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలకు ఊతం ఇచ్చే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. స్థానికంగా సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలు నెలకొల్పే టెక్నాలజీ సంస్థలకు 50 శాతం ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. ఇలాంటి పరిశ్రమలకు తమ ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరుస్తోందని అన్నారు. శుక్రవారం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో 'సెమికాన్ ఇండియా–2023' సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ప్రసంగించారు. ప్రపంచంలో వేర్వేరు కాలాల్లో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే ప్రతి పారిశ్రామిక విప్లవాన్ని ముందుకు నడిపించాయని గుర్తుచేశారు. ఇప్పుడు నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని భారతీయుల ఆకాంక్షలే ముందుకు నడిపిస్తున్నాయని తాను నమ్ముతున్నానని తెలిపారు. భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి పూర్తి అనుకూల వాతావరణం ఉందన్నారు. 'సెమికాన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ వర్గాలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని వివరించారు. దీన్ని మరింత పెంచుతున్నామని, ఇకపై దేశంలో సెమికండర్టక్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు ఏకంగా 50 శాతం ఆర్థిక సాయం అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.

300 కాలేజీల్లో సెమికండక్టర్ డిజైన్ కోర్సులు

భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ వృద్ధికి ఇక ఆకాశమే హద్దు అని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఏడాది క్రితం భారత్‌లో ఈ పరిశ్రమలో ఎందుకు పెట్టుబడులు పెట్టాలని ప్రశ్నించేవారని, ఇప్పుడు ఎందుకు పెట్టకూడదో చెప్పాలని అడుగుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ రంగంలో పెట్టుబడులకు భారత్ 'గ్రాండ్ కండక్టర్'గా మారుతోందని హర్షం వ్యక్తం చేశారు. విశ్వసనీయమైన 'చిప్ సప్లై చైన్' అవసరం ప్రపంచానికి ఉందన్నారు.

అతి తక్కువ కార్పొరేట్ ట్యాక్స్

'నేషనల్ క్వాంటమ్ మిషన్'ను ఇటీవలే ఆమోదించామని, నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నామని వెల్లడించారు. క్వాంటమ్ టెక్నాలజీలో శాస్త్రీయ పరిశోధనలు, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలకు క్వాంటమ్ మిషన్ దోహదపడుతుందన్నారు. సెమికండక్టర్ పరిశ్రమకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టామని, దేశంలో పదేళ్లలో సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం 20 రెట్లు పెరిగిందని గుర్తుచేశారు. సోలార్ పీవీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రోలైజర్స్ విధానాల్లో కరెంటును ఉత్పత్తి చేయాలని నిర్ణయించామన్నారు. సదస్సులో పలు దేశాల పారిశ్రామికవేత్తలు, సెమికండక్టర్ రంగ నిపుణులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణలో భారత్ ముందంజ

చెన్నై: జీవ వైవిధ్య పునఃస్థాపన, పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టడంలో భారత్ ముందంజలో ఉందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తమిళనాడు రాజధాని చెన్నైలో జరిగిన 'జి–20 పర్యావరణ, వాతావరణ స్థిరత్వ మినిస్టీరియల్' సదస్సులో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. గంగా నదిని శుభ్రపరిచేందుకు నమామి గంగ మిషన్ అమలు చేస్తున్నామన్నారు. ''భారతీయులకు ప్రకృతే పెద్ద గురువు. భూమాత పరిరక్షణ అందరి బాధ్యత'' అన్నారు.

స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌కు భారత్ కీలకం

జపాన్ విదేశాంగ మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ: స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ సాధనలో భారత్ అనివార్య భాగస్వా మి అని జపాన్ విదేశాంగ మంత్రి యోషిమస హయా షి పేర్కొన్నారు. భారత్‌తో అన్ని రంగాల్లో ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యం బలోపేతం చేసుకునేందుకు జపాన్ ఆసక్తితో ఉందన్నారు. గ్లోబల్ సౌత్‌పై దృష్టిసారించిన భారత్‌ను హయాషి ప్రశంసించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు సరైన శ్రద్ధ చూపకుంటే స్వేచ్ఛాయుత, నిబంధనల ఆధారిత అంతర్జాతీయ క్రమత ఒట్టి నినాదంగానే మారిపోతుందన్నారు. భారత్‌కు రెండు రోజుల పర్యటనకు వచ్చిన హయాషి శుక్రవారం విదేశాంగ ఏర్పాటు చేసిన భారత్–జపాన్ ఫోరం సమావేశంలో మాట్లాడారు. సైబర్, అంతరిక్ష రంగాల్లో రెండు దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో పురోగతి సాధించామన్నారు. రక్షణ ఉత్పత్తులు, సాంకేతిక అంశాలకు సంబంధించిన చర్చల్లో సహకారంపై చర్చలు సాగుతున్నాయని వివరించారు. ఈ చర్చలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ..భారత్‌కు జపాన్ సహజ భాగస్వామిగా పేర్కొన్నారు.

ఆలస్యంగా గవర్నర్.. విమానం మిస్

ఎయిర్ ఏసియా విమాన సంస్థపై ఫిర్యాదు

సాక్షి, బెంగళూరు: రాష్ట్ర ప్రథమ పౌరుడు గవర్నర్.. అలాంటి ప్రముఖుని కోసం ఆగకుండా విమానం వెళ్లిపోయింది. దీంతో ప్రొటోకాల్ ఉల్లంఘన కింద విమానాశ్రయ అధికారులు, విమానయాన సంస్థపై కేసు నమోదైంది. ఈ ఘటన బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగింది. రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ రాయచూర్ విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. హైదరాబాద్ వెళ్లే ఎయిర్ ఏషియా విమానం ఎక్కేందుకు 10 నిమిషాలు ఆలస్యంగా బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే విమానం టేకాఫ్ కావడంతో గంట వేచి ఉండి మరో విమానంలో వెళ్లారు. ప్రొటోకాల్ పాటించలేదంటూ ఎయిర్ ఏసియా, బెంగళూరు విమానాశ్రయ అధికారులపై రాజ్‌భవన్ ఫిర్యాదు చేసింది.

నేడు మణిపూర్‌కు 'ఇండియా'

క్షేత్ర స్థాయి పరిస్థితులను పార్లమెంట్‌కు నివేదిస్తామంటున్న నేతలు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో పర్యటించి, అక్కడి క్షేత్ర స్థాయి పరిస్థితులపై సమస్యలకు తగు పరిష్కారం చూపుతూ కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంట్‌కు నివేదిక అందజేస్తామని ప్రతిపక్ష 'ఇండియా'కూటమి నేతలు ప్రకటించారు. కూటమిలోని 16 పార్టీలకు చెందిన 20 మంది ఎంపీలు ఈ నెల 29, 30వ తేదీల్లో మణిపూర్‌లో పర్యటించనున్న విషయం తెలిసిందే. ఈ ప్రతినిధి బృందంలో కాంగ్రెస్ నుంచి అధిర్ రంజన్ ఛౌధురి, గౌరవ్ గొగోయ్, టీఎంసీ నేత సుష్మితా దేవ్, జేఎంఎంకు చెందిన మహువా మాజి, డీఎంకే కనిమొళి, ఎన్‌సీపీ నేత మహ్మద్ ఫైజల్, ఆర్‌ఎల్‌డీ జయంత్ చౌధరి, ఆర్‌జేడీ మనోజ్ ఝా, ఆర్‌ఎస్‌పీ ఎన్కే ప్రేమచంద్రన్, వీసీకే నేత తిరుమావళన్. వీరితో పాటు జేడీ(యు) చీఫ్ రాజీవ్ రంజన్ సింగ్, జేడీ–యూకు చెందిన అనీల్ ప్రసాద్ హెగ్డే, సీపీఐ నుంచి సందేశ్ కుమార్, సీపీఎం నేత ఏఏ రహీం, ఎస్పీ నుంచి జావెద్ అలీఖాన్, ఐయూఎంఎల్ ఈటీ మహ్మద్ బషీర్, ఆప్ నేత సుశీల్ గుప్తా, శివసేన(యూటీ) అర్వింద్ సావంత్, డీఎంకే నేత డి.రవి కుమార్, కాంగ్రెస్ నేతలు ఫులో దేవి నేతం, కె.సురేశ్ ఈ బృందంలో ఉన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తితో మణిపూర్ హింసపై దర్యాప్తు జరిపించాలని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో అంతా మంచిగానే ఉన్నట్లు చూపాలని కేంద్రం అనుకుంటోందని ఆరోపించారు.

మహిళల గౌరవంతో ఆటలా?



బీజేపీ అధికార దాహంతోమహిళల గౌరవంతో, దేశ ఆత్మగౌరవంతో ఆటలాడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో వీడియో షేర్ చేశారు. మణిపూర్‌లో మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నా కేంద్రం నోరు విప్పడం లేదని మండిపడ్డారు. మహిళా రెజ్లర్లపై బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులను ప్రస్తావిస్తూ, మహిళలను గౌరవించని దేశం పురోగమించదన్నారు.

పట్టువీడని విపక్షాలు

- మణిపూర్ హింస, అవిశ్వాస తీర్మానంపై చర్చించాలని పార్లమెంట్‌లోడిమాండ్
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా

న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలన్న డిమాండ్‌పై ప్రతిపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. మణిపూర్‌లో అమాయకులు బలైపోతున్నా ప్రధానమంత్రి ఎందుకు నోరువిప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విపక్ష ఎంపీలు శుక్రవారం సైతం పార్లమెంట్ ఉభయసభల్లో ఆందోళనకు దిగారు. అలాగే మోదీ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సభలో తక్షణమే చర్చ ప్రారంభించాలని పట్టుబట్టారు. నినాదాలతో హోరెత్తించారు. దీంతో ఉభయసభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. కార్యకలాపాలేవీ జరగకుండానే లోక్‌సభ, రాజ్యసభ సోమవారానికి వాయిదా పడ్డాయి.

లోక్‌సభలో 3 బిల్లులకు ఆమోదం

లోక్‌సభ శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు తమ స్థానాల్లో లేచి నిల్చున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాలకు సహకరించాలని స్పీకర్ ఓం బిర్లా పదేపదే విజ్ఞప్తి చేసినా వారు వినిపించుకోలేదు. 1978 మే 10న కేంద్రంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై వెంటనే చర్చ జరిగిందని కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరి గుర్తుచేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ స్పందిస్తూ.. ప్రభుత్వం నిబంధనల ప్రకారమే నడుచుకుంటుందని, అవిశ్వాస తీర్మానంపై 10 రోజుల్లోగా చర్చ చేపట్టవచ్చని తేల్చిచెప్పారు. సంఖ్యా బలం ఉంటే ప్రభుత్వాన్ని పడగొట్టాలని ప్రతిపక్షాలకు సవాలు విసిరారు. సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ మధ్యాహ్నం 12 గంటల దాకా సభను వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు శాంతించలేదు. దీంతో సభాపతి స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ లోక్‌సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. గందరగోళం మధ్యే పలు బిల్లులను సభ ఆమోదించింది.




లోక్‌సభలో విపక్ష సభ్యుల నిరసన

ఇదేమన్నా స్టేజీయా: చైర్మన్ ఆగ్రహం

మణిపూర్ తదితర అంశాలపై చర్చకు రాజ్యసభలోనూ విపక్షాలు పట్టుబట్టాయి. 47 మంది ఎంపీలు ఈ మేరకు నోటీసులు ఇచ్చారు. చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రశ్నోత్తరాల ప్రాధాన్యతను వివరిస్తుండగా తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఓబ్రెయిన్ జోక్యం చేసుకున్నారు. అది తమకు తెలుసని, మణిపూర్ హింసపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాంతో, ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి ఇది నాటక రంగం కాదని చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఓబ్రెయిన్ బల్లపై చేతితో గట్టిగా కొడుతూ అరిచారు. ఆయన తీరును తప్పుబడుతూ సభను చైర్మన్ సోమవారానికి వాయిదా వేశారు.

ర్యాంప్‌పై హొయల గేల



ఫొటోలో కనిపిస్తున్నది రబనే విక్టర్ అనే గే మోడల్. ఇలా గడ్డం, మీసాలతోనే చూడచక్కని లెహెంగా ధరించి మరీ ర్యాంప్ వాక్ చేశాడు. కాస్త వయ్యారమూ, కాస్త మగటిమీ కలగలిపిన రెండు ప్రకృతులనూ ప్రదర్శించి తాజాగా ఇండియా కౌచర్ వీక్-2023 ప్రారంభ వేడుకలో అందరినీ అలరించాడు...

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
శనివారం : 29 : జూలై : 2023

శక్తి గణపతికి కిరీటం



వేలూరు: వేలూరు శ్రీపురంలోని బంగారుగుడి ఆవరణలో 1,700 కిలోల వెండితో రాతి ఆలయంలో శ్రీశక్తి గణపతి విగ్రహాన్ని రూపొందించి 2021వ సంవత్సరంలో మహాకుంబాభిషేకం చేశారు. ప్రస్తుతం 880 క్యారెట్లతో ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా అతిపెద్ద సింగల్ స్టోన్ విత్రస్‌ను పొందుపరిచారు. వీటితో కిరీటాన్ని బంగారంతో ఫ్రేమ్ చేశారు. దీని విలువ మొత్తం రూ.5 కోట్లు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం పీఠాధిపతి శక్తి అమ్మ శక్తిగణపతికి అతిపెద్ద కిరీటాన్ని అలకరింపజేసి దీపారాధన పూజలు చేశారు. 700 క్యారెట్ల రాయిని ఇప్పటివరకు ప్రపంచంలోనే అతిపెద్ద రాయిగా భావిస్తున్నారు. ప్రస్తుతం శ్రీశక్తి గణపతి ధరించిన అతిశక్తివంతమైన కిరీటాన్ని భక్తులు దర్శించుకోవడం వల్ల దోషాలు తొలగిపోతాయని శక్తిఅమ్మ తెలిపారు.

న్యూస్‌రీల్

వేలమ్మాళ్ పాటి కన్నుమూత

- ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం



వేలమ్మాళ్ (ఫైల్)

కొరుక్కుపేట: నాగర్‌కోయిల్‌లోని వడసెరి కలుంగడికి చెందిన వేలమ్మాళ్ పాటి (అవ్వ). ఈమెకు 92 సంవత్సరాలు. ముఖ్యమంత్రి స్టాలిన్ నుంచి కరోనా సమయంలో సాయాన్ని అందుకున్న వెలమ్మాళ్ అవ్వ తన నవ్వును వ్యక్తం చేశారు. ఆమె ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రభుత్వ ప్రకటనల్లో కూడా ఈ ఫొటో దర్శనమిచ్చింది. ఈ స్థితిలో వెలమ్మాళ్ నాగర్‌కోయిల్‌కు వచ్చిన ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆ సమయంలో, ఆమె అభ్యర్థనను అంగీకరించిన తర్వాత, ప్రభుత్వ హౌసింగ్ బోర్డు అపార్ట్‌మెంట్‌లో ఇంటిని కేటాయించారు. కన్యాకుమారి జిల్లాకు చెందిన వేలమ్మాళ్ అవ్వ మరణించారనే వార్త విని సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి చెందారు. ఆ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన రిలీఫ్ మొత్తాన్ని అందుకున్నప్పుడు ప్రజల ఆలోచనలను ప్రతిబింబించే తన చిరునవ్వు ద్వారా ఆమె ఎప్పటికీ మన మదిలో ఉంటుందని, ప్రగాఢ సానుభూతిని, ఆమె కుటుంబసభ్యులకు, బంధువులకు సీఎం స్టాలిన్ తెలియజేశారు.

శ్రీలంక జైలు నుంచి జాలర్లు విడుదల

- 15 మంది తమిళ జాలర్లు చెన్నైకి రాక

తిరువొత్తియూరు: శ్రీలంక జైలు నుంచి విడుదలైన తమిళనాడుకు చెందిన 15 మంది జాలర్లు విమానంలో శుక్రవారం చెన్నైకు చేరుకున్నారు. వారిని మత్స్య శాఖ ఆహ్వానించి వారి సొంత ఊరు రామేశ్వరానికి వాహనాల్లో పంపేందుకు ఏర్పాట్లు చేశారు. తమిళనాడు, రామేశ్వరం జిల్లాకు చెందిన 15 మంది జాలర్లు గత ఒకటవ తేదీ తెల్లవారుజామున కచ్చదీవు వద్ద భారత సముద్ర సరిహద్దు ప్రాంతంలో రెండు ఫైబర్ పడవలలో చేపలు పడుతున్నారు. ఆ సమయంలో గస్తీ చేస్తున్న శ్రీలంక నౌకాదళం పోలీసులు తమిళ జాలర్లు సరిహద్దు దాటి చేపలు పడుతున్నారని రామేశ్వరానికి చెందిన 15 మంది జాలర్లను అరెస్ట్ చేసి శ్రీలంకకు తీసుకెళ్లారు. శ్రీలంక కోర్టులో హాజరు పరిచి జైల్లో పెట్టారు. జాలర్ల కుటుంబసభ్యులు తమ వారిని విడిపించడానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు విజ్ఞప్తి చేసుకున్నారు. దీంతో ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవడంతో 15 మంది జాలర్లను శ్రీలంక కోర్టు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాయబార అధికారుల సంరక్షణలో ఉన్న ఈ 15 మంది జాలర్లు విమానంలో కొలంబో నుంచి శుక్రవారం తెల్లవారుజామున చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చారు. వారికి రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు స్వాగతం పలికారు. తర్వాత 15 మందిని ప్రత్యేక వాహనాల్లో రామేశ్వరానికి తరలించారు.

ఎవరైనా అర్చకులు కావొచ్చు!

- మద్రాసు హైకోర్టు



సాక్షి, చెన్నై: ఆగమం ఆధారంగా శిక్షణ పొందిన వారు ఎవరైనా సరే అర్చకులు కావచ్చు అని, ఇందుకు కులం అడ్డుకాదని మద్రాసు హైకోర్టు సీజే గంగాపూర్వాల బెంచ్ వ్యాఖ్యలు చేసింది. ఎవరైనా అర్చకులు అయ్యేందుకు వీలుందని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వడానికి నిరాకరించారు. సేలం సుగవనేశ్వర్ ఆలయంలో అర్చకుల నియామకానికి ఆలయ అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఇదే ఆలయంలో పనిచేస్తున్న సుబ్రమణియన్ గురుకుల్ అధికారుల చర్యలను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారు. ఆగమం ఆధారంగా ఆలయాలలో పూజలు జరుగుతున్నాయని, అయితే అర్చకుల నియామకం ఇందుకు విరుద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ పిటిషన్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఆనంద వెంకటేషన్ బెంచ్‌లో విచారణ జరిగింది. వాదనల అనంతరం న్యాయమూర్తి స్పందిస్తూ, ఎవరైనా అర్చకులు కావచ్చని, అయితే, ఆగమం, ఇందుకు సంబంధించిన నిబంధనలు, శిక్షణ, పరీక్షలలో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. ఇందుకు కులాలు అడ్డు కాదని ఉత్తర్వులు ఇచ్చారు. దీనిని వ్యతిరేకిస్తూ అప్పీలు పిటిషన్ దాఖలైంది. శుక్రవారం ఈ పిటిషన్ సీజే గంగాపూర్వాల, న్యాయమూర్తి ఆదికేశవులు బెంచ్‌లో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున వాదించిన న్యాయవాదులు ప్రత్యేకకోర్టు ఉత్తర్వులకు స్టే విధించాలని కోరారు. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఆర్ షణ్ముగసుందరం వాదిస్తూ, ఇదే పిటిషనర్లు ఆగమం, ఆలయాలలో అనుసరిస్తున్న విధానాలు, అంశాలపై పరిశీలనకు నియమించిన కమిటీకి వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. ఆలయాల్లో 2,405 అర్చకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీకి ఇలాంటి పిటిషనర్ల రూపంలో జాప్యం జరుగుతోందని వాదించారు. వాదనల అనంతరం బెంచ్ స్పందిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా స్టే ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఎవరైనా అర్చుకులు అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ, తర్వాత విచారణను సెప్టెంబర్ 22వ తేదీకి వాయిదా వేశారు.

రణరంగం..ఎన్‌ఎల్‌సీ దిగ్బంధం

- అన్బుమణి రాందాస్ నేతృత్వంలో ముట్టడికి యత్నం
- అరెస్టులతో అల్లర్లు
- రాళ్ల దాడిలో పోలీసులకు గాయాలు
- గాల్లో కాల్పులు
- సంఘటన స్థలాన్ని డీజీపీ పరిశీలన



ప్రసంగిస్తున్న అన్బుమణి



అన్బుమణి అరెస్ట్



ఎన్‌ఎల్‌సీ వైపు దూసుకెళుతూ, పోలీసులతో వాగ్వాదం

సాక్షి, చెన్నై: స్థల సేకరణకు వ్యతిరేకంగా పీఎంకే నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఎన్‌ఎల్‌సీ దిగ్బంధనం రణరంగాన్ని తలపించింది. అన్బుమణి రాందాస్ సహా నేతల అరెస్టుతో పరిస్థితి అల్లర్లకు దారి తీశాయి. రాళ్లు, బాటిళ్ల దాడిలో పోలీసు వాహనాల అద్దాలు పగిలాయి. పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. పరిస్థితిని కట్టడి చేయడం కోసం పోలీసులు గాల్లో కాల్పులు జరిపారు. ఈ పరిణామాలతో కడలూరుతో పాటు ఆ పరిసరాలలోని పలు జిల్లాల్లో ప్రభుత్వ బస్సుల సేవలు కొన్ని గంటల పాటు నిలుపుదల చేశారు. కడలూరు జిల్లా వేలిలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ కొన్ని దశాబ్దాల పాటు నేలబొగ్గు తవ్వకాలు, విద్యుత్ ఉత్పత్తి రంగంలో దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. నేలబొగ్గు తవ్వకాలు, విస్తరణ పనుల కోసం తరచూ స్థలాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే విస్తరణ పేరిట 34 గ్రామాల్లో 15 వేల ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం మరో 26 గ్రామాల్లో 12 వేల ఎకరాలను స్వాధీనం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. రెండు రోజులుగా పోలీసు భద్రత నడుమ ప్రొక్లైనర్ల ద్వారా పంట పొలాలను నాశనం చేస్తూ స్థల స్వాధీనంలో భాగంగా అతిపెద్ద కాలువల తవ్వకాలలో ఎన్‌ఎల్‌సీ వర్గాలు నిమగ్నమయ్యాయి. దీనిని వ్యతిరేకిస్తూ అక్కడ పోరాటాలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితులలో ఎన్‌ఎల్‌సీ చర్యలను నిరసిస్తూ నైవేలిలో ఆందోళనకు పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాసు పిలుపునిచ్చారు.

శాంతియుతంగా..

నైవేలిలోని ఎన్‌ఎల్‌సీ ప్రధాన కార్యాలయాలకు కూతవేటు దూరంలో అన్బుమణి నేతృత్వంలో శాంతియుతంగా నిరసన జరిగింది. పెద్దఎత్తున పీఎంకే వర్గాలు, వన్నియర్ సంఘాలు, రైతులు నిరసనకు తరలివచ్చారు. ఎన్‌ఎల్‌సీతో తమిళనాడుకు ఒరిగింది శూన్యమేనని, ఇక్కడి విద్యుత్‌ను అధిక ధరకు తమిళనాడు కొనుగోలు చేయాల్సి ఉందని అన్బుమణి ప్రసంగించారు. ఈ సంస్థను తమిళనాడు మూసివేయాలని, ఈ సంస్థకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించకూడదని నినాదాలు చేశారు. స్థల స్వాధీన పనులు ఆపకుంటే, శనివారం కడలూరు, కళ్లకురిచ్చి, విల్లుపురం, అరియలూరు, పెరంబలూరు, జిల్లాలు స్తంభిస్తాయని హెచ్చరించారు. మన మట్టిని..మన ప్రజల్ని మనమే రక్షించుకుందాం అని పిలుపునిచ్చారు. నేతల ప్రసంగాల వరకు శాంతియుతంగానే జరిగిన నిరసన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఉద్రిక్తతకు దారి తీసింది.

ముట్టడితో ఉత్కంఠ..

నిరసనలో ప్రసంగాల అనంతరం ఒక్కసారిగా అన్బుమణితో పాటు నిరసనకారులు ఎన్‌ఎల్‌సీ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించి అక్కడి వ్యవహారాలను దిగ్బంధించేందుకు దూసుకొచ్చారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. ముందు జాగ్రత్తగా రెండు వేల మంది పోలీసులు ప్రవేశ మార్గం వద్ద మోహరించారు. నిరసనకారులు లోనికి వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. ఈ సమయంలో వాగ్వివాదం, తోపులాటలతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రోడ్డుపై అన్బుమణితో పాటు నాయకులు బైఠాయించడంతో వారిని బుజ్జగించేందుకు పోలీసులు శ్రమించారు. చివరకు అన్బుమణితో పాటు కొందరు ముఖ్యనాయకులను అరెస్టు చేసి వ్యాన్‌లో ఎక్కించారు. అరెస్టును ఖండిస్తూ అన్బుమణి నినాదాలు చేశారు.

ఒక్కసారిగా రాళ్లు, బాటిళ్ల వర్షం..

అన్బుమణిని తీసుకెళుతున్న వాహనాన్ని నిరసనకారులు అడ్డుకున్నారు. ఆయన్ను విడుదల చేయాలని నినదించారు. ఆ వాహనం అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో అన్బుమణిని మరో వాహనంలోకి పోలీసులు ఎక్కించారు. ఈ సమయంలో నిరసనకారుల్లో ఆగ్రహం బయలుదేరింది. ఒక్కసారిగా రాళ్లు, గాజు బాటిళ్ల వర్షం ఆ పరిసరాల్లో కురిసింది. దాడి తీవ్రతరం కావడంతో పోలీసులు భయంతో పరుగులు పెట్టారు. పరిస్థితి అల్లర్లకు దారి తీయడంతో ఆ పరిసరాలలో ఉన్న ప్రజల ఆస్తుల పరిరక్షణపై పోలీసులు దృష్టి పెట్టారు. వెంటనే గాల్లో కాల్పులు జరుపుతూ, లాఠీలకు పనిపెట్టారు. వజ్ర వాహనాల నుంచి నీటిని చల్లుతూ, పొగబాంబులను విసురుతూ పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఐజీ కన్నన్‌తో పాటు నాలుగు జిల్లాల ఎస్పీల నేతృత్వంలో పోలీసులు రంగంలోకి దిగి గంట వ్యవధిలో పరిస్థితిని చక్కదిద్దారు. సమాచారం అందుకున్న డీజీపీ శంకర్‌జివ్వాల్ హుటాహుటిన నైవేలికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పరిస్థితి మరలా అదుపు తప్పకుండా జిల్లా వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. నైవేలి మీదుగా ఇతర జిల్లాలకు వెళ్లే బస్సుల సేవలను నిలుపుదల చేశారు. అన్ని ప్రధాన మార్గాలలో భద్రతను పెంచారు. ఎన్‌ఎల్‌సీ పరిసరాలను నిఘా నీడలోకి తీసుకొచ్చారు. రాళ్ల దాడిలో పలువురు పోలీసులు స్వల్పంగా గాయపడ్డారు. రెండు పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ అల్లర్లకు సంబంధించి 300 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నైవేలి వ్యవహారంపై చర్చించాలని కోరుతూ రాజ్యసభలో ఎంపీ సీవీ షణ్ముగం నోటీసు ఇవ్వడం గమనార్హం.

కన్నీళ్లు వచ్చాయి..

ప్రొక్లైనర్ల ద్వారా పంట పొలాలను నాశనం చేస్తున్న వీడియోలను చూసి తనకు కన్నీళ్లు వచ్చాయని హైకోర్టు న్యాయమూర్తి దండపాణి వ్యాఖ్యలు చేశారు. ఎన్‌ఎల్‌సీ ఉద్యోగులకు భద్రత కల్పించాలని దాఖలైన పిటిషన్ విచారణ శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ఈ సమయంలో న్యాయమూర్తి ఎన్‌ఎల్‌సీ తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్థల యజమానికి ఎన్‌ఎల్‌సీ ఉన్నా, పంటలను సర్వనాశనం చేసే హక్కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. పచ్చటి పొలాల్లో ఏపుగా ఎదిగిన పంటను ప్రొక్లైనర్ల ద్వారా నాశనం చేస్తున్న దృశ్యాలను తనకు కన్నీళ్లు తెప్పించాయన్నారు. పంటపూర్తిగా చేతికి వచ్చేందుకు మరో రెండు నెలలు సమయం పట్టవచ్చు అని, అంతవరకు వేచి ఉండలేరా అని అసహనం వ్యక్తం చేశారు. ఎన్‌ఎల్‌సీ న్యాయవాదులు ఇచ్చిన సమాధానం న్యాయమూర్తికి మరింత ఆగ్రహాన్ని తెప్పించింది. ఎన్‌ఎల్‌సీ నుంచే హైకోర్టుకు విద్యుత్ సరఫరా అవుతోందని వారు పేర్కొనడంతో ఒక రోజు పాటు ఏసీలను తన గదిలో న్యాయమూర్తి ఆఫ్ చేసే విధంగా ఆదేశాలు ఇచ్చారు. పచ్చటి పంట పొలాలను తవ్వేస్తున్నారని, భవిష్యత్తులో ఆహార కొరత ఎదురైనప్పుడు, నేల బొగ్గు ద్వారా భర్తీ చేస్తారా అని ప్రశ్నించారు.



ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్న పీఎంకే వర్గాలు



ఘటనా స్థలంలో రాళ్లు

నా మట్టి...నా ప్రజలు యాత్ర ప్రారంభం

- జెండా ఊపిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- తరలివచ్చిన మిత్రపక్షాల ప్రతినిధులు
- తమిళనాట కుటుంబ పాలనకు చరమగీతం : అమిత్‌షా



ప్రసంగిస్తున్న అమిత్ షా



హాజరైన బీజేపీ శ్రేణులు

సాక్షి, చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై 'నా మట్టి..నా ప్రజలు' పాదయాత్ర శుక్రవారం రాత్రి రామేశ్వరం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు రెండు కిమీల దూరం యాత్ర జరిగింది. ఈ యాత్రను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకకు అన్నాడీఎంకే, డీఎండీకే, తమిళ మానిల కాంగ్రెస్ పార్టీలతో పాటు మరికొన్ని చిన్న పార్టీల నాయకులు తరలిరావడంతో బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో బలోపేతం దిశగా అన్నామలై వ్యూహాలకు పదును పెట్టిన విషయం తెలిసిందే. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు నుంచి తమ ప్రతినిధులు పార్లమెంట్‌లో అడుగుపెట్టడం లక్ష్యంగా, మూడోసారిగా నరేంద్ర మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టేందుకు ప్రజామద్దతు కోసం పాదయాత్రకు నిర్ణయించారు. రామేశ్వరం నుంచి 234 అసెంబ్లీ నియోజకవర్గాలు, 39 లోక్‌సభ నియోజకవర్గాలను కలుపుతూ అన్నామలై యాత్ర జరగనుంది. రామనాథపురం జిల్లా రామేశ్వరం వేదికగా ఈ యాత్ర మొదలైంది. ఈ యాత్ర నిమిత్తం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో అమిత్‌షా మదురైకు వచ్చారు. అక్కడి నుంచి రామేశ్వరం సమీపంలోని మండపంకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ఆయనకు బ్రహ్మరథం పట్టే విధంగా బీజేపీ శ్రేణులు ఆహ్వానం పలికాయి.

తరలివచ్చిన మిత్రులు..

128 రోజులు జరగనున్న ఈ యాత్ర ప్రారంభోత్సవంలో భాగంగా రామేశ్వరం దీవిలో బహిరంగ సభ జరిగింది. ఇందులో పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే, విజయకాంత్ నేతృత్వంలోని డీఎండీకే ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే, తమాకా నేత జీకే వాసన్, పుదియ తమిళగం నేత కృష్ణస్వామి, పుదియనిధి కట్చి నేత ఏసీ షణ్ముగం, ఐజేకే నేత రవిపచ్చముత్తు, టీఎంఎంకే నేత జాన్‌పాండియన్, హిందూ మున్నని నేత అర్జున్ సంపత్‌లతో పాటు దేవర్ పేరవై, ఉలవర్ ఉళైపాలర్ కట్చి మరికొన్ని చిన్న పార్టీల నేతలు తరలివచ్చారు. అయితే పీఎంకే నేత అన్బుమణి తరఫున ఎవరూ హాజరు కాలేదు. అలాగే, బీజేపీ నాయకులు సీటీ రవి, సుధాకర్‌రెడ్డి, రాజా, పొన్ రాధాకృష్ణన్, కేంద్ర సహాయ మంత్రి ఎల్ మురుగన్, శాసన సభా పక్షనేత నయనార్ నాగేంద్రన్, మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ పాల్గొన్నారు. ఈ వేదిక నుంచి యాత్రను అమిత్‌షా జెండా ఊపి ప్రారంభించారు. తొలిరోజు రెండు కి.మీ రామేశ్వరం రామనాథస్వామి ఆలయం వరకు జరిగింది. శనివారం నుంచి నియోజకవర్గాల వారీగా రామేశ్వరం నడిబొడ్డు నుంచి అన్నామలై యాత్ర ప్రారంభం కానుంది. తమిళనాడులో మార్పునకు వేదికగా ఈ యాత్ర మారబోతోందని అన్నామలై వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమిలో రోజుకో ప్రధాని అభ్యర్థి తెర పైకి వస్తున్నారని, అదే ఎన్‌డీఏ కూటమిలో శాశ్వత ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ అని ఆయన వ్యాఖ్యలు చేశారు.

కుటుంబ పాలనకు చరమగీతం తథ్యం:

తమిళనాడులో కుటుంబ పాలనకు చరమ గీతం పాడడం తథ్యం అని, ఇందుకు బీజం ఈ యాత్రే అని అమిత్ షా వ్యాఖ్యానించారు. యాత్రను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, రామేశ్వరం పవిత్ర, పారంపర్య భూమి అని ఇక్కడి నుంచి మోదీ సేవను తమిళ ప్రజలకు చాటే విధంగా అన్నామలై ఈ యాత్ర చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ప్రాచీన తమిళ భాష ఖ్యాతిని, చరిత్రను, సంస్కృతిని ప్రపంచానికి చాటే విధంగా ఈయాత్ర ఉంటుందన్నారు. కశ్మీర్ టూ కన్యాకుమారి, కోల్‌కతా టూ సోమనాథ్ వరకు తమిళ సంస్కృతిని చాటడమే కాదు, 130 కోట్ల భారతీయుల మదిలో సుస్థిర స్థానంగా ఈ యాత్ర మారుతుందన్నారు. తమిళనాడులో కుటుంబ పాలనకు చరమ గీతం పాడేందుకు, తమిళనాడును అవినీతి కోరల నుంచి విడిపించేందుకు ఈ యాత్ర అని వ్యాఖ్యలు చేశారు. దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత పేదల సంక్షేమ పథకాలు, పాలన మళ్లీ తమిళనాడులో తీసుకొచ్చేందుకు అన్నామలై ఈ యాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. తమిళ ఖ్యాతిని ప్రపంచ దేశాల వేదికలపై ప్రధాని నరేంద్ర మోది చాటే ప్రసంగాలు చేస్తున్నారని గుర్తు చేశారు.

పశ్చిమబెంగాల్‌కు కొడనాడు కేసు

- ప్రత్యేక బృందం విచారణ
- కోర్టుకు తెలిపిన ప్రభుత్వ న్యాయవాది
- విచారణ సెప్టెంబర్ 8వ తేదీకి వాయిదా

సాక్షి, చెన్నై: కొడనాడు హత్య, దోపిడీ కేసు విచారణ పశ్చిమబెంగాల్‌కు చేరింది. ప్రత్యేక బృందం విచారణ జరుపుతున్నట్లు శుక్రవారం కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది షాజహాన్ వివరించారు. దీంతో కేసు విచారణకు మరింత గడువు దక్కింది. దివంగత సీఎం జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో 2017 నవంబర్‌లో జరిగిన వాచ్‌మన్ హత్య, దోపిడీ ఘటన గురించి తెలిసిందే. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం ఈ కేసును పునర్ విచారణకు చర్యలు తీసుకుంది. తొలుత ఐజీ సుధాకర్, డీఐజీ ముత్తుస్వామి నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏడాది కాలంగా విచారించింది. ఆ తర్వాత సీబీసీఐడీకి కేసును అప్పగించారు. ప్రధానంగా మాజీ సీఎం, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడపాడి పళనిస్వామి, ఆయన సన్నిహితుడు ఇళంగోవన్‌ను టార్గెట్ చేసి ఈ కేసులో సీబీసీఐడీ దూకుడుగా ముందుకెళుతోంది. అలాగే, శశికళ, మాజీ ఎమ్మెల్యే ఆరుకుట్టి వాంగ్మూలం సేకరించారు. ఈ పరిస్థితుల్లో కేసుకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించాలని సీబీసీఐడీని కోర్టు ఇప్పటికే ఆదేశించింది.

పశ్చిమబెంగాల్‌లో..

శుక్రవారం న్యాయమూర్తి శ్రీధరన్ ఎదుట కేసు విచారణకు వచ్చింది. ప్రభుత్వ న్యాయవాది షాజహాన్ కొన్ని వివరాలను కోర్టు ముందు ఉంచారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ పశ్చిమబెంగాల్‌లో జరుగుతోందని, ప్రత్యేక బృందం అక్కడ ఉన్నట్లు వివరించారు. అదనపు సాక్షుల వద్ద విచారణ జరుగుతోందన్నారు. ఇందుకోసం అదనపు సమయం కావాలని కోరారు. అలాగే హత్య జరిగిన రోజు నమోదైన కాల్స్ వివరాలను సేకరించి పరిశోధించాల్సి ఉందన్నారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 8వ తేదీకి వాయిదా వేశారు.

సీఎం స్టాలిన్‌కు అవార్డు



సీఎం స్టాలిన్‌కు అవార్డును అందజేస్తున్న సభ్యులు

- మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ప్రదానం చేసిన చెస్ ఫెడరేషన్
- హాకీ స్టేడియం ముస్తాబు
- ప్రారంభించిన సీఎం స్టాలిన్

సాక్షి,చెన్నై: ప్రపంచ చెస్ చాంపియన్ షిప్ పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకుగాను సీఎం స్టాలిన్‌కు ఆసియా చెస్ ఫెడరేషన్ అవార్డును ప్రకటించింది. మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు -2023 అవార్డును శుక్రవారం సాయంత్రం సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం స్టాలిన్‌కు అందజేశారు. 44వ అంతర్జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు చెన్నై శివారులోని మహాబలిపురం వేదికగా ఇటీవల జరిగిన విషయం తెలిసిందే. ఈపోటీల విజయవంతానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక సహకారం అందించింది. ఇందుకు ఫలితంగా ఆసియా చెస్ ఫెడరేషన్-2023 అవార్డును సీఎం స్టాలిన్‌కు ప్రకటించారు. మ్యాన్ ఆఫ్ ది ఇయర్ పేరిట ఉన్న ఈ అవార్డును ఆసియా చెస్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ భరత్‌సింగ్ చౌహాన్, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సంజయ్‌కపూర్ సీఎం స్టాలిన్‌కు ప్రదానం చేశారు. క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్, కార్యదర్శి అతుల్య మిశ్రా పాల్గొన్నారు.



హాకీ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి

బ్రహ్మాండంగా హాకీ స్టేడియం..

ఎగ్మూర్‌లో మేయర్ రాధాకృష్ణన్ స్టేడియం ఆసియా చాంపియన్‌షిప్ హాకీ పోటీలకు సిద్ధమైంది. ఆగస్టు 3 నుంచి 12వ తేదీ వరకు ఈ స్టేడియంలో జరిగే పోటీలలో భారత్, చైనా, పాకిస్తాన్, మలేషియా, జపాన్, కొరియా దేశాలకు చెందిన హాకీ జట్లు పాల్గొననున్నాయి. ఈ పోటీల కోసం స్టేడియాన్ని సరికొత్తగా తీర్చిదిద్దారు. కృత్రిమ మైదానం, హాకీ మైదానం, కొత్త గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఈ మైదానాలను సీఎం స్టాలిన్ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. గ్యాలరీకి దివంగత డీఎంకే అధినేత కలైంజ్ఞర్ కరుణానిధి పేరు పెట్టారు. అలాగే, హాకీ క్రీడాకారులతో సిద్ధం చేసిన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు.

డాక్టర్ కానున్న కానిస్టేబుల్..!



శివరాజ్

సాక్షి, చెన్నై: పుట్టింది పేదరికంలో అయినా పట్టు వదలకుండా చదివాడు. డాక్టర్ కావాలన్న ప్రయత్నం బెడిసి కొట్టినా, సమయాన్ని వృథా చేయకుండా కానిస్టేబుల్ అయ్యాడు. పట్టువదలకుండా ప్రయత్నం చేసి ఈ ఏడాది కృష్ణగిరి ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటును దక్కించుకున్నాడు. ఇది ఆవడి స్పెషల్ పోలీసు బెటాలియన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ లక్ష్యం. ధర్మపురి జిల్లా పెన్నగరం పుదుకంబట్టికి చెందిన మాణిక్యం, ఇన్బవల్లి దంపతులకు నలుగురు కుమారులు. రైతు కూలీలైన ఈ దంపతులకు చదువు లేదు. ఈ దంపతుల మూడో కుమారుడు శివరాజ్(23)తో పాటు చివరి కుమారుడు చదువుల్లో రాణించారు. మూడో కుమారుడు శివరాజ్ 2016లో ప్లస్‌టూ ముగించాడు. ఇందులో 915 మార్కులు సాధించాడు. కటాఫ్ మార్కుల పుణ్యమా ఎంబీబీఎస్ సీటు దూరమైంది. దీంతో బీఎస్సీ చదవినానంతరం 2020లో సెకండ్ గ్రేడ్ కానిస్టేబుల్ ఎంపిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. గత ఏడాది నీట్ రాశాడు. అయితే, 263 మార్కులు మాత్రమే వచ్చాయి. మలి ప్రయత్నంగా ఈ ఏడాది పరీక్ష రాసిన శివరాజ్ 400 మార్కులు దక్కించుకున్నాడు. ఈ మార్కులతో పాటు తాను చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నందుకు గాను 7.5 శాతం ప్రత్యేక రిజర్వుడ్ కోటా పరిధిలోకి వచ్చాడు. ఈ కోటా సీట్ల భర్తీ శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా జరిగింది. ఇందులో కానిస్టేబుల్ శివరాజ్‌కు డాక్టరు అయ్యే అవకాశం దక్కింది. ఈ కోటా ఆధారంగా కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వరించింది. పేద కుటుంబంలో పుట్టిన తాను, తన తమ్ముడు డాక్టరు అయ్యే అవకాశం దక్కిందని శివరాజ్ ఆనందం వ్యక్తం చేశాడు. తన తమ్ముడు ప్రభుత్వ కళాశాలలో మూడో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్నాడని, ఇప్పుడు తాను మొదటి సంవత్సరంలో చేరబోతున్నట్లు పేర్కొన్నాడు.

క్లుప్తంగా

ఉత్పత్తుల ప్రదర్శన



ప్రదర్శనలో కలెక్టర్

అన్నానగర్: కళ్లకురిచ్చిలో మహిళా స్వయం సహాయక బృందాల ఉత్పత్తుల వస్తువుల ప్రదర్శనను గురువారం కలెక్టర్ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. కల్లకురిచ్చి తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి ఉద్యమం కళ్లకురిచి రైస్ మిల్లు యజమానుల సంఘం హాలులో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పత్తి చేసిన వస్తువుల ప్రదర్శనను గురువారం ఏర్పాటు చేసింది. డైరెక్టర్ సుందర రాజన్ అధ్యక్షత వహించారు. సహాయ ప్రాజెక్టు అధికారులు కార్తికేయ, మాతేష్, రీజనల్ ఆపరేషన్స్ మేనేజర్ సతీష్‌కుమార్ నాయకత్వం వహించారు. కలెక్టర్ శ్రావణ్‌కుమార్ ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించి సందర్శించారు. జిల్లా కోఆర్డినేటర్లు, 30 మందికి పైగా మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మద్యంతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అన్నానగర్: శివగిరిలో కళాప్రదర్శనల ద్వారా మద్యపాన నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. తెన్‌కాశిలో మద్యానికి వ్యతిరేకంగా అవగాహన ప్రచారాన్ని కలెక్టర్ దురై రవిచంద్రన్ 10 రోజుల క్రితం ప్రారంభించారు. ప్రతి ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆఖరి రోజు శుక్రవారం శివగిరి బస్‌స్టేషన్ వద్ద 'మద్యం అనే భూతాన్ని తరిమికొడదాం' అనే అంశంపై తెన్‌కాసి నిషేధ, శంకరన్ కోవిల్ కళా బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. శివగిరి మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటగోపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుందరి, గ్రామ పరిపాలన అధికారి వీరశేఖరన్ పాల్గొన్నారు.

పీఎంకే శ్రేణుల నిరసనలు



వేలూరు : రాస్తారోకో చేస్తున్న పీఎంకే కార్యకర్తలు



తిరుత్తణి : ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి వాహనం



తిరుత్తణి : పీఎంకే శ్రేణుల రాస్తారోకో



తిరువళ్లూరులో..

తిరుత్తణి: అన్బుమణి రాందాస్ అరెస్ట్‌కు నిరసనగా తిరుత్తణిలో శుక్రవారం పీఎంకే శ్రేణులు రాస్తారోకో చేశారు. ఆ సమయంలో అటువైపు వెళ్లిన మంత్రి గాంధీ వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో ఎమ్మెల్యే చంద్రన్ దిగివచ్చి రోడ్డు మధ్యలోని బారికేడ్లు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఎన్‌ఎల్‌సీ విస్తరణ కోసం పంట పొలాల స్వాధీనానికి వ్యతిరేకంగా రైతులతో కలిసి ఎన్‌ఎల్‌సీ కర్మాగారం ప్రధాన గేటు వద్ద ధర్నా చేసిన పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పీఎంకే శ్రేణులు నిరసన చేపట్టారు. తిరుత్తణి బైపాస్ రోడ్డులో సాయంత్రం 5 గంటల సమయంలో రోడ్డుకు మధ్యలో బారికేడ్లు వుంచి పీఎంకే శ్రేణులు రాస్తారోకో చేశారు. అన్బుమణి రాందాస్‌ను విడుదల చేయాలని నినదించారు. ఆ సమయంలో అటువైపు వెళుతున్న మంత్రి గాంధీ, ఎమ్మెల్యే చంద్రన్ వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. వెంటనే కారు దిగివచ్చిన ఎమ్మెల్యే చంద్రన్ రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో వాహనాలు వెళ్లాయి. ట్రాఫిక్ సమస్యతో సంఘటన ప్రాంతం చేరుకున్న పోలీసులు పీఎంకే శ్రేణులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. పీఎంకే రాస్తారోకోతో అర్ధగంట పాటు బైపాస్‌లో హడావుడి చోటుచేసుకుంది.

తిరువళ్లూరులో..

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా పీఎంకే ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మనవాలనగర్‌లోని జంక్షన్ వద్ద జరిగిన ఆందోళనకు పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బాలయోగి అధ్యక్షత వహించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పి వారిని శాంతింపచేసి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పార్టీ నేతలు దినేష్‌కుమార్, వెంకటేషన్ పాల్గొన్నారు.

వేలూరులో...

వేలూరు: పీఎంకే శ్రేణులు చెన్నై–బెంగుళూరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. వేలూరు కలెక్టరేట్ నుంచి పార్టీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరి సత్‌వచ్చారి వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేసి ప్రైవేటు కల్యాణ మండపంలో ఉంచారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఇళవయగన్, ప్రధాన కార్యదర్శి ఎన్‌టీ షణ్ముగం పాల్గొన్నారు. అదేవిధంగా తిరుపత్తూరులోనూ పీఎంకే పార్టీ మాజీ ఎమ్మెల్యే టీకే రాజా ఆధ్వర్యంలో కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించి రోడ్డుపై టైర్లు తగలబెట్టి నిరసన తెలిపారు.

శ్మశానానికి దారి కల్పించండి



పొలంలో మృతదేహాన్ని తీసుకెళుతున్న బంధువులు

అన్నానగర్: శ్రీముష్ణం సమీపంలోని శ్మశాన వాటికకు దారిలేకపోవడంతో మృతదేహాలను పొలాల్లో తీసుకెళ్లే దుస్థితి ఏర్పడింది. కడలూరు జిల్లా శ్రీముష్ణం సమీపంలోని మేల్పులియంగుడి గ్రామంలో వందకుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో అక్కడి పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న పొలం దాటి మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకెళ్లాల్సి వస్తోంది. శుక్రవారం గ్రామంలో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని అతికష్టంతో పొలం గుండా మోసుకెళ్లి శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

అగ్ని ప్రమాదంలో అరటి తోట దగ్ధం



కాలిపోయిన అరటి చెట్లు

అన్నానగర్: మేలమంగళ కురిచ్చిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 5 వేల అరటి చెట్లు దగ్ధమయ్యాయి. తూత్తుక్కుడి జిల్లా ఏరాల్ సమీపంలోని మేలమంగలకురిచ్చిలో వంద ఎకరాలకు పైగా అరటి సాగులో ఉంది. శుక్రవారం ఓ తోటలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో మంటలు పక్కనే ఉన్న తోటలకు వ్యాపించాయి. ఇది చూసిన రైతులు గంటల తరబడి పోరాడి నీళ్లు పోసి మంటలను ఆర్పారు. అప్పటికే మేలమంగళకురిచ్చికి చెందిన ఆంథోని, లింగం, పిచ్చైమణిలకు చెందిన తోటలోని 5 వేల అరటి చెట్లు దగ్ధమయ్యాయి. ఈ రైతులకు రూ.10 లక్షల వరకు నష్టం ఏర్పడింది.

తలనీలాల సమర్పణకు ఇబ్బందులు



బోసిబోయిన తలనీలాల సమర్పణ కేంద్రం

తిరుత్తణి: తిరుత్తణి ఆలయంలో భక్తులు తలనీలాల సమర్పణ కేంద్రంలో టికెట్ మిషన్ మరమ్మతులకు గురికావడంతో భక్తులు వేచివుండాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు తమ మొక్కులు నిమిత్తం తలనీలాలు సమర్పిస్తుంటారు. తలనీలాల సమర్పణ కోసం శరవణ పుష్కరిణి ఘాట్‌వద్ద, కొండ ఆలయం సహా వివిధ ప్రాంతాల్లో తలనీలాల సమర్పణ కేంద్రాలు వున్నాయి. భక్తులకు ఆలయ సిబ్బంది ఉచిత టికెట్, బ్లేడు అందజేసి తలనీలాల సమర్పణకు అనుమతిస్తున్నారు. అయితే ఇటీవల టికెట్ బిల్లింగ్ మిషన్ తరుచూ మరమ్మతులకు గురికావడంతో భక్తులు గంటపాటు వేచివుండాల్సి వచ్చింది. వెంటనే తలనీలాలు సమర్పించేలాఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఏడు మండలాల్లో తాగునీటి సరఫరా నిలిపివేత

కొరుక్కుపేట: సెంబరంబాక్కం సరస్సు నిర్వహణ పనులను జలవనరులశాఖ చేపడుతున్నట్లు చెన్నై డ్రింకింగ్ వాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో అంబత్తూరు, అన్నంగార్, తేనాంపేట, కోడంబాక్కం, వల్సరవాక్కం, ఆలందూరు, అడయార్‌తోపాటు ఏడు మండలాల్లో ఈనెల 31వ తేదీ ఉదయం 8 గంటల వరకు చెంబరంబాక్కం తాగునీటి శుద్ధి కేంద్రం నుంచి పైపుల ద్వారా సరఫరా అయ్యే తాగునీటి సరఫరా నిలిచిపోతుంది. కాబట్టి, ప్రజలు సరిపడా తాగునీరు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. అత్యవసర అవసరాల కోసం ట్రక్కుల ద్వారా తాగునీటిని పొందడానికి బోర్డు Cwrrb.tn.gov.in అనే వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చు. అలాగే నీటి కనెక్షన్ లేని ప్రాంతాలకు ట్యాంకులు ద్వారా తాగునీటి సరఫరాను అంతరాయం లేకుండా సక్రమంగా సరఫరా చేస్తామన్నారు. అలాగే పల్లవరం, పమ్మల్, అనకాపుత్తూరు ప్రాంతాలకు పైపుల ద్వారా నీటి సరఫరా నిలిచిపోతుందని ప్రజలు తగిన నీటి నిల్వలను ఉంచుకోవాలని కోరారు.

హెపటైటిస్ దినోత్సవం

సాక్షి, చెన్నై: చెన్నై పెరుంగుడిలోని జెమ్ ఆసుపత్రిలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు కాలేయ సంబంధిత సమస్యలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహనకు శ్రీకారం చుట్టారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఆగస్టు 6వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి చైర్మన్ పళణి వేలు తెలిపారు. ఉచిత ఫైబ్రోస్కాన్, తదితర పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు.

అమెరికన్ వర్సిటీతో వీఐటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

వేలూరు: వీఐటీ యూనివర్సిటీ అమెరికాలోని జాన్స్ హాఫ్‌కిన్స్ వర్సిటీతో విద్యా, పరిశోధనలపై ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం వల్ల ఈ రెండు యూనివర్శిటీల్లోని విద్యార్థులు, ప్రొఫెసర్‌లు విద్యా పరివర్తన, పరిశోధనలు చేసుకునేందుకు ఇక్కడి విద్యార్థులు అమెరికాలో పరిశోధనలు చేసేందుకు, అమెరికా విద్యార్థులు ఇండియాలో పరిశోధనలు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్ ఇటీవల అమెరికా వెళ్లిన సమయంలో జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్శిటీని సందర్శించారు.

బార్ లైసెన్స్ ఫీజుల సవరణ

కొరుక్కుపేట: స్టార్ హోటళ్లు, వినోద వేదికల్లో బార్ లైసెన్స్ ఫీజులను సర్దుబాటు చేయాలని లిక్కర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదేశించినట్లు సమాచారం. తమిళనాడులోని స్టార్ హోటళ్లు, మద్యం వినోద వేదికల్లో బార్ లైసెన్స్ ఫీజులను పెంచేందుకు ప్రభుత్వం తమిళనాడు లిక్కర్ (లైసెన్స్, పర్మిట్) రూల్స్ 1981ని సవరించింది. అలాగే మద్యం ద్వారా వచ్చే ఆదాయం పెంచేందుకు పలు నిబంధనలను సవరించింది. దీని ప్రకారం ఫైవ్ స్టార్ రెస్టారెంట్ రాయితీ రుసుం రూ.25 లక్షలు కాగా, అంతకు ముందు రూ.20 లక్షలు ఉండేది. ఫోర్ స్టార్ రెస్టారెంట్‌కు గతంలో రూ.12 లక్షలు ఉండగా, రూ.15 లక్షలు నిర్ణయించారు. అలాగే త్రీ స్టార్ రెస్టారెంట్లకు రూ.8 లక్షలు ఉండగా, వాటిని రూ.10 లక్షలకు సవరించనున్నారు. టూ స్టార్ హోటల్‌కు రూ. రూ.6 లక్షల నుంచి రూ.7.5 లక్షలకు పెంచారు. అలాగే వన్ స్టార్, ఇతర రెస్టారెంట్లకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ధర నిర్ణయించినట్లు సమాచారం. అలాగే, కొద్ది నెలల క్రితం మద్యపాన నిషేధంపై రాష్ట్ర ఆరోగ్య శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఆర్‌ఐ–1 లైసెన్స్ ఫీజును రూ.10 వేలు, ఆర్‌ఎల్–2కి రూ.2 వేలకు సవరించారు. అదేవిధంగా దిగుమతి చేసుకునే మద్యంపై సుంకాన్ని లీటర్‌కు రూ.1 నుంచి రూ.6కు పెంచారు.



యాక్షన్‌కు దిగిన పూజాహెగ్డే

తమిళసినిమా: చాలామంది హీరోయిన్లు ఆరంభ దశలో అష్టకష్టాలు పడి అవకాశాలు పొందుతుంటారు. అలా పోరాడి స్టార్ హీరోయిన్ స్థాయికి ఎదుగుతుంటారు. అలా ఎన్నో ముళ్లబాటలను అధిగమించి పూలబాటలో పయనిస్తుంటారు. అయినప్పటికీ కారణాలు ఏమైనా వీరిని విమర్శలు వెంటాడుతూనే ఉంటాయి. అలాంటి వాటిని చాలావరకు పట్టించుకోరు. అయితే దేనికైనా ఒక హద్దంటూ ఉంటుంది కదా, అప్పుడు తగిన రీతిలో రియాక్ట్ అవుతుంటారు. నటి పూజాహెగ్డే కూడా ఇప్పుడు అలాంటి యాక్షన్‌కు దిగింది. ఈ బ్యూటీ పదేళ్ల క్రితం తమిళంలో ముఖముడి చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయమైంది. ఆ చిత్రం పూర్తిగా నిరాశపరచడంతో కోలీవుడ్ ఈ అమ్మడిని పక్కన పెట్టేసింది. అయితే టాలీవుడ్ ఓన్ చేసుకుంది. అక్కడ టాప్ హీరోయిన్లలో ఒకరిగా రాణించిన ఈమె ఆ తర్వాత బాలీవుడ్‌పై దృష్టి సారించింది. అయితే విజయాలే కాదు, అపజయాలు కూడా ఎవరిని వదిలిపెట్టవు. అలా టైం కలిసి రాకపోవడంతో ఈ మధ్య పూజాహెగ్డే నటించిన కొన్ని తెలుగు, తమిళం, హిందీ చిత్రాలు అపజయం పాలయ్యాయి. దీంతో వరస అపజయాలతో కృంగిపోయిన పూజాహెగ్డే ఆత్మహత్యకు పాల్పడిందని, ఆమె కుటుంబసభ్యులు మేలుకోవడంతో ప్రాణాలతో బయటపడిందని ముంబైకి చెందిన ఒక వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. దీంతో అది దావానంలా వ్యాప్తి చెందింది. అంతకుముందు తన గురించి పలు వదంతులు వచ్చినా, లైట్‌గా తీసుకున్న పూజహెగ్డే ఈసారి మాత్రం తన ఆత్మహత్య ప్రయత్నం పుకార్లను తేలిగ్గా తీసుకోలేక పోయింది. దీంతో యాక్షన్‌కుదిగింది తనపై అసత్య ప్రచారం చేసిన ఆ వ్యక్తికి లాయర్ నోటీస్ పంపింది. ఈ సంఘటన ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

కోలీవుడ్ టాక్స్

2న తెరపైకి మెగ్–2 ది ట్రెంచ్



మెగ్ 2 ది ట్రెంచ్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళసినిమా: భారతీయ వెండి తెరపై బీభత్సం సృష్టించడానికి హాలీవుడ్ భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ కథా చిత్రం మెగ్ 2 ది ట్రెంచ్ సిద్ధమైంది. 2018లో వచ్చిన ది మెగ్ చిత్రానికి సీక్వెల్ ఇది. దర్శకుడు బెన్ వెట్లీ తాజా అద్భుతసృష్టి ఈ మెగ్ 2 ది ట్రెంచ్. షార్క్ వంటి వింతైన సముద్రపు జంతు జాతికి, మానవులకు మధ్య జరిగే భయానకమైన పోరే ఈ చిత్రం. ది మెగ్ చిత్రం కంటే పలు రెట్లు బ్రహ్మాండంగా రూపొందించిన చిత్రం ఇదని చిత్ర వర్గాలు పేర్కొంటున్నాయి. సముద్రం గర్భంలో అల్లకల్లోలం సృష్టించే వింతజాతి సంతతి గురించి తెలుసుకోవడానికి ఒక బృందం బయలుదేరుతుంది. అయితే వారు ఆ వింత జాతిని ఎలా ఎదుర్కొన్నారు? వాటిని అంతం చేయగలిగారా అన్న పలు ఆసక్తికరమైన సంఘటనలతో రూపొందిన మెగ్ 2 ది ట్రెంచ్ చిత్రం అన్నారు. వాటి ధాటికి హెలికాప్టర్లు, పెద్ద పెద్ద బోట్లు తునాతునకలవుతాయి. చిత్రంలో గ్రాఫిక్స్ సన్నివేశాలు ప్రేక్షకులను అబ్బుర పరుస్తాయన్నారు. దీన్ని వార్నెస్ బ్రదర్స్ సంస్థ భారతదేశంలో ఆగస్టు 2న తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో భారీ ఎత్తున విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది.

వైట్‌రోస్‌లో కయల్ ఆనంది



వైట్‌రోస్ చిత్రంలోని వర్కింగ్ స్టిల్

తమిళసినిమా: మంచి కథా పాత్రలను ఎంపిక చేసుకుని నటిస్తూ పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను తెచ్చుకున్న నటి కయల్ ఆనంది. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం వైట్‌రోస్. ఈ సైకలాజికల్ థ్రిల్లర్ కథా చిత్రంలో నటుడు ఆర్‌కే సురేష్ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. రంజని నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా రాజశేఖర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన దర్శకుడు సుశిగణేశన్ శిష్యుడు అన్నది గమనార్హం. చిత్ర యూనిట్ వైట్‌రోస్ వివరాలను మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ ఇది ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఒక యువతి ఎదుర్కొనే సమస్యలు ఇతివృత్తంతో రూపొందిస్తున్న కథా చిత్రం అన్నారు. ఇది ఉత్కంఠ భరితంగా సాగే సైకలాజికల్ థ్రిల్లర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. ఈ చిత్రంలో కయల్ ఆనంది పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుందని, ఆమె కెరీర్‌లోనే ఇది ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని చెప్పారు. కయల్ ఆనంది అద్భుతంగా నటిస్తున్నారన్నారు. ఇక సురేష్ పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. అదేవిధంగా చిత్రంలో మరో ప్రముఖ నటి నటించనున్నారని, ఆ వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చెప్పారు. ఈ చిత్రానికి జోహన్, సంగీతాన్ని ఇళయరాజా శివనేశ్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు.

ఆమె వస్తే బాగుంటుంది కానీ..

విశాల్



తమిళసినిమా: నటీమణులు చిత్రాలు చేసినా, చేయకపోయినా ఎప్పుడు ట్రెండింగ్‌లోనే ఉంటారు. సంచలన నటి నయనతార వంటి వారైతే ఇక చెప్పనవసరం లేదు. పాత్రికేయుల దృష్టి నుంచి ఇలాంటివారు తప్పించుకోలేరు. ఇక అసలు విషయానికి వస్తే నటుడు విశాల్ తాజాగా కథానాయకుడిగా నటించిన చిత్రం మార్క్ ఆంటోని. నటి ప్రీతివర్మ నాయకిగా నటించిన ఇందులో ఎస్‌జే సూర్య ప్రతినాయకుడిగా నటించారు. దర్శకుడు సెల్వరాఘవన్ ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని, ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మినీ స్టూడియోస్ పతాకంపై వినోద్‌కుమార్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. చిత్రం వినాయకచవితికి తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న విశాల్‌ను నయనతార చిత్ర కార్యక్రమాల్లో పాల్గొన్న పోవడానికి కారణం ఏంటన్న విలేకరి ప్రశ్నకు ఆయన బదులిస్తూ నయనతార ఏ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని అది ఆమె వ్యక్తిగత హక్కు అని పేర్కొన్నారు. కచ్చితంగా పాల్గొనాలని ఆమెను నిర్బంధం చేయలేమన్నారు. తనకు ఇష్టం లేదని చెబితే ఆమెను మనం ఏమి చేయలేమన్నారు. అయితే ఆమె వస్తే బాగుంటుందన్నారు. చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పేమి కాదని విశాల్ పేర్కొన్నారు.



నయనతార

సూర్య చిత్రంలో దుల్కర్ సల్మాన్



సూర్య, దర్శకురాలు సుధా కొంగర, దుల్కర్ సల్మాన్

తమిళసినిమా: సూర్య తాజాగా నటిస్తున్న చిత్రం కంగువా. నటి దిశాపటాని నాయకిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శివ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ జ్ఞానవేల్ రాజా, యూవీ క్రియేషన్స్ సంస్థతో కలిసి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. భారీ ఎత్తున 10 భాషల్లో 3డీ ఫార్మెట్లో రూపొందుతున్న ఈ చిత్ర షూటింగ్ సగానికి పైగా పూర్తయింది. ఇటీవలే కంగువా చిత్రానికి సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేయగా సినీ వర్గాల నుంచి, ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది. కంగువా చిత్రం 2024 సమ్మర్ స్పెషల్‌గా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. కాగా సూర్య తన తర్వాత చిత్రానికి సిద్ధమవుతున్నారు. సుధా కొంగర దర్శకత్వంలో ఈయన మరోసారి నటించనున్నారు. ఈ కాంబోలో ఇంతకుముందు సూరరై పోట్రు వంటి సూపర్ హిట్ చిత్రం వచ్చిన విషయం తెలిసిందే. కాగా మరోసారి ఈ కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ నటుడు దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రను పోషించనున్నట్లు తాజా సమాచారం. ముందుగా ఇందులో సూర్య, ఆయన సోదరుడు కార్తీ నటిస్తారని ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు సూర్యతో దుల్కర్ సల్మాన్ నటించనున్నట్లు తెలిసింది ఈ క్రేజీ కాంబినేషన్లో రూపొందిన చిత్రాన్ని సూర్య తన 2డీ ఎంటర్‌టైన్ పతాకంపై నిర్మించనున్నట్లు సమాచారం. ఇది సూర్య నటించే 43వ చిత్రం అవుతుంది. దీనికి జీవి ప్రకాష్‌కుమార్ సంగీతాన్ని అందించనున్నారు. ఇది ఆయనకు 100 చిత్రం కావడం విశేషం. చిత్ర షూటింగ్ డిసెంబర్లో ప్రారంభమవుతుందని తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. దీని తర్వాత సూర్య వెట్రిమారన్ దర్శకత్వంలో వాడివాసల్ చిత్రాన్ని చేస్తారని సమాచారం.

క్లుప్తంగా

కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్



ముఖ్య అతిథి గీతను సత్కరిస్తున్న శరత్ కుమార్, మోహనశ్రీ

కొరుక్కుపేట: కష్టపడి చదివితేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని కాలేజియేట్ ఎడ్యుకేషన్–చెన్నై డైరెక్టర్ డాక్టర్ జి.గీతా హితవుపలికారు. ఈ మేరకు ఎస్కేపీసీ కళాలయా ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు స్నిగ్ధా పేరిట మొదటి సంవత్సరం విద్యార్థినులకు నిర్వహించిన ప్రతిభాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. శుక్రవారం ఉదయం కళాశాల నక్షత్ర స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభోత్సవం కార్యక్రమానికి డాక్టర్ జి.గీతా పాల్గొని కొత్త కౌన్సిల్‌కు బ్యాడ్జ్‌లు అందించి ఆశీర్వదించారు. ఎస్కేపీసీ 25వ సంవత్సరం సందర్భంగా ప్లస్‌టూలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు స్కాలర్ షిప్‌లు, పేద విద్యార్థులకు 100 శాతం ఉచిత విద్య అలాగే సేవా ప్రాజెక్టు క్రింద కుట్టుమిషన్, పిండి మిషన్‌లను అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ పోటీల్లో ఓవరాల్ ట్రోఫీని బీకాం(హానర్స్), రన్నరప్‌గా బీకాం(జనరల్) నిలిచాయి. కరస్పాండెంట్ ఊటుకూరు శరత్ కుమార్, ప్రిన్సిపాల్ మోహనశ్రీ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

తిరువొత్తియూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని శుక్రవారం ఉదయం పండ్ల వ్యాపారి మృతి చెందారు. చెన్నై అరుంబాక్కం ఎంఎండీఏ కాలనీకి చెందిన కాంత (65) మడిపాక్కంలో పండ్ల వ్యాపారం చేస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తన ఇంటి నుంచి కాంత పండ్లు తీసుకోవడానికి కోయంబేడు మార్కెట్‌కు వెళ్లడానికి అరుంబాక్కంలో రోడ్డు దాటేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. కాంత అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న అన్నానగర్ ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీసీటీవీ కెమెరా ద్వారా కారును గుర్తించే పనిలో ఉన్నారు.

అగ్నిప్రమాదంలో 6 గుడిసెలు దగ్ధం

అన్నానగర్: అగ్ని ప్రమాదంలో 6 గుడిసెలు దగ్ధమైన ఘటన మైలాడుదురైలో శుక్రవారం చోటుచేసుకుంది. సుమారు రూ.10 లక్షల విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు.. మైలాడుతురై సమీపంలోని అచ్యుతరాయపురం ఉత్తర వీధిలో లక్ష్మణన్ ఇంటి వెనుక భాగంలో వెదురు చెట్లు ఉన్నాయి. ఈ వెదురు తోటలో శుక్రవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిప్పురవ్వ అక్కడున్న గుడిసెలపై పడడంతో మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న మైలాడుదురై అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సుమారు 3 గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో మహాలక్ష్మి, శాంతి, బాలసుబ్రమణ్యం, మల్లిక, చెల్లక్కలి, వసంతకు చెందిన 6 గుడిసెలు, రూ.10 లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజకుమార్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు కామాక్షి మూర్తి, తహసీల్దార్ మహేంద్రన్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

ప్రయాణికుడి హఠాన్మరణం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయానికి శుక్రవారం రాత్రి మలేషియా రాజధాని కోలాలంపూర్ నుంచి మలిండో విమానం వచ్చింది. ఈ విమానంలో మలేషియాకు చెందిన రామ అళగప్పన్ (78) వచ్చాడు. అతను తిరుచ్చి విమానాశ్రయంలో కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ అధికారులను క్లియర్ చేసి, విమానాశ్రయ టెర్మినల్ నుంచి కారైకుడి వైపు వెళ్లేందుకు కారులో బయలుదేరాడు. అకస్మాత్తుగా ఛాతీ నొప్పి వచ్చింది. దీంతో కారు డ్రైవర్ జైలు కార్నర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు పరీక్షించగా మృతి చెందినట్లు తేలింది. ఈ విషయాన్ని వెంటనే విమానాశ్రయ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు మహిళ మృతి

తిరువళ్లూరు: కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు వెళ్లిన మహిళ పాముకాటుకు బలైన సంఘటన పొన్నేరి వద్ద జరిగింది. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని అండాళ్‌కుప్పం గ్రామానికి చెందిన గంగమ్మ(55) తన సోదరి కస్తూరితో కలిసి ఒకే ఇంట్లో నిద్రించింది. శుక్రవారం ఉదయం 4 గంటలకు గంగమ్మ కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు వెళ్లగా అక్కడ పాము కాటువేసింది. ఇంటికి వచ్చి వైద్యశాలకు వెళ్లేలోపు అపస్మార స్థితికి వెళ్లింది. బంధువులు హుటాహుటిన పొన్నేరి వైద్యశాలకు తరలించారు. అయితే గంగమ్మను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పాత పింఛన్ అమలు చేయాలని ఆందోళన

తిరువొత్తియూరు: పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఉదయం ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. చెన్నై నుంగంబాక్కంలో ఉన్న పాఠశాల విద్యా విభాగం డైరెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.

కౌన్సిలర్లకు గౌరవవేతనం

- రోడ్లకు రూ.150 కోట్లు
- కార్పొరేషన్ మీట్‌లో తీర్మానం



చెన్నై కార్పొరేషన్ సమావేశం

సాక్షి, చెన్నై: చెన్నై కార్పొరేషన్ కౌన్సిలర్లకు నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వనున్నారు. ఇందుకు కార్పొరేషన్ సమావేశంలో శుక్రవారం ఆమోదముద్ర వేశారు. అలాగే, నగరంలో వర్షం కారణంగా దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు రూ.150 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించారు. చెన్నై కార్పొరేషన్ పాలకమండలి సమావేశం శుక్రవారం ఉదయం రిప్పన్ బిల్డింగ్‌లో జరిగింది. మేయర్ ప్రియ అధ్యక్షతన జరిగిన ఈ సమావేంలో డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్, కమిషనర్ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. మండల కమిటీ అధ్యక్షుడు నేతాజీ గణేష్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 200 వార్డులలోనూ దంత వైద్యుల నియామకానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, తండయార్‌పేట ఆస్పత్రి, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇందుకు కమిషనర్ రాధాకృష్ణన్ సమాధానం ఇస్తూ, ఆదిశగా చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంకే సభ్యుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ చెత్త తొలగించేందుకు అందజేసిన బ్యాటరీ వాహనాలు చార్జింగ్ లేకుండా ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి. అదనపు చార్జర్లకు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే, కొత్త వాహనాలను త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరారు. పది రోజుల్లో 350 బ్యాటరీ వాహనాలను కొనుగోలు చేయనున్నట్టు కమిషనర్ సమాధానం ఇచ్చారు. చివరగా సమావేశంలో మేయర్‌కు నెలకు రూ.30 వేలు, డిప్యూటీ మేయర్‌కు రూ.15 వేలు, సభ్యులకు తలా రూ . పదివేలు చొప్పున గౌరవ వేతనం అందజేయడానికి సంబంధించిన తీర్మానాన్ని ఆమోదించారు. ఈ ఏడాది జూలై నుంచి మార్చి 2024 వరకు ఈ గౌరవవేతనం తొమ్మిది నెలలు అమల్లో ఉంటుందని మేయర్ ప్రకటించారు. ప్రతినెలా సభ్యుల బ్యాంక్ ఖాతాలలో ఈ మొత్తం జమ చేస్తామన్నారు. చెన్నైలోని ఆరు మండల కమిటీల అధ్యక్షులకు ఇన్నోవా కారు కొనుగోలు నిమిత్తం ప్రభుత్వానికి సిఫారసు చేశారు. అలాగే, వర్షం కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు రూ.150 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించారు.

ఎస్పీకి అన్నాడీఎంకే పార్టీ నేతల వినతి



వేలూరు ఎస్పీ కార్యాలయానికి వచ్చిన అన్నాడీఎంకే నేతలు

వేలూరు: నగరంలోని ఎస్పీ కార్యాలయానికి అన్నాడీఎంకే పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే అప్పు పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం వెళ్లారు. అన్నాడీఎంకే వ్యతిరేకవర్గం తమ పార్టీ జెండా వినియోగించకుండా చూడాలని ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే వారిపై తమ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడపాడి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. పార్టీ నుంచి తొలగించిన వ్యక్తులు వేలూరు కలెక్టరేట్ ఎదుట ఆగస్టు ఒకటో తేదీ ధర్నా నిర్వహించేందుకు చూస్తున్నారని.. అందులో పాల్గొనే వారికి పార్టీ జెండా ఉపయోగించడానికి అవకాశం లేదన్నారు. పార్టీ జిల్లా కోశాధికారి మూర్తి, ఐటీ విభాగం రీజినల్ కార్యదర్శి జననీసతీష్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజన్ పాల్గొన్నారు.

నటి శోభన ఇంట్లో చోరీ

తమిళసినిమా: సీనియర్ నటి, నాట్య కళాకారిణి శోభన ఇంట్లో చోరీ జరిగింది. ఈమె స్థానిక తేనాంపేట, శ్రీమాన్ శ్రీనివాసకాలనీలో తల్లి ఆనందంతో కలిసి ఉంటోంది. రెండస్తుల భవనంలో పైభాగంలో వీరు నివశిస్తూ, కింది భాగంలో డాన్స్ స్కూల్ నిర్వహిస్తున్నారు. కాగా వృద్ధాప్యంలో ఉన్న తన తల్లికి పరిచర్యలు కోసం కడలూరు జిల్లా, కొట్టుమన్నార్ కోవిల్‌కు చెందిన విజయ అనే మహిళను పనికి చేర్చుకున్నారు. కాగా గత కొద్దిరోజులుగా తల్లి డబ్బు చోరీకి గురవుతున్న విషయాన్ని శోభన గుర్తించారు. వారి ఇంటికి ఇతరులెవరూ వచ్చే అవకాశం లేకపోవడంతో పనిమనిషి విజయను శోభన ప్రశ్నించారు. ఆమె తనకేమీ తెలియదని బుకాయించింది. దీంతో శోభన స్థానిక తేనాంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పనిమనిషి విజయను అదుపులోకి తీసుకుని విచారించారు. గత మార్చి నెల నుంచి రూ.41 వేల వరకు దొంగలించినట్లు అంగీకరించింది. డబ్బును కారుడ్రైవర్ మురుగన్ ద్వారా కూతురికి గూగుల్ పే చేసినట్లు చెప్పింది. పేదరికం కారణంగానే దొంగతనం చేశానని, తనను పని నుంచి తప్పించవద్దని, పోలీసుల ద్వారా శోభనను వేడుకుంది. దీంతో ఆమెపై కేసు నమోదు చేయొద్దని పోలీసులకు చెప్పిన శోభన పనిమనిషిని పనిలో నుంచి తీయకుండా ఆమె చోరీ చేసిన రూ.41 వేలను తన జీతంలో కట్ చేయనున్నట్లు పోలీసులకు తెలిపారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

తిరువళ్లూరు: జిమ్ మాస్టర్‌పై కత్తితో దాడి చేసిన ఘటనలో న్యాయవాది సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. తిరువళ్లూరు జిల్లా పేరంబాక్కం సమీపంలోని తిరువేళాంగాడు చిన్నమండలి గ్రామానికి చెందిన మణి(23). ఇతను మప్పేడులో జిమ్ కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత 21న జిమ్ నుంచి రాత్రి పది గంటలకు ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. ఇతడ్ని మప్పేడుకు సమీపంలో బాలచంద్రన్ అనే న్యాయవాది సహా ఐదుగురు అడ్డగించి కత్తితో దాడి చేసి పరారయ్యాడు. మప్పేడు పోలీసులు దర్యాప్తు చేశారు. పోలీసుల విచారణలో మణికి కొందరితో పాతకక్షలు వున్నట్టు తెలిసింది. అనంతరం పేరంబాక్కం గ్రామానికి చెందిన న్యాయవాది బాలచంద్రన్(35), అరక్కోణంకు చెందిన గోకుల్(22), కన్నన్(24), మైనర్లు ఇద్దరిని అరెస్టు చేశారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

తిరువళ్లూరు: ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆరంబాక్కంలో విషాదాన్ని నింపింది. చెన్నై వ్యాసార్‌పాడి ప్రాంతానికి చెందిన త్యాగరాజన్‌కు ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు ప్రైవేటు కంపెనీలో పని చేస్తుండగా, రెండో కుమారుడు సంజయ్(19) ఆరంబాక్కం సమీపంలోని ఎలావూర్ వద్ద ఉన్న బంధువుల ఇంట్లో ఉంటూ ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. గురువారం రాత్రి సంజయ్‌కు అతని తల్లి పలుమార్లు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆందోళన చెందిన త్యాగరాజన్ సంజయ్ ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి తలుపులు తట్టే ప్రయత్నం చేశాడు. అయితే తలుపులు తీయలేదు. దీంతో పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా సంజయ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దింపి చూడగా మృతి చెంది ఉన్నాడు. ఆరంబాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుడి ఆత్మహత్య

అన్నానగర్: అరూరు సమీపంలో దెబ్బతిన్న ఇంటిని బాగు చేయలేక ఓ దివ్యాంగుడు శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మపురి జిల్లా అరూర్ సమీపంలోని పాత కొక్కరపట్టి గ్రామానికి చెందిన పళనివేల్ (35) దివ్యాంగుడు. ఇతనికి సుగుణ అనే భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ స్థితిలో కొన్నేళ్ల క్రితం పళనివేల్ ఇల్లు శిథిలావస్థకు చేరుకుంది. ఇల్లు కేటాయించాలని స్థానిక ప్రభుత్వ ప్రతినిధిని కోరారు. అందుకు తగిన మొత్తం చెల్లిస్తేనే ఇల్లు కేటాయిస్తామని చెప్పినట్లు తెలిసింది. ఈ పరిస్థితిలో కొద్ది రోజులుగా కొక్కరపట్టిలో కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న ఇంట్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. దీంతో పళనివేల్ భార్య, పిల్లలతో కలిసి ఆ ప్రాంతంలోని రేషన్ షాపు కాంప్లెక్స్‌లో బస చేశాడు. విషయం తెలుసుకున్న గ్రామ పరిపాలన అధికారి పళనివేల్, అతని కుటుంబసభ్యులతో మాట్లాడి ఇంటికి పంపించాడు. తిరిగి వచ్చిన పళనివేల్ దెబ్బతిన్న ఇంటిని బాగు చేయలేక తీవ్ర వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంటి పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోపినాథంపట్టి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నబిడ్డను కడతేర్చిన నర్సు అరెస్ట్

అన్నానగర్: వాడిపట్టి సమీపంలో శుక్రవారం కన్నబిడ్డను గొంతుకోసి కడతేర్చిన నర్సును పోలీసులు అరెస్ట్ చేశారు. మదురై జిల్లా వాడిపట్టి సమీపంలోని చెల్లాకులానికి చెందిన శివరాజ్ (39) ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తున్నాడు. ఇతని భార్య జీవిత (28). ఈమె ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు. పెళ్లయిన 8 ఏళ్ల తర్వాత నెల రోజుల క్రితం మగబిడ్డ పుట్టాడు. గురువారం చిన్నారి గొంతుకోసిన స్థితిలో మృతిచెందింది. పోలీసుల విచారణలో మూడురోజులుగా అక్కి వ్యాధితో బాధపడుతూ ఏడుస్తూనే ఉండడంతో మనస్తాపానికి గురై చిన్నారిని గొంతు కోసి హత్య చేసినట్లు తల్లి నేరం అంగీకరించింది. వాడిపట్టి పోలీసులు జీవితను అరెస్టు చేశారు.

పోలీసులపై దాడి కేసులో రౌడీ అరెస్ట్

తిరువొత్తియూరు: పోలీసులపై దాడి కేసులో రౌడీని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కేరళ రాష్ట్రం అలంపుల సమీపంలో ఉన్న అంబలాప్పులా ప్రాంతానికి చెందిన టోల్‌సన్. ఇతను అంబలాప్పులా పోలీస్ స్టేషన్లో ఎస్ఐ. అంబలాప్పులా ప్రాంతంలో ఉన్న ఒక హోటల్లో కొన్ని రోజుల క్రితం రౌడీ విష్ణులాల్ (29) అనే అతను హోటల్‌లోకి చొరబడి దాడిచేసినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో కోవై జిల్లా పీలమేడు ప్రాంతంలో ఉన్న హోటల్లో విష్ణులాల్ ఉంటున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అతన్ని పట్టుకునేందుకు ఎస్ఐ టోల్‌సన్, నలుగురు పోలీసులు విష్ణులాల్‌ను పట్టుకోడానికి పీలమేడు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ రౌడీ విష్ణులాల్ రాడ్‌తో టోల్‌సన్, పోలీసులపై దాడి చేసి తప్పించుకున్నాడు. పోలీసులు అతని వెంటాడి పట్టుకుని అరెస్టు చేశారు.

అప్పీలు కేసులో నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్ : చోరీ అప్పీలు కేసులో తమిళనాడు వేలూరు జిల్లా గుడియాత్తం తాలూకా ఉప్పరపల్లికి చెందిన టి.ఆనందరాజ్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ శుక్రవారం తీర్పు చెప్పారు. 2021 జూన్ 1న పుత్తూరు, మూలకోన శివాలయం వద్ద ఉంచిన ద్విచక్ర వాహనంతోపాటు 2021 జూన్ 24న పుత్తూరు కాపువీధిలో ద్విచక్ర వాహనాన్ని ముగ్గురు దుండగులు చోరీ చేసి ఆనందరాజ్‌కు విక్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పుత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేసి చోరీకి పాల్పడ్డ ముగ్గురితో పాటు వాహనాలను కొనుగోలు చేసిన ఆనందరాజ్‌పై కేసు నమోదు చేసి పుత్తూరు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి కేసు పూర్వాపరాలు పరిశీలించి నలుగురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ 2021లో తీర్పు చెప్పారు. ముగ్గురు నిందితులు ఇదివరలో శిక్షను అనుభవించారు. ఆ తీర్పుపై ఆనందరాజ్ తిరుపతి కోర్టులో అప్పీలు దాఖలు చేశాడు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు తీర్పును ఖరారు చేస్తూ ఆనందరాజ్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ వెంకటనారాయణ వాదించారు.

● ఆధునిక వైద్య కేంద్రం



చెన్నై అన్నానగర్‌లో గ్లెనిగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ నేతృత్వంలో గుండె, ఊపిరితిత్తులు, కాలేయ మార్పిడి, రోబోటిక్ శస్త్ర చికిత్స, ప్రత్యామ్నాయ వైద్య సేవలతో ఆధునిక వైద్యకేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. అన్నానగర్ ఎమ్మెల్యే ఎంకే మోహన్, వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ ఐ. రంగనాథన్ ఈ కేంద్రాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు అలోక్ ఖుల్లార్, గోవిని బాల సుబ్రమణియన్, రజనీకాంత్, గురు ప్రసాద్, గ్లెనిగల్స్ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. - సాక్షి, చెన్నై

వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు

కొరుక్కుపేట: తాంబరం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం మేయర్ వసంతకుమారి అధ్యక్షతన శుక్రవారం ఉదయం జరిగింది. డిప్యూటీ మేయర్ కామరాజ్, కమిషనర్ ఆగమ్మిన హాజరయ్యారు. సమావేశంలో రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన అనుమతి కోసం ఒక ఫోరమ్ అంశాన్ని ఉంచారు. ఈ క్రమంలో అన్నాడీఎంకే కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో 9 మంది అన్నాడీఎంకే కౌన్సిలర్లు, ఒక స్వతంత్ర అభ్యర్థి రియల్ ఎస్టేట్ కోసం డీఎంకేలోకి వెళ్లారు. దీంతో అన్నాడీఎంకేకు చెందిన శంకర్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు వాకౌట్ చేశారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్‌ను సత్కరిస్తున్న భారతీరెడ్డి

కొరుక్కుపేట: చెన్నై వడపళనిలోని విజయ హాస్పిటల్‌లో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తల్లి పాల అవశ్యకతపై పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ, సీఈఓ భారతి రెడ్డి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ రాధా కృష్ణన్ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: సెందురైలో నర్సింగ్ కాలేజీ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పెరంబలూరు జిల్లా సెందురై సమీపం నందియాంకుడిక్కాడు గ్రామానికి చెందిన సరిత తిరుచ్చిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చిన సరిత శుక్రవారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సరిత 6 నెలల గర్భవతి అని తెలిసింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జయంగొండం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి అరెస్ట్

అన్నానగర్ : చిదంబరం సమీపంలో 13 ఏళ్ల బాలుడుని గొంతు నులిమి హత్య చేసి గుడి చెరువులో వేసిన ఇంజినీరింగ్ విద్యార్థిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. చిదంబరం సమీపం సౌత్ బిషవరం సందల్ మేట్టు వీధికి చెందిన ధర్మరాజ్ కుమారుడు మణికంఠన్ (13) ఏడో తరగతి చదువుతున్నాడు. గత 20వ తేదీన చిదంబరం నారతంపేట గ్రామంలోని మారియమ్మన్ ఆలయ ఉత్సవాల్లో పాల్గొనేందుకు అక్కడి అమ్మమ్మ లలిత ఇంటికి వెళ్లాడు. అప్పుడు గుడి చెరువులో మణికంఠన్ శవమై కనిపించాడు. అన్నామలై నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. విచారణలో చిదంబరం సమీపంలోని చిదంబరనాథన్ పేట్టైకి చెందిన చంద్రన్‌కుమారుడు రాహుల్ (19) మణికంఠన్‌ను గొంతునులిమి హత్య చేసినట్లు తెలిసింది. పోలీసులు రాహుల్‌ని అరెస్ట్ చేశారు. రాహుల్ సోదరి గురించి మణికంఠన్ మరో స్నేహితుడితో తప్పుగా మాట్లాడినందుకు హత్య చేసినట్లు తెలిసింది.

మహిళను మోసం చేసిన జైలు గార్డ్

కొరుక్కుపేట: ప్రేమిస్తున్నానని ఆరేళ్లుగా కలిసి తిరిగి మరో మహిళను పెళ్లి చేసుకున్న జైలు గార్డుపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె వివరాల మేరకు.. చెన్నైలో జైలు గార్డ్‌గా పనిచేస్తున్న భరత్ ఓ యువతి ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని యువతికి మాట ఇవ్వడంతో ఇద్దరు కలిసి చాలా ప్రాంతాల్లో తిరిగారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా భరత్ యువతితో మాట్లాడడం ఆపేశాడు. అతని ఫోన్‌కు సంప్రదించినా లిఫ్ట్ చేయలేదు. ఆరా తీస్తే ఓ మహిళను పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. అతన్ని ప్రశ్నించగా తనకు వివాహం అయ్యిందని.. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకోనంటూ బెదిరించాడని.. చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

రైలు నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

తిరువళ్లూరు: రైల్లో సాహసం చేయడానికి యత్నించి జారిపడిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తిరువళ్లూరు జిల్లా కావాంగరైలోని శ్రీలంక శరణార్థుల శిబిరానికి చెందిన రాజా కుమారుడు విశాల్(19). ఇతను అంబత్తూరులోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాటరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం అంబత్తూరు నుంచి తిరువళ్లూరుకు వెళ్లి సినిమా చూసి రాత్రి రైలులో తిరుగు ప్రయాణమయ్యాడు. రైలు ఎక్కినప్పటి నుంచి కిందకు దిగడం, ఎక్కడం చేస్తున్నాడు. రైలు వేపంబట్టు స్టేషన్‌లో ఆగి బయలుదేరిన సమయంలో వేగంగా వెళ్లే సమయంలో రైలు ఎక్కడానికి యత్నించి కిందపడ్డాడు. విశాల్ తీవ్ర గాయపడ్డాడు. వెంటనే రైల్వేసిబ్బంది విశాల్‌ను తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం చెన్నై వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రసాయనం తాగి వ్యక్తి మృతి

అన్నానగర్: మార్తాండం సమీపంలో శుక్రవారం మద్యం మత్తులో ఓ కార్మికుడు నీరు అనుకుని రసాయనం తాగి మృతిచెందాడు. కన్యాకుమారి జిల్లా మార్తాండం సమీపం మారుతంగోడ్‌లో అరువికుళవిల్లై ప్రాంతానికి చెందిన జకారియాస్ (75). ఇతని భార్య సిసిలీ (70). వీరికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు అయ్యాయి. జకారియాస్ గురువారం పని ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న అతను దాహం వేయడంతో నీళ్లు అనుకుని ఇంట్లోఉన్న బాటిల్ ఉన్న రసాయనం తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతన్ని ఇరుగుపొరుగు మార్తాండంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ తీవ్ర చికిత్స పొందుతూ జకారియాస్ మృతిచెందాడు. మార్తాండం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● మంత్రి తనిఖీలు



ప్రభుత్వం కలైంజర్ పథకం కింద ప్రతి మహిళకు రూ. వెయ్యి సాయం చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి శిబిరాలను ఏర్పాటు చేశారు. తిరుత్తణి, కేజీకండ్రిగ, ఆర్కేపేట యూనియన్ ఎస్‌బీ కండ్రిగ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని చేనేత పరిశ్రమ శాఖ మంత్రి గాంధీ శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీస్, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, ఆర్డీఓ దీప, తహసీల్దార్ విజయకుమార్ ఉన్నారు. - తిరుత్తణి

20 ఏసీలు తీసుకుని మోసం

- యువకుడి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై వ్యాసార్పాడిలో రూ. 7 లక్షల విలువ కలిగిన 20 ఏసీలను తీసుకొని నగదు ఇవ్వకుండా మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై వ్యాసార్పాడి బీవీ కాలనీ నాల్గవ వీధికి చెందిన మణికంఠన్ (30). వ్యాసార్పాడిలో ఎరుకంచేరి మెయిన్ రోడ్డులో హోమ్ నీడ్స్ దుకాణం నడుపుతున్నాడు. ఈ క్రమంలో తనకు పరిచయమైన వినోద్‌కుమార్ (34) తాను ఏసీలను విక్రయించి ఇస్తానని చెప్పడంతో మణికంఠన్, వినోద్‌కుమార్‌కు రూ. 7లక్షల విలువ కలిగిన 20 ఏసీలను ఇచ్చాడు. కానీ నగదు ఇవ్వకుండా మోసం చేయడంతో దీనిపై మణికంఠన్ గత మేలో చెన్నై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఎంకేబీ నగర్ క్రైమ్ విభాగం పోలీసులు వినోద్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

ప్రాణం తీసిన బ్యాంకు రుణం



రఘురామన్ (ఫైల్)

కొరుక్కుపేట: బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించలేక, మరో వైపు బ్యాంకు సిబ్బంది ఒత్తిడి తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తండయార్‌పేటలో చోటుచేసుకుంది. వినాయకపురానికి చెందిన రఘురామన్ (38) స్టీల్ పాత్రలు తయారు చేసే వర్క్‌షాప్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య చాముండేశ్వరి, కొడుకు, కూతురు ఉన్నారు. రఘురామన్ ఐదేళ్ల క్రితం ప్రైవేట్ బ్యాంక్ లోన్‌తో బైక్ కొన్నాడు. నెలవారీ చెల్లింపులు సకాలంలో చేశాడు. దాంతో అదే ప్రైవేట్ బ్యాంక్ మళ్లీ రఘురామన్‌ను సంప్రదించి పర్సనల్ లోన్ కావాలా అని అడిగాడు. రఘురామన్ 2021లో రూ.3 లక్షల వ్యక్తిగత రుణం తీసుకున్నాడు. 10 నెలల అసలు, వడ్డీ చెల్లించాడు. అప్పటి నుంచి సరైన ఉపాధి లేకపోవడంతో సకాలంలో చెల్లించలేకపోయాడు. కొద్ది నెలల క్రితం తిరువొత్తియూరు నుంచి తన బంధువులు ఉండే తండయార్‌పేటకు షిఫ్ట్ అయ్యాడు. ఈ క్రమంలో బ్యాంకు కాంట్రాక్ట్ ఉద్యోగులు నరసింహన్(23), మణికంఠన్(29) రఘురామన్‌ను ఫోన్‌లో సంప్రదించి బ్యాంకు రుణం చెల్లించాలని కోరారు. వారం నుంచి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఇంటికి వచ్చి డబ్బులు డిమాండ్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీనికి తోడు భార్యతో కూడా తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో భార్య కూలి పనికి వెళ్లేది. ఈ క్రమంలో శుక్రవారం భార్యకు ఫోన్ చేసి బ్యాంకు సిబ్బంది తీరుతో కలత చెందుతున్నట్లు చెప్పాడు. ఆత్మహత్య చేసుకుంటున్నాను.. పిల్లలను బాగా చూసుకో అని ఫోన్ కట్ చేశాడు. అనంతరం భార్య చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాముండేశ్వరి భయాందోళనతో వెంటనే ఇంటికి చేరుకోగా అప్పటికే రాఘురామన్ మృతిచెందాడు. కాశీమేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ప్రైవేట్ బ్యాంకు కాంట్రాక్ట్ ఉద్యోగులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



వానల్లో... మీ పిల్లలు జర భద్రం





మొన్నటిదాకా మండించిన ఎండలు ఇప్పుడు చల్లటి వర్షాలను తీసుకువచ్చాయి. వర్షాకాలం అంటే ఇష్టం లేనిదెవరికి? ముఖ్యంగా పిల్లలకు మరీ ఇష్టం. ఎందుకంటే కాస్త గట్టి వానలు పడితే సెలవలు వస్తాయి. ప్రస్తుతం తెలంగాణ అంతా భారీ వర్షాల కారణంగా అన్ని విద్యాసంస్థలకు సెలవలు ప్రకటించింది ప్రభుత్వం. ఆంధ్రాలో కూడా కొన్ని ప్రాంతాలలో వానాకాలం సెలవలే. సెలవల వరకు బాగానే ఉంది కానీ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవలసిన పెద్దలకు మాత్రం కాస్త కష్టమే. ఆ మాటకొస్తే అంటువ్యాధులు ప్రబలే ఈ కాలంలో పెద్దవాళ్లు కూడా జాగ్రత్తగా ఉండాల్సిందే. ఆ జాగ్రత్తలేమిటో చూద్దాం...

వానరాకడా... మరొకటీ తెలియదని సామెత. ఒక్కోసారి మబ్బులు పట్టిన ఆకాశం ఉరుముతూ వర్షాలకు సిద్ధంగా ఉండమని హెచ్చరిస్తుంది. ఒకోసారి ఏవిధమైన హెచ్చరికలూ చేయకుండానే వర్షం వచ్చి మీదపడుతుంది. అందువల్ల వాతావరణ హెచ్చరికల గురించి తెలుసుకోవడం మంచిది.

తగిన దుస్తులు: వర్షాకాలంలో పిల్లలే కాదు, ఎవరైనా సరే, తేలికగా ఆరిపోయే దుస్తులు ధరించడం మంచిది. తేలికపాటి దుస్తులను పిల్లలకు ధరింపజేయాలి. అసౌకర్యం, చికాకు కలిగించే దుస్తులను ఈ కాలంలో వారికి తొడగకపోవడం చాలా మంచిది.

పాదరక్షల ఎంపిక: వర్షాకాలంలో మీ పిల్లలకు తగిన పాదరక్షలను ఎంచుకోండి. తడి ఉపరితలాలపై జారకుండా నిరోధించడానికి మంచి ట్రాక్షన్‌తో ఉండే వాటర్‌ప్రూఫ్ బూట్లు లేదా చెప్పులను ఎంచుకోండి.

దోమల నుంచి రక్షణ: వర్షాకాలంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు ఎక్కువగా ఉంటాయి. దోమల నిరోధకాలను లేదా దోమతెరలను ఉపయోగించడంతోపాటు ఇంటి చుట్టూ దోమలకు సంతానోత్పత్తి కేంద్రాలుగా మారే నీటి వనరులు ఉండకుండా చూసుకోవడం మంచిది.

పరిశుభ్రత పద్ధతులు: పిల్లలకు మంచి పరిశుభ్రత అలవాట్లను నేర్పాలి. క్రమం తప్పకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవడాన్ని నొక్కి చెప్పండి. భోజనానికి ముందు, టాయిలెట్ తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం అంటు వ్యాధుల వ్యాప్తిని నిరోధించడంలో సహాయపడుతుంది.

నీళ్లు నిలవకుండా చూసుకోవాలి

ఇంటి ఆవరణలో నిలిచిన నీరు, నీటి కుంటలు లేదా మురికి గుంటలు ఉన్న ప్రదేశాలలో ఆడుకోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి పిల్లలకు అవగాహన కల్పించండి. అటువంటి నీటిలో వ్యాధులకు కారణమయ్యే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లు ఉంటాయి కాబట్టి నిల్వ ఉన్న నీటిలో ఆడకుండా చూడండి.

ఆహార భద్రత: వర్షాకాలంలో ఆహార పరిశుభ్రతపై అదనపు శ్రద్ధ అవసరం. స్ట్రీట్ ఫుడ్ లేదా అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలలో నిల్వ ఉండే ఆహారం తీసుకోకుండా చూడాలి. పండ్లు, క్యారట్, బీట్‌రూట్ వంటి పచ్చి కూరగాయలను తినేముందు శుభ్రంగా కడుక్కోవడం తప్పనిసరి చేయడం అవసరం.

తగినంత వెంటిలేషన్: భారీ వర్షాల సమయంలో కిటికీలు మూసి ఉంచడం చాలా కీలకమైనప్పటికీ, మీ ఇంటిలో సరైన వెంటిలేషన్ ఉండేలా చూసుకోవడం తేమ పెరగకుండా నిరోధించడానికి, ఆరోగ్యకరమైన ఇండోర్ వాతావరణాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది.

అలర్జీలు, ఆస్తమా నిర్వహణ: మీ పిల్లలకు అలర్జీలు లేదా ఆస్తమా ఉన్నట్లయితే, వర్షాకాలం వారి ఇబ్బందులను మరింత తీవ్రతరం చేస్తుంది. ఇలాంటప్పుడు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో ముందుగానే మీ ఫ్యామిలీ డాక్టర్‌ను అడిగి తెలుసుకోవడం, అవసరమైతే తగిన మందులను సిద్ధం చేసుకోవడం మంచిది.

పరిశుభ్రమైన నీరు: కాచి చల్లార్చిన నీటిని తాగడం పిల్లలకే కాదు, పెద్దలకూ మంచిదే.

రింగ్‌వార్మ్: ఈ ఫంగల్ ఇన్‌ఫెక్షన్ ఎరుపు, రింగ్ –ఆకారపు దద్దురును కలిగిస్తుంది. దురద లేదా పొలుసులుగా ఉంటుంది. ఇది శరీరంలోని ఏ భాగానికైనా రావచ్చు. తలమీద, గజ్జల్లో , పాదాలపై సర్వసాధారణంగా ఉంటుంది. దీని బారినుంచి పిల్లలను రక్షించుకోవాలి.

ఈ కాలంలో రోజువారీ తీసుకోవలసిన సూపర్‌ఫుడ్

మారుతున్న సీజన్‌తో, ఆహార శైలులను కూడా మార్చడం అత్యవసరం. వ్యాధులు పెరుగుతున్న సమయంలో కొన్ని ఆహారాలు, సుగంధ ద్రవ్యాలను తీసుకోవాలి. పసుపు కలిపిన పాలు, శొంఠి కషాయం, విటమిన్ సి అధికంగా ఉండే ఆహారం, మొలకలు వంటి ఆరోగ్యకరమైన చిరుతిండి ఇవ్వాలి. పెరుగు వంటి ప్రోబయోటిక్స్ పిల్లల్లో మంచి బ్యాక్టీరియాను పెంచటానికి సహాయపడుతుంది. ఇది చెడు బ్యాక్టీరియా లేదా వ్యాధిని కలిగించే బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది. ఆకుపచ్చ కూరగాయలు పోషకాలతో నిండి ఉంటాయి. వెల్లుల్లి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అల్లంలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి కాబట్టి ఏదోరకంగా పిల్లలకు ఇవ్వాలి.



తప్పనిసరిగా తీసుకోవలసిన జాగ్రత్తలు

చర్మాన్ని శుభ్రంగా, పొడిగా ఉంచండి: ఈత లేదా స్నానం చేసిన తర్వాత పూర్తిగా శరీరాన్ని ఆరనివ్వటం మంచిది.

కీళ్లనొప్పులా?
ఈ ఆహారం తీసుకోండి



ప్రస్తుతం చాలా మంది చేతులు, తుంటి, వెన్నెముక, మోకాళ్లు, కీళ్లలో నొప్పులతో బాధపడుతున్నారు. ప్రస్తుతం చాలా మందిలో యూరిక్ యాసిడ్ పెరగడం కారణంగా కీళ్ల నొప్పులు, వాపుల సమస్యల బారిన పడుతున్నారు. వ్యాయామాలు చేయడం కారణంగా ఈ నొప్పులు తీవ్ర తరమవుతున్నాయి. ఎలాంటి ఆహారాలు తీసుకుంటే కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందో తెలుసుకుందాం.

కీళ్ల నొప్పులతో బాధపడేవారు ప్రతి రోజు ఆహారంలో బాదం, వేరుశెనగ, వాల్‌నట్స్ తీసుకుంటే మంచి ఫలితాలు పొందుతారు. ఇందులో పుష్కలంగా లభించే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాల వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. వీటిల్లో ఫైబర్, కాల్షియం, మెగ్నీషియం, జింక్, విటమిన్ ఉ కూడా అధిక పరిమాణంలో లభిస్తుంది. ఎక్కువగా వినియోగించడం వల్ల కీళ్లనొప్పుల నుంచి కూడా సులభంగా ఉపశమనం లభిస్తుంది.



బెర్రీలు

బ్లూబెర్రీస్, బ్లాక్‌బెర్రీస్, స్ట్రాబెర్రీల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వల్ల వీటిని ప్రతిరోజు తినడం కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాకుండా తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బెర్రీల వల్ల శరీరానికి ఫ్రీ రాడికల్స్ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.



కూరగాయలు

సల్ఫోరాఫేన్ కలిగిన ఆహారాలు తీసుకోవడం వల్ల కూడా సులభంగా యూరిక్ యాసిడ్ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కాబట్టి ప్రతి రోజు బ్రోకలీ, కాలీఫ్లవర్‌లను ఆహారంలో తీసుకోవాలి.

ఆలివ్ ఆయిల్

కీళ్ల నొప్పులున్నవారు ఆలివ్ ఆయిల్‌ను వినియోగించి తయారు చేసిన ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరం దృఢంగా మారడంతోపాటు కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.



డార్క్ చాక్లెట్

డార్క్ చాక్లెట్ ప్రతి రోజు తీసుకోవడం వల్ల శరీరానికి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు లభిస్తాయి. ముఖ్యంగా కీళ్ల నొప్పులతో బాధపడేవారు రోజూ వీటిని తీసుకుంటే మంచి ఫలితాలు పొందుతారు. మధుమేహం ఉన్న వారు తీసుకోవడం వల్ల చక్కెర స్థాయులు అదుపులో ఉంటాయి.



మామిడి పండ్లే కాదు... ఆకులు కూడా ఆరోగ్యప్రదమే!

మామిడి పండ్లే కాకుండా ఆకులు కూడా శరీరానికి చాలా రకాల ప్రయోజనాలను కలిగిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పండ్లకయితే సీజన్ కావాలి. అంతవరకు ఎదురు చూడాలి. ఆకులకోసం ఆ అవసరం లేదు కదా...ఇంతకీ మామిడాకులతో ఏ ప్రయోజనాలున్నాయో తెలుసుకుందాం...



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మామిడి ఆకులను నీటిలో మరిగించి తీసుకోవడం ప్రయోజనకరం. డయాబెటీస్, దానికి అనుబంధమైన ఇతర అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. తరచు రక్తంలోని చక్కెర పరిమాణాలు పెరిగే వారు ఈ నీటిని తీసుకోవడం మంచిది.

మామిడాకుల కషాయం శరీరంలోని అవయవాలకు ఔషధంగా పని చేయడమే కాకుండా చర్మం, జుట్టు సమస్యలకు ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో అధిక పరిమాణంలో ఎ, సి వంటి విటమిన్లున్నాయి కాబట్టి వీటిని వినియోగించడం వల్ల శరీరంలో కొల్లాజెన్ పెరుగుతుంది. దీనికారణంగా జుట్టు, చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

కిడ్నీలో స్టోన్స్ కరుగుతాయి.

మామిడి ఆకులను రసంలా చేసి తీసుకోవడం వల్ల పొట్ట సంబంధిత సమస్యలు తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడేవారికి మామిడి ఆకులతో తయారు చేసిన రసం ప్రభావ వంతంగా తోడ్పడుతుంది.

ఊబకాయం.. ఉబ్బసం...

ఊబకాయం, ఉబ్బసం, డయాబెటిస్ లాంటి సమస్యలతో బాధపడేవారు మామిడి ఆకులతో తయారు చేసిన రసాన్ని ప్రతి రోజు తీసుకోవడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

సినిమా

రీల్స్



ధనుష్

పట్టుకుంటే పది వేలు

బందిపోటుగా, హంతకుడిగా ముద్రపడిన 'కెప్టెన్ మిల్లర్'ను పట్టుకున్న వారికి పదివేల రూపాయల రివార్డును ప్రకటిస్తూ 1930లో ఓ పోలీస్ నోట్ విడుదలైంది. మరి.. అప్పటి ప్రభుత్వానికి కెప్టెన్ మిల్లర్ చిక్కాడా? అసలు అతని కథ ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు డిసెంబరులో థియేటర్స్‌లో దొరుకుతాయి. ధనుష్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో టీజీ త్యాగరాజన్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) ధనుష్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కెప్టెన్ మిల్లర్' టీజర్‌ను విడుదల చేసి, సినిమాను డిసెంబరు 15న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో 'కెప్టెన్ మిల్లర్'లో కీలక పాత్ర చేసిన హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ సినిమా కాకుండా ధనుష్ అన్న దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డీ 50'లోనూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాను'' అని అన్నారు. ''1930–1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీ రోల్ చేస్తున్నారు.

నెచ్చెలి విసిరినది వెచ్చని వల...



సమంత, విజయ్ దేవరకొండ

'ఖుషీ నువు కనబడితే.. ఖుషీ నీ మాట వినబడితే...' అంటూ మొదలైంది 'ఖుషి' సినిమా టైటిల్ సాంగ్. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం ఇది. శివ నిర్వాణ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. 'ఖుషీ నువు కనబడితే' అని మొదలై, 'హే నెచ్చెలి నెచ్చెలి వచ్చి విసిరినది వెచ్చని వెచ్చని వల.. హే ముచ్చటగా నను గిల్లి గిచ్చినది కల..' అంటూ సాగుతుందీ పాట. దర్శకుడు శివ నిర్వాణ ఈ పాటకు లిరిక్స్ అందించగా, ఈ చిత్ర సంగీత దర్శకుడు హిషామ్ అబ్దుల్ వాహబ్ పాడారు.

లక్కీ భాస్కర్



దుల్కర్ సల్మాన్

'మహానటి, సీతారామం' వంటి వరుస విజయాల తర్వాత తెలుగులో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ధనుష్‌తో 'సార్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) దుల్కర్ సల్మాన్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ప్రకటించారు. ''నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ మనిషి కథగా 'లక్కీ భాస్కర్' రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా వెంకీ అట్లూరి మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు'' అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

'కాంత'.. దుల్కర్ బర్త్ డే సందర్భంగా 'కాంత' అనే మరో చిత్రం ప్రకటన వెల్లడైంది. ఈ చిత్రంలో దుల్కర్ హీరోగా నటించడంతో పాటు రానాతో కలిసి నిర్మిస్తున్నారు. గతంలో 'నిలా' చిత్రం, 'ద హంట్ ఆఫ్ వీరప్పన్' డాక్యుమెంటరీ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ 'కాంత'ను తెరకెక్కించనున్నారు.



అదితీరావ్ హైదరి

తొలి అడుగు

ఇటు సౌత్.. అటు నార్త్.. కాస్త ఖాళీ దొరికితే డిజిటల్ వరల్డ్... ఇలా వరుస ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంటున్నారు హీరోయిన్ అదితీరావ్ హైదరి. అయితే తొలిసారి ఈ బ్యూటీ ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. తమిళ దర్శక–నటుడు రాజేష్ ఎమ్. సెల్వ ఇటీవల కథానాయిక ప్రాధాన్యంగా సాగే ఓ కథ తయారు చేశారని, ఈ కథ విని, ఇందులోని పాత్ర నచ్చడంతో అదితీరావ్ హైదరి పచ్చ జెండా ఊపారని కోలీవుడ్ టాక్. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెలలో ఆరంభం కానుందట. లేడీ ఓరియంటెడ్ చిత్రాల పరంగా అదితీకి ఇది తొలి అడుగు. మరి.. ఈ తొలి అడుగుతో ఈ తరహా చిత్రాలు ఇంకెన్ని చేస్తారో చూడాలి. ఇక 'సమ్మోహనం, వి, అంతరిక్షం, మహాసముద్రం' వంటి చిత్రాలతో అదితీరావ్ హైదరి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే.

హద్దుల్లో ఉంటే అడ్డే ఉండదు

- హీరోయిన్ శ్రీలీల



''చిత్ర పరిశ్రమ అనేది గౌరవం ఉన్న ఇండస్ట్రీ. మన హద్దుల్లో మనం ఉండి సినిమాలు చేసుకుంటే అడ్డేదీ ఉండదు.. ఎలాంటి ఇబ్బందులు రావు. తెలుగమ్మాయి అయిన హీరోయిన్ ప్రణవికి నేను ఇచ్చే సలహా ఇదే'' అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమా రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ ద్వారా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలీల మాట్లాడుతూ– ''స్లమ్ డాగ్ హజ్బెండ్' సినిమా సూపర్ హిట్ కావాలి'' అన్నారు. ''మా సినిమాలో వినోదం, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి'' అన్నారు ఏఆర్ శ్రీధర్. ''శ్రీలీల, వైష్ణవీ చైతన్య, ప్రణవి తెలుగు అమ్మాయిలే. నా కొత్త సినిమాకు తెలుగు అమ్మాయినే హీరోయిన్‌గా తీసుకుంటా'' అన్నారు డైరెక్టర్ బుచ్చిబాబు సానా. ''స్లమ్ డాగ్ హజ్బెండ్' హిట్ అయితే మరో పదిమంది కొత్తవాళ్లకు అవకాశాలు ఇస్తాం'' అన్నారు అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి.

అంతా మంచే జరుగుతుంది

- విష్ణు మంచు



తేజ్, విష్ణు మంచు, రిషిక

''ఇండస్ట్రీలో ఓ యాక్టర్‌కి, మేకప్ మేన్‌కి ఉన్న బంధం భార్యాభర్తల్లాంటిది. నేను చిన్నప్పటి నుంచి మేకప్‌మేన్ చంద్రగారిని చూస్తున్నాను. ఓ రైటర్‌గా, డైరెక్టర్‌గా, నిర్మాతగా సినిమా చేయటం అంత సులభం కాదు.. ఆయన మంచి మనసుకి అంతా మంచే జరుగుతుంది. 'మాధవే మధుసూదనా' సినిమా పెద్ద సక్సెస్ కావాలి'' అని హీరో విష్ణు మంచు అన్నారు. తేజ్ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా రూపొందుతోన్న చిత్రం 'మాధవే మధుసూదనా'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామ చంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను విష్ణు మంచు రిలీజ్ చేశారు. బొమ్మదేవర రామచంద్ర రావు మాట్లాడుతూ–''నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన అన్నపూర్ణ స్టూడియో సంస్థకు, నాగార్జునగారికి రుణపడి ఉంటాను. మోహన్‌బాబుగారు సింగపూర్‌లో ఉండటం వల్ల ఆయన స్థానంలో విష్ణుని పంపించినందుకు కృతజ్ఞతలు'' అన్నారు.

డబుల్ ఇస్మార్ట్‌లో..



సంజయ్ దత్

తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారట బాలీవుడ్ నటుడు సంజయ్ దత్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని ఓ కీలక పాత్రకు సంజయ్ దత్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఈ చిత్రంలో భాగం కావడానికి సంజయ్ దత్ సుముఖంగా ఉన్నారని టాక్.

కేరాఫ్ దెయ్యం...



రవిబాబు

ఒకప్పుడు గ్రామాల్లో మాతంగులుగా జీవించిన వారిలో ఒక స్త్రీ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'భయం.. కేరాఫ్ దెయ్యం'. మాతంగిగా రమ్య, మాంత్రికుడిగా నటుడు–దర్శకుడు రవి బాబు, తాంత్రికుడిగా నటుడు సత్యప్రకాష్ ముఖ్య పాత్రలు చేశారు. సీవీఎస్ఎం వెంకట రవీందర్ నాథ్ దర్శకత్వంలో పెదారికట్ల చేనెబోయిన్న నరసమ్మ, వెంకటేశ్వర్లు నిర్మించారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలు జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇటీవల జరిపిన రెండో షెడ్యూల్‌లో రవిబాబుపై సీన్స్ తీశాం. కన్నడ, తెలుగు భాషల్లో నిర్మించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో తెలియజేస్తాం'' అని దర్శక–నిర్మాతలు అన్నారు.

రోడ్స్ బ్లాకు...



శివానీ, శ్రీ కమల్

'ఆకు పాకు ఇస్తరాకు.. ఆల్ సైడ్స్ రోడ్స్ బ్లాకు..' అంటూ సాగే పాట 'జిలేబి' చిత్రంలోనిది. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి', 'మన్మథుడు' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు కె. విజయ భాస్కర్ కొంత గ్యాప్ తర్వాత తెరకెక్కించిన చిత్రం ఇది. శ్రీ కమల్, శివానీ రాజశేఖర్ జంటగా గుంటూరు రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమాలోని 'ఆకు పాకు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు.

ఓ ప్రేమకథ



మోక్ష, వికాస్ వశిష్ఠ, కుషిత

వికాస్ వశిష్ఠ, మోక్ష, కుషిత కళ్లపు హీరో హీరోయిన్లుగా అంజిరామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'నీతోనే నేను'. ఈ సినిమా టైటిల్, పోస్టర్‌ను చిత్ర నిర్మాత ఎమ్. సుధాకర్ రెడ్డి బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. ''చదువుకునే టైమ్‌లోనే సినిమా తీయాలనే కల ఉండేది. మంచి టీమ్‌తో 'నీతోనే నేను' తీశాను'' అన్నారు ఎమ్. సుధాకర్ రెడ్డి. ''ఈ సినిమా కోసం టీమ్ ప్రాణం పెట్టి పని చేశారు'' అన్నారు అంజిరామ్. ''ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది'' అన్నారు వికాస్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నవీన్, కెమెరామేన్ మురళీ మోహన్, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ బి. కడగండ్ల పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు	
దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 107	66,160
నిఫ్టీ ▽ 14	19,646

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,300	△	251
డోజోన్స్	34,436	△	156
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,694	△	2
డాక్స్	16,470	△	64
షాంఘై	3,275	△	59
నికాయ్	32,759	▽	132

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (24 క్యారెట్) 59,491	▽	250
బంగారం (22 క్యారెట్) 59,253	▽	249
వెండి (కేజీ) 73,420	▽	2,006

క్యూ1లో ఐవోసీ టర్న్‌అరౌండ్

నికర లాభం రూ. 13,750 కోట్లు



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో రూ. 13,750 కోట్ల నికర లాభం(స్టాండెలోన్) ఆర్జించింది. ఇది గత దశాబ్ద కాలంలోనే అత్యధికంకాగా.. పెట్రోల్, డీజిల్‌పై లాభదాయకత(మార్జిన్లు) మెరుగుపడటం లాభాలకు కారణమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,993 కోట్ల నికర నష్టం ప్రకటించింది. గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో నమోదైన రూ. 10,059 కోట్లతో పోల్చినా తాజా లాభం 37 శాతం జంప్‌చేసింది. వెరసి ఇంతక్రితం 2021–22లో ఆర్జించిన రికార్డ్ వార్షిక లాభం రూ. 24,184 కోట్లలో సగానికిపైగా క్యూ1లో సాధించింది. కాగా.. గతంలో అంటే 2012–13 క్యూ4లో అధిక ఇంధన సబ్సిడీని అందుకోవడం ద్వారా రూ. 14,153 కోట్ల నికర లాభం నమోదైంది. గతేడాది క్యూ1లో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను నిలిపిఉంచడంతో ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజాలు బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సైతం నష్టాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుత సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం 2 శాతం నీరసించి రూ. 2.21 లక్షల కోట్లకు పరిమితమైంది. ప్రతీ బ్యారల్ చమురుపై స్థూల రిఫైనింగ్ మార్జిన్లు 8.34 డాలర్లకు చేరాయి. ఇంధన అమ్మకాలు 0.6 మిలియన్ టన్నులు పెరిగి 21.8 ఎంటీని తాకాయి. ఈ కాలంలో 18.26 ఎంటీ చమురును ప్రాసెస్ చేసింది.

ఫలితాల నేపథ్యంలో ఐవోసీ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం క్షీణించి రూ. 95 వద్ద ముగిసింది.

అన్‌లిమిటెడ్ స్టోర్లలో 60% వరకు ఆఫర్లు



హైదరాబాద్: అరవింద్ లైఫ్‌స్టైల్ గ్రూప్ అనుబంధ సంస్థ అన్‌లిమిటెడ్ స్టోర్ అన్ని రకాల బ్రాండెడ్ వస్త్రాలపై 60% వరకు ఆఫర్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా అన్ని అన్‌లిమిటెడ్ స్టోర్లలో ఆగస్టు మూడో తేదీ వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. కస్టమర్లంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కంపెనీ కోరింది. అన్ని వయస్సుల వారికి సరిపడే సరికొత్త డిజైన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. కొత్త డిజైన్లను కస్టమర్లు ఇష్టపడతారని, నాణ్యమైన ఉత్పత్తులు ఆకర్షిస్తాయని పేర్కొంది.

విదేశాల్లో నేరుగా దేశీ సంస్థల లిస్టింగ్

- కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్; త్వరలో నోటిఫికేషన్
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశీ కంపెనీలు తమ షేర్లను నేరుగా విదేశీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేసుకునేందుకు అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి కోవిడ్–19 సహాయక ప్యాకేజీ కింద 2020 మేలోనే ప్రకటించినప్పటికీ, దీనిపై తాజాగా నిర్ణయం తీసుకుంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిర్వహించిన కార్పొరేట్ డెట్ మార్కెట్ డెవలప్‌మెంట్ ఫండ్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాలు తెలిపారు. 'ఐఎఫ్ఎస్‌సీ ఎక్స్ఛేంజీల్లో లిస్టెడ్, అన్‌లిస్టెడ్ కంపెనీలు నేరుగా లిస్ట్ అయ్యేందుకు అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది' అని ఆమె చెప్పారు. సంస్థలు అంతర్జాతీయంగా పెట్టుబడులు సమీకరించుకునేందుకు, మెరుగైన వేల్యుయేషన్స్ దక్కించుకునేందుకు దీనితో తోడ్పాటు లభించగలదని మంత్రి పేర్కొన్నారు. మరికొద్ది వారాల్లో దీనికి సంబంధించిన నిబంధనలను నోటిఫై చేయనున్నట్లు ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తొలుత గుజరాత్ గిఫ్ట్ సిటీలోని ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సీ)లో లిస్ట్ అయ్యేందుకు, ఆ తర్వాత ఎనిమిది లేదా తొమ్మిది నిర్దిష్ట దేశాల్లో లిస్టింగ్‌కు అనుమతినివ్వొచ్చని పేర్కొన్నారు. ఈ జాబితాలో బ్రిటన్, కెనడా, స్విట్జర్లాండ్, అమెరికా మొదలైనవి ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి.

స్టార్టప్‌లు.. రిలయన్స్‌కు బూస్ట్..

కొత్త పాలసీతో యూనికార్న్‌లు (1 బిలియన్ డాలర్లకు పైగా వేల్యుయేషన్ గల స్టార్టప్‌లు), విదేశాల్లో లిస్టింగ్‌పై కసరత్తు చేస్తున్న రిలయన్స్ డిజిటల్ విభాగానికి ఊతం లభించగలదని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ప్రస్తుత విధానం ప్రకారం భారతీయ సంస్థలు.. ప్రధానంగా అమెరికన్ డిపాజిటరీ రిసీట్స్ (ఏడీఆర్), గ్లోబల్ డిపాజిటరీ రిసీట్స్ (జీడీఆర్) రూపంలో విదేశాల్లో లిస్ట్ కావాల్సి ఉంటోంది. ఇన్ఫోసిస్, విప్రో తదితర సంస్థలు ఇదే బాటలో లిస్ట్ అయ్యాయి. విదేశాల్లో లిస్టింగ్ వల్ల భారతీయ కంపెనీలు వివిధ దేశాల్లోని ఎక్స్ఛేంజీల ద్వారా విదేశీ నిధులను సమకూర్చుకునేందుకు వీలుంటుంది.

బ్యాంక్ ఆఫ్ ఇండియా మెరుగైన పనితీరు

రూ.1,551 కోట్ల లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో తన పనితీరును గణనీయంగా మెరుగుపరుచుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నికర లాభం భారీగా పెరిగి రూ.1,551 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.561 కోట్లుగా ఉండడం గమనార్హం. మొత్తం ఆదాయం సైతం రూ.11,124 కోట్ల నుంచి రూ.15,821 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.14,359 కోట్లుగా ఉంది. స్థూల మొండి బకాయిలు జూన్ చివరికి 6.67%కి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 1.65%కి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు తాజాగా ముగిసిన త్రైమాసికంలో ఇవి రూ.777 కోట్లకు పరిమితమయ్యాయి.

19,650 దిగువకు నిఫ్టీ

- సూచీలకు రెండోరోజూ నష్టాలే
- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు



ముంబై: ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు తలెత్తడం స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టపోయాయి. అమెరికా బలమైన స్థూల ఆర్థిక గణాంకాల వెల్లడి నేపథ్యంలో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు మరోసారి ఉండొచ్చనే ఆందోళనలు తెరపైకి వచ్చాయి. ఇటీవల దేశీయ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు అనూహ్యంగా పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. యూఎస్ బాండ్లపై రాబడులు పెరగడం దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 388 పాయింట్లు క్షీణించి 65,879 వద్ద, నిఫ్టీ 97 పాయింట్లు పతనమై 19,563 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరికి సెన్సెక్స్ 107 పాయింట్లు నష్టపోయి 66,160 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 14 పాయింట్లు కోల్పోయి 19,646 వద్ద నిలిచింది. ఫైనాన్స్, ఐటీతో పాటు ఆటో షేర్లలోనూ విక్రయాలు తలెత్తాయి. కాగా మెటల్, ఫార్మా, ఇంధన, మీడియా, ఎఫ్ఎంసీజీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బ్యాంక్ ఆఫ్ జపాన్ యథాతథ ద్రవ్య విధాన వైఖరికే మొగ్గు చూపడంతో పాటు ఉద్దీపన చర్యల కొనసాగింపు ప్రకటనతో ఒక్క జపాన్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు అర శాతం పెరిగాయి. కాగా అమెరికా స్టాక్ మార్కెట్లు ఒక శాతం లాభంతో ట్రేడవుతున్నాయి.

యథార్థ్ హాస్పిటల్ ఐపీవో సక్సెస్

ఆరోగ్య పరిరక్షణ రంగ సంస్థ యథార్థ్ హాస్పిటల్ అండ్ ట్రామా కేర్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు శుక్రవారాని(28)కల్లా 36 రెట్లు అధికంగా స్పందన నమోదైంది. మొత్తం 1,65,17,823 షేర్లను విక్రయానికి ఉంచగా.. 59,72,19,800 షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. బీఎస్‌ఈ గణాంకాల ప్రకారం అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల నుంచి 85 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 37 రెట్లుపైగా బిడ్స్ లభించాయి. రిటైలర్లు సైతం 8.3 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మెరుగైన క్యూ1 ఆర్థిక ఫలితాల ప్రకటనతో ఇండియన్ బ్యాంక్ షేరు 4% లాభపడి రూ. 342 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 5% పెరిగి రూ. 346 వద్ద నాలుగేళ్ల గరిష్ట స్థాయిని అందుకుంది.
- దేశీయ అతి పెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ షేరు 4% లాభపడి రూ. 210 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతానికి పైగా రాణించి రూ. 210.40 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.
- తొలి త్రైమాసికంలో నికరలాభం 30% క్షీణించడంతో జేకే లక్ష్మీ సిమెంట్స్ షేరు ఏడుశాతం నష్టపోయి రూ. 612 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో ఎనిమిదిశాతం క్షీణించి రూ. 615 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.

26 పైసలు కరిగిన రూపాయి


రెండు నెలల్లో అతిపెద్ద పతనం



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ శుక్రవారం గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూసింది. భారత్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, ఈక్విటీ మార్కెట్లో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో దేశీయ కరెన్సీ భారీగా కరిగిపోయింది. అలాగే అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ బలపడటం, బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 84 డాలర్ల పైకి చేరుకోవడం కూడా రూపాయిపై ఒత్తిడి పెంచినట్లు ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ ఎక్స్ఛేంజీ మార్కెట్లో డాలర్ మారకంలో ఉదయం 82.30 వద్ద మొదలైంది. రోజంతా బలహీనంగా కదలాడిన రూపీ ఒక దశలో 40 పైసలు క్షీణించి 82.34 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 26 పైసలు కరిగిపోయి 82.18 స్థాయి వద్ద స్థిరపడింది.

రెండున్నరేళ్లలో వేదాంత చిప్ ప్లాంటు

- భారత్‌లో ఏఎండీ 400 మిలియన్ డాలర్ల పెట్టుబడులు
- సెమీకాన్ సదస్సులో కంపెనీల వెల్లడి


వేదాంత చీఫ్ అనిల్ అగర్వాల్

గాంధీనగర్: భారత్‌లో సెమీకండక్టర్ల తయారీపై దేశ, విదేశ కంపెనీలు పోటీపడుతున్నాయి. సెమీకాన్ సదస్సు వేదికగా తమ ప్రణాళికలను వెల్లడించాయి. తాము తలపెట్టిన చిప్ ఫ్యాక్టరీ తొలి దశ రెండున్నరేళ్లలో సిద్ధమవుతుందని వేదాంత చీఫ్ అనిల్ అగర్వాల్ వెల్లడించారు. ఇప్పటికే భాగస్వాములను ఎంపిక చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. తొలి దశపై 5 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు చెప్పారు. 'రెండున్నరేళ్లలో 2.5 ఏళ్లలో వేదాంత తయారు చేసిన మేడిన్ ఇండియా చిప్‌ను అందించబోతున్నాం' అని అగర్వాల్ చెప్పారు. 20 బిలియన్ డాలర్ల సెమీకండక్టర్ల ప్లాంటు కోసం వేదాంతతో కుదుర్చుకున్న జాయింట్ వెంచర్ నుంచి తైవాన్ కంపెనీ ఫాక్స్‌కాన్ తప్పుకున్న నేపథ్యంలో అగర్వాల్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అటు భారత్‌లో చిప్‌ల తయారీ వ్యవస్థలోకి ప్రవేశించాలంటే 'అత్యంత సాహసికులై' ఉండాలని ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియు పేర్కొన్నారు. వేదాంత జాయింట్ వెంచర్ గురించి ప్రస్తావించకుండా, ఇక్కడ ఎదురయ్యే ప్రతి అనుభవం.. కంపెనీలను మరింత దృఢంగా మారుస్తాయని ఆయన చెప్పారు.

ఏఎండీ డిజైన్ సెంటర్..

మరోవైపు, వచ్చే అయిదేళ్లలో భారత్‌లో 400 మిలియన్ డాలర్లకు పైగా ఇన్వెస్ట్ చేయనున్నట్లు అమెరికన్ చిప్ తయారీ దిగ్గజం అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్ (ఏఎండీ) చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మార్క్ పేపర్‌మాస్టర్ తెలిపారు. బెంగళూరులో తమ కంపెనీకి సంబంధించి అతి పెద్ద డిజైన్ సెంటర్‌ను 5,00,000 చ.అ. విస్తీర్ణంలో ఈ ఏడాది ఆఖరు నాటికి ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అయిదేళ్ల వ్యవధిలో 3,000 పైచిలుకు ఇంజనీరింగ్ ఉద్యోగాలను కల్పించనున్నట్లు పేపర్‌మాస్టర్ పేర్కొన్నారు. కొత్త క్యాంపస్ ఏర్పాటుతో భారత్‌లో తమ కార్యకలాపాలు పది ప్రాంతాలకు విస్తరించినట్లవుతుందని చెప్పారు. భారత్‌లో ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ డిజైన్, ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించడంలో ఏఎండీ ప్రణాళికలు కీలకపాత్ర పోషించగలవని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ట్విటర్‌లో ట్వీట్ చేశారు.

చిప్ ప్లాంటుకు జోరుగా కసరత్తు: మైక్రాన్

గుజరాత్‌లో తమ చిప్ ప్లాంటు ఏర్పాటుకు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు అమెరికన్ సెమీకండక్టర్ల తయారీ సంస్థ మైక్రాన్ టెక్నాలజీ ప్రెసిడెంట్ సంజయ్ మెహ్రోత్రా తెలిపారు. దీనితో రాబోయే రోజుల్లో ప్రత్యక్షంగా 5,000, పరోక్షంగా 15,000 మందికి ఉపాధి లభించగలదని ఆయన పేర్కొన్నారు.



సాకేత్-యూకీ బాంబ్రీ ద్వయం ఓటమి

అట్లాంటా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) ద్వయం 6–3, 3–6, 8–10తో నాలుగో సీడ్ నథానియల్ లామోన్స్–జాక్సన్ విత్రో (అమెరికా) జంట చేతిలో పరాజయం పాలైంది. సాకేత్–యూకీలకు 6,830 డాలర్ల (రూ. 5 లక్షల 61 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

అంకిత జోడీ సంచలనం



వార్సా ఓపెన్ డబ్ల్యూటీఏ–250 టెన్నిస్ టోర్నీలో అంకిత రైనా (భారత్)–యు యువాన్ (చైనా) జోడీ సంచలన విజయంతో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. పోలాండ్‌లో శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అంకిత–యువాన్ ద్వయం 3–6, 7–6 (9/7), 10–6తో మూడో సీడ్ విక్టోరియా రుంకోవా–తెరెజా మిహలికోవా (స్లొవేకియా) జంటపై గెలిచింది.

లక్ష్య సేన్ జోరు

సెమీఫైనల్లోకి భారత స్టార్ • పోరాడి ఓడిన ప్రణయ్, సాత్విక్–చిరాగ్ జోడీ



లక్ష్య సేన్

టోక్యో: ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ లక్ష్య సేన్ జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–15, 21–19తో ప్రపంచ 33వ ర్యాంకర్ కోకి వతనాబె (జపాన్)పై గెలుపొందాడు. ఈ విజయంతో లక్ష్య సేన్ వరుసగా మూడో టోర్నీలో సెమీఫైనల్ చేరాడు. కెనడా ఓపెన్‌లో టైటిల్ నెగ్గిన ఈ ఉత్తరాఖండ్ ప్లేయర్ యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్లో నిష్క్రమించాడు. నేడు జరిగే సెమీఫైనల్లో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో లక్ష్య సేన్ తలపడతాడు. మరోవైపు భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–19, 18–21, 8–21తో పోరాడి ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీకి నిరాశ ఎదురైంది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 15–21, 23–21, 16–21తో ఒలింపిక్ చాంపియన్స్ లీ యాంగ్–వాంగ్ చిలిన్ (చైనీస్ తైపీ) జోడీ చేతిలో ఓడిపోయింది.

సిరీస్ సొంతం చేసుకునేందుకు...

నేడు వెస్టిండీస్‌తో భారత్ రెండో వన్డే

రాత్రి 7 గంటల నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

వెస్టిండీస్‌తో తొలి వన్డేలో విజయం భారత్‌కు ఏదైనా మేలు చేసిందా? ఏదైనా కొత్త ప్రయోగానికి పనికొచ్చిందా? అంటే 'లేదు' అనే సమాధానమే వినిపిస్తుంది. వరల్డ్‌కప్‌నకు ముందు మిగిలిన మ్యాచ్‌ల్లో అన్ని రకాలుగా కూర్పును పరీక్షించుకోవాల్సిన మన జట్టు గత పోరులో అనవసరపు ప్రయత్నం చేసింది. ఎంత చిన్న లక్ష్యమైనా... ఆటగాళ్ల స్థానాలు మార్చడం వల్ల గందరగోళమే తప్ప ఉపయోగం లేదని ఆ మ్యాచ్ చూపించింది. ఈ నేపథ్యంలో వెస్టిండీస్‌తో రెండో వన్డేకు టీమిండియా సిద్ధమైంది. సిరీస్ గెలిచే అవకాశంపై సందేహాలు లేకపోయినా టీమ్ మేనేజ్‌మెంట్ ఈ మ్యాచ్‌లో ఎలాంటి వ్యూహం అనుసరిస్తుందనేది ఆసక్తికరం.


రోహిత్, గిల్

పిచ్, వాతావరణం

తొలి వన్డేలో పిచ్ ఏమాత్రం బ్యాటింగ్‌కు అనుకూలించలేదు. అదే పిచ్‌పైనే ఈ మ్యాచ్ ఆడితే ఇరు జట్లు అదనపు స్పిన్నర్‌ను తీసుకోవచ్చు. మరో పిచ్ మాత్రం బ్యాటింగ్‌కు అనుకూలంగా మంచి స్కోర్లకు అవకాశం కల్పిస్తుంది. మ్యాచ్‌కు వర్షం గండం ఉంది.

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): వరల్డ్‌కప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనింగ్ చేసే అవకాశమే లేదు. సూర్యకుమార్ మూడో స్థానంలో ఎలాగూ ఆడడు. అసలు కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ కోలుకుంటే వన్డేల్లో అతనికి చోటు కూడా సందేహమే. ఫినిషర్‌గా హార్దిక్ సరైన వ్యక్తి కాగా, నాలుగో స్థానంలో ఆడే చాన్స్ లేదు. వన్డేల్లో హార్దిక్ తొలి ఓవర్ బౌలింగ్ చేయడం అసాధ్యం. కానీ వెస్టిండీస్‌తో తొలి వన్డేలో భారత్ ఈ ప్రయోగాలన్నీ చేసింది. కానీ దానివల్ల ఆశించిన ప్రయోజనం మాత్రం నెరవేరలేదు. నిజంగా జట్టులో అందరికీ బ్యాటింగ్ అవకాశం ఇవ్వాలని భావిస్తే టీమిండియా టాస్ గెలిచాక బ్యాటింగ్ తీసుకోవాల్సింది. ఇప్పుడు భారత్ ముందు అలాంటి అవకాశం ఉంది. తొలి మ్యాచ్ జరిగిన కెన్సింగ్టన్ ఓవల్ వేదికపైనే భారత్, విండీస్ మధ్య నేడు రెండో వన్డేకు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్ గెలిచి రోహిత్ సేన సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంటుందా లేక విండీస్ కోలుకొని జవాబిస్తుందా చూడాలి.

సామ్సన్‌ను అవకాశముందా!

సాధారణంగా గెలిచిన జట్టులో మార్పులు ఉండవు. అయితే తొలి వన్డే సమయంలోనే కీపర్‌గా సంజు సామ్సన్‌ను కాకుండా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేయడంపై తీవ్ర చర్చ జరిగింది. రెండేళ్ల వ్యవధిలో అప్పుడప్పుడు మాత్రమే అవకాశాలు దక్కించుకుంటూ సామ్సన్ 11 వన్డేలు మాత్రమే ఆడాడు. అయితే వరల్డ్‌కప్ టీమ్‌లో ఉంచాలనే ఆలోచన ఉంటే మాత్రం అతనికి తగినన్ని మ్యాచ్‌లు ఇవ్వడం కీలకం. ఇషాన్ అర్ధసెంచరీ సాధించి తన వైపు నుంచి ఎలాంటి సమస్య లేకుండా రుజువు చేసుకున్నాడు. మరోవైపు సామ్సన్‌ను మేనేజ్‌మెంట్ ప్రధానంగా మిడిలార్డర్‌లో చూస్తోంది. కాబట్టి ఇషాన్ రాణించినా సామ్సన్‌కూ ఒక అవకాశం ఇవ్వవచ్చు.

ఆదుకునేదెవరు?

భారత్‌పై మంచి రికార్డు ఉన్న హెట్‌మైర్‌పై విండీస్ తొలి మ్యాచ్‌లో ఆశలు పెట్టుకుంది. స్పిన్‌ను సమర్థంగా ఆడగల అతను ఏమాత్రం ప్రభావం చూపకుండా వెనుదిరిగాడు. దాంతో అసలు ప్రత్యర్థిపై దూకుడు ప్రదర్శించగల బ్యాటర్లే ఆ జట్టులో కరువయ్యారు. హోప్ ఫర్వాలేదనిపించినా అది జట్టుకు పెద్దగా ఉపయోగపడలేదు. ఈ నేపథ్యంలో విండీస్ పోటీలో నిలవాలంటే బ్యాటింగ్‌లో కనీస ప్రదర్శన అయినా ఇవ్వాల్సి ఉంటుంది.

హర్మన్ ఆడేది... ఫైనల్ చేరితేనే!

- నేరుగా క్వార్టర్ ఫైనల్లోకి భారత్
- ఆసియా క్రీడల క్రికెట్ టోర్నీ 'డ్రా'



న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆసియా క్రీడల్లో బరిలోకి దిగాలంటే టీమిండియా ఫైనల్ చేరాలి. ఎందుకంటే చైనా ఆతిథ్యమిచ్చే ఈ ఈవెంట్‌లో భారత్‌కు నేరుగా క్వార్టర్ ఫైనల్ ఎంట్రీ లభించింది. కెప్టెన్ హర్మన్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం ఉన్న నేపథ్యంలో క్వార్టర్స్, సెమీఫైనల్ గెలిచి భారత్ తుదిపోరుకు అర్హత సాధిస్తే తప్ప ఆమె ఆసియా క్రీడల ఆట ఉండదు. చైనాలోని హాంగ్జౌలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 8 వరకు ఆసియా క్రీడలు జరుగనున్నాయి. ఇందులో మహిళల క్రికెట్ ఈవెంట్‌లో 14 జట్లు, పురుషుల ఈవెంట్‌లో 18 జట్లు బరిలోకి దిగుతాయి. అయితే ఈ రెండు విభాగాల్లోనూ భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు నేరుగా క్వార్టర్స్ ఫైనల్స్ ఎంట్రీ లభించింది.

'హండ్రెడ్' టోర్నీకి జెమీమా



లండన్: భారత మహిళా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వరుసగా మూడో ఏడాది ఇంగ్లండ్‌లో జరిగే 'హండ్రెడ్' టోర్నమెంట్‌లో ఆడనుంది. గత రెండేళ్లుగా నార్తర్న్ సూపర్‌చార్జర్స్ జట్టుకు ఆడుతున్న ఆమెను ముందుగా ఈ సీజన్ నుంచి తప్పించాలని ఆ ఫ్రాంచైజీ అనుకుంది. అయితే నార్తర్న్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆసీస్ ప్లేయర్ హీథెర్ గ్రాహమ్ గాయంతో వైదొలగడంతో చివరి నిమిషంలో 22 ఏళ్ల జెమీమాతో ఆ ఫ్రాంచైజీ మళ్లీ కాంట్రాక్టు కుదుర్చుకుంది. ఈ సీజన్ 'హండ్రెడ్' టీ20 టోర్నీ వచ్చేనెల 1 నుంచి 27 వరకు జరుగనుంది. ఇందులో నలుగురు భారత క్రికెటర్లు పాల్గొంటున్నారు. లండన్ స్పిరిట్ జట్టుకు రిచా ఘోష్, ట్రెంట్ రాకెట్స్‌కు హర్మన్‌ప్రీత్ కౌర్, సదర్న్ బ్రేవ్‌కు స్మృతి మంధాన ఆడనున్నారు.

టి20 ప్రపంచకప్ టోర్నీకి పపువా న్యూ గినీ అర్హత



పోర్ట్ మోర్స్‌బై (పపువా న్యూ గినీ): వచ్చే ఏడాది వెస్టిండీస్–అమెరికాలలో జరిగే టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి ఓసియానియా దేశమైన పపువా న్యూ గినీ (పీఎన్‌జీ) అర్హత సాధించింది. తూర్పు ఆసియా–పసిఫిక్ రీజినల్ క్వాలిఫయింగ్ టోర్నీలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పీఎన్‌జీ 100 పరుగుల తేడాతో ఫిలిప్పీన్స్‌పై జయభేరి మోగించింది. ఈ మెగా ఈవెంట్‌కు అర్హత పొందిన 15వ జట్టు పీఎన్‌జీ. 12 జట్లేమో ర్యాంకింగ్ ఆధారంగా నేరుగా అర్హత పొందగా... క్వాలిఫయర్స్ ద్వారా స్కాట్లాండ్, ఐర్లాండ్‌లు అర్హత సాధించాయి. పీఎన్‌జీ టి20 మెగా ఈవెంట్ ఆడటం ఇది రెండోసారి. యూఏఈలో జరిగిన 2021 టి20 ప్రపంచకప్‌లో ఆ జట్టు గ్రూప్ దశలో నిష్క్రమించింది. వచ్చే ప్రపంచకప్ టోర్నమెంట్‌లో తొలిసారి 20 జట్లు పాల్గొంటున్నాయి.

సౌత్‌జోన్ 'హ్యాట్రిక్' విజయం


రోహన్


పుదుచ్చేరి: దేవధర్ ట్రోఫీ దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో సౌత్‌జోన్ జట్టు వరుసగా మూడో విజయం సాధించింది. నార్త్ ఈస్ట్‌జోన్‌తో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మయాంక్ అగర్వాల్ నాయకత్వంలోని సౌత్‌జోన్ తొమ్మిది వికెట్లతో గెలిచింది. విద్వత్ కావేరప్ప (3/27), సాయికిశోర్ (3/22) దెబ్బకు ముందుగా బ్యాటింగ్ చేసిన నార్త్ ఈస్ట్‌జోన్ 49.2 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌటైంది. అనంతరం సౌత్‌జోన్ జట్టు 19.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 137 పరుగులు చేసి విజయం సాధించింది. కేరళ క్రికెటర్ రోహన్ కున్నుమ్మల్ (58 బంతుల్లో 87 నాటౌట్; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ చేశాడు. మరో మ్యాచ్‌లో ఈస్ట్‌జోన్ 88 పరుగులతో నార్త్‌జోన్‌పై నెగ్గి వరుసగా మూడో విజయం నమోదు చేసింది. ప్రస్తుతం సౌత్‌జోన్, ఈస్ట్‌జోన్ 12 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి.

భారత హాకీ జట్టుకు రెండో 'డ్రా'



బార్సిలోనా: స్పెయిన్ హాకీ సమాఖ్య శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న నాలుగు దేశాల పురుషుల హాకీ టోర్నీలో భారత జట్టు ఫైనల్ చేరడంలో విఫలమైంది. ఇంగ్లండ్ జట్టుతో శుక్రవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌ను భారత జట్టు 1–1తో 'డ్రా' చేసుకుంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (29వ ని.లో), ఇంగ్లండ్ తరఫున సామ్ వార్డ్ (5వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. స్పెయిన్‌తో తొలి మ్యాచ్‌లో ఓడిన భారత్ ... రెండో మ్యాచ్‌ను నెదర్లాండ్స్‌తో 1–1తో 'డ్రా' చేసుకుంది. నెదర్లాండ్స్‌తో చివరి మ్యాచ్‌ను స్పెయిన్ 'డ్రా' చేసుకుంటే ఆదివారం జరిగే ఫైనల్లో ఇంగ్లండ్‌తో ఆడుతుంది. ఒకవేళ నెదర్లాండ్స్ గెలిస్తే ఇంగ్లండ్‌తో టైటిల్ పోరులో తలపడుతుంది.

ఆస్ట్రేలియా 295 ఆలౌట్



స్మిత్

లండన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న 'యాషెస్' సిరీస్ ఆఖరి ఐదో టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 103.1 ఓవర్లలో 295 పరుగుల వద్ద ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 12 పరుగుల స్వల్ప ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 61/1 తో రెండో రోజు శుక్రవారం ఆట కొనసాగించిన ఆసీస్ 151 పరుగులకే సగం వికెట్లను కోల్పోయింది. ఈ దశలో స్టీవ్ స్మిత్ (71; 6 ఫోర్లు) అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. టెయిలెండర్లు కమిన్స్ (36; 4 ఫోర్లు), మర్ఫీ (34; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుగ్గా ఆడి తొమ్మిదో వికెట్‌కు 49 పరుగులు జోడించి ఆసీస్‌కు స్వల్ప ఆధిక్యం అందించారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ 3 వికెట్లు పడగొట్టగా... స్టువర్ట్ బ్రాడ్, మార్క్ వుడ్, రూట్ తలా 2 వికెట్లు తీశారు.

క్లుప్తంగా...

ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న గంధం చంద్రుడుని హార్టికల్చర్, సెరీ కల్చర్ డైరెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న ఎస్ ఎస్ శ్రీధర్‌ను సాధారణ పరిపాలన విభాగం (జీపీడీ)లో రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న హెచ్ఎం ధ్యానచంద్రను గ్రామ, వార్డు సచివాలయ అడిషనల్ డైరెక్టర్‌గా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న టి.నిషాంతిని సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీగా బదిలీ చేశారు. ఈ పదవిలో ఉన్న శ్రీవాస్ నిపుర్ అజయ్‌కుమార్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. టెక్కలి సబ్ కలెక్టర్‌గా ఉన్న తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డిని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు. మనజిర్ జిలానీ సామూన్‌ను అదనపు బాధ్యతల నుంచి తప్పించారు. నర్సాపురం సబ్‌కలెక్టర్‌గా ఉన్న మల్లవరపు సూర్యతేజను కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తుకు నేడు ఆఖరు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్యశాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు శనివారంతో గడువు ముగియనుంది. మొత్తం 41 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీల్లో 590 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఈ నెల 14న నోటిఫికేషన్ విడుదల చేసింది. తొలుత ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఇచ్చారు. అయితే ఇప్పటికే పీజీ పూర్తయి సీనియర్ రెసిడెన్సీ పూర్తి చేసుకుంటున్న వైద్యులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 29వ తేదీ వరకు దరఖాస్తు గడువును పొడిగించామని రిక్రూట్‌మెంట్ బోర్డ్ మెంబర్, సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు. ఆగస్టు నెలాఖరులోపు సీనియర్ రెసిడెన్సీ పూర్తి చేసుకునే వైద్యులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. కాగా, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్(డీఆర్), లేటరల్ ఎంట్రీ(ఎల్ఈ) ఇలా రెండు విధానాల్లో పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఇప్పటి వరకు డీఆర్‌లో 1,162, ఎల్ఈలో 165 దరఖాస్తులు వచ్చాయి.

బియ్యం పంపిణీ పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రజా పంపిణీ వ్యవస్థను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిత్యం పర్యవేక్షిస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో తూకం వేసిన తర్వాతే సరుకును అప్పగించేలా చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ప్రతి నెలా 1.47 కోట్ల మంది కార్డుదారులకు 2.31లక్షల టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఎండీయూ వాహనాల ఆపరేటర్లు బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే 1967 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్లు, చౌకధరల దుకాణాలు, ఎండీయూ వాహనాలపై టోల్ ఫ్రీ నంబర్లను ప్రదర్శించనున్నట్టు తెలిపారు.

రాష్ట్ర పండుగగా వెంకటగిరి పోలేరమ్మ జాతర



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు

వెంకటగిరి (తిరుపతి జిల్లా): వెంకటగిరి గ్రామ శక్తి పోలేరమ్మ జాతరను సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై అమ్మవారి భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని పోలేరమ్మ ఆర్చి సెంటర్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులతో కలిసి రామ్‌కుమార్‌రెడ్డి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అక్టోబర్ మొదటి వారంలో పోలేరమ్మ జాతరను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పేదల ఇళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- పురందేశ్వరి డిమాండ్



సాక్షి, విశాఖపట్నం: పేదల కోసం నిర్మిస్తోన్న ఇళ్లపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చే ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ఆరోపించారు. కేంద్రం ఇప్పటివరకు రాష్ట్రానికి 1.80 లక్షల ఇళ్లు కేటాయించిందని చెప్పారు. ఆమె శుక్రవారం విశాఖలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర నిధులతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని చెప్పారు.

భారీ పరిశ్రమలను ఆకర్షించేలా యాంకర్ యూనిట్లకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం 2023 - 27 విధివిధానాలను తాజాగా విడుదల చేసింది. 2023 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 30 వరకు నూతన పాలసీ అమల్లో ఉంటుంది. ఈ కాలపరిమితిలో ఉత్పత్తి ప్రారంభించిన యూనిట్లకు ప్రత్యేక రాయితీలు లభిస్తాయి. యాంకర్ యూనిట్లతో పాటు లార్జ్, మెగా, అల్ట్రా మెగా, ఎంఎస్ఎంఈలకు రాయితీలు, ప్రోత్సాహకాలపై స్పష్టమైన విధి విధానాలను ప్రభుత్వం విడుదల చేసింది.



యాంకర్ యూనిట్లకు ప్రత్యేక రాయితీలు

2023-27 పారిశ్రామిక పాలసీ విధివిధానాలను విడుదల చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించేలా ప్రభుత్వం నూతన పాలసీ విధివిధానాలను రూపొందించింది. యాంకర్ యూనిట్లకు ప్రత్యేక రాయితీలు అందించాలని నిర్ణయించింది. దీని ప్రకారం.. యాంకర్ యూనిట్ రూ.500 కోట్లకు పైబడి పెట్టుబడితో ఏర్పాటవ్వాలి. కనీసం 1,000 మందికి ఉపాధి కల్పించాలి. ఈ యూనిట్ ఆధారంగా కనీసం మరో ఐదు యూనిట్లు ఏర్పాటవ్వాలి. ఇటువంటి యూనిట్లకు పారిశ్రామిక పాలసీ 2023 – 27లో పేర్కొన్న ప్రోత్సాహకాలతో పాటు అదనపు రాయితీలు కూడా లభిస్తాయి. యూనిట్ ఏర్పాటు వల్ల రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కలిగే ప్రయోజనం, ఉపాధి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ యూనిట్ ప్రతిపాదనలను బట్టి టైలర్ మేడ్ రాయితీలను ఇవ్వనున్నారు. తొలుత యాంకర్ యూనిట్ పూర్తి నివేదిక (డీపీఆర్)ను రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్‌కు సమర్పించాలి. వారు కోరుకొనే రాయితీలను ప్రజంటేషన్ రూపంలో చూపించాలి. ఆ రాయితీలు ఇవ్వడానికి సహేతుక కారణాలను వివరించాలి. ఈ ప్రతిపాదనలను ఎస్ఐపీసీ, ఎస్ఐపీబీ ముందుకు తేవాలి. వాటిని ఎస్ఐపీబీ పరిశీలించి భూమి ధరలు, ప్రత్యేక రాయితీలపై నిర్ణయం తీసుకుంటుంది.

- ఇప్పటికే రాష్ట్రంలో ఉత్పత్తి ప్రారంభించిన యూనిట్లు విస్తరణ చేపట్టినా, లేక వేరే రంగంలో పెట్టుబడులు పెట్టినా వాటికి కూడా నిబంధనలకు అనుగుణంగా రాయితీలు అందుతాయి. రాష్ట్రంలో ఉత్పత్తి ప్రారంభించిన ప్రతి పరిశ్రమకు ఆధార్ తప్పనిసరిగా తీసుకోవాలని, ఉద్యోగుల్లో 75 శాతం స్థానికులకే అవకాశం కల్పించాలని, అటువంటి సంస్థలకే ఈ రాయితీలు, ప్రోత్సాహకాలు లభిస్తాయని స్పష్టం చేసింది.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు

ఎస్సీ, ఎస్టీ, పారిశ్రామికవేత్తలు స్థాపించే పరిశ్రమలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద ప్రత్యేక రాయితీలు ఇవ్వనుంది. ఇందులోనూ మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనుంది. ఇందుకు విధివిధానాలను నూతన పాలసీలో పొందుపరిచింది. ఈ పరిశ్రమల్లో 100 శాతం పెట్టుబడి ఎస్సీలు, ఎస్టీల పేరు మీద ఉండాలి. 100 శాతం పెట్టుబడి ఎస్సీ, ఎస్టీ మహిళల పేరు మీద ఉంటే వాటిని ఎస్సీ, ఎస్టీ మహిళా యూనిట్లుగా పరిగణిస్తారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ మహిళలను తొలి తరం పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేవలం ఆర్థిక ప్రోత్సాహకాలు మాత్రమే కాకుండా వారిని చేయిపట్టుకొని నడిపించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు నూతన పాలసీలో ప్రభుత్వం పేర్కొంది. జగనన్న కాలనీల్లో వాక్ టు వర్క్ విధానంలో పనిచేసుకునే విధంగా ఉమ్మడి వసతులతో కూడిన సూక్ష్మ యూనిట్లు ఏర్పాటు చేయడానికి క్లస్టర్లను ఏర్పాటు చేయనుంది. ఈ క్లస్టర్లలో ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఈ కాలనీల్లో యూనిట్లు ఏర్పాటు చేసేలా ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

అసైన్డ్ భూములపై పేదలకు హక్కులు కల్పిస్తాం

- త్వరలో ఆర్డినెన్స్ తీసుకువస్తాం
- అనుకున్నది సాధించగల ధీరుడు సీఎం వైఎస్ జగన్
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన

కోటబొమ్మాళి: రాష్ట్రంలోని 27 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై పేదలకు హక్కులు కల్పిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఈ మేరకు రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అసైన్డ్ భూములు పేదలకు చెందేలా... జిరాయితీ భూముల మాదిరిగానే పేదలు అన్ని హక్కులు పొందేలా ఆర్డినెన్స్ తెస్తామని ఆయన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం రేగులపాడులో రూ.80 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌లను శుక్రవారం మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ అనుకున్న పనిని ఎలాగైనా సాధించగలిగే ధీరుడు సీఎం వైఎస్ జగన్ అని, ఎలాంటి వాగ్దానాన్ని అయినా ఆయన అమలు చేయగలరని ప్రశంసించారు. అమరావతిలో ఒకేసారి 50వేల మందికి పైగా పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరుచేసి సీఎం జగన్ తన మానవత్వాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. అమరావతిలో పేదలకు నివేశన స్థలాలు, ఇళ్లు ఇస్తే చంద్రబాబుకు ఎందుకు కడుపు మంట... అని ప్రశ్నించారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదనే చంద్రబాబు అండ్‌కో ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని పార్టీలు ఏకమైనా రానున్న ఎన్నికల్లో వైఎస్ జగనే మళ్లీ సీఎం అవుతారని ధర్మాన స్పష్టంచేశారు. సచివాలయ వ్యవస్థతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమూల మార్పులు తెచ్చామన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివని తెలిపారు.

మహిళల అదృశ్యంపై తప్పుడు లెక్కలు

- ఎమ్మెల్సీ పోతుల సునీత



సాక్షి, అమరావతి: మహిళల అదృశ్యంపై తెలుగుదేశం పార్టీ తప్పుడు లెక్కలతో అవాస్తవాలు ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ధ్వజమెత్తారు. ఆమె శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'రాష్ట్రంలో 2019–21 మధ్య 24,557 మిస్సింగ్ కేసుల్లో 23,399 మంది ఆచూకీ లభించింది. వారిని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంకా ఆచూకీ తేలాల్సింది 1,158 కేసుల్లోనే.. వాస్తవాలిలా ఉంటే.. చంద్రబాబు, లోకేశ్, పవన్ కాకి లెక్కలతో ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు దుశ్శాసన పాలనలో ఎన్నో అఘాయిత్యాలు జరిగాయి. కాల్‌మనీ సెక్స్‌రాకెట్, వనజాక్షి, రిషితేశ్వరి వంటి ఘటనల్ని మహిళలు మరువరు. మహిళలపై వేధింపుల్లో నాడు రాష్ట్రం దేశంలోనే 4వ స్థానంలో, అక్రమ రవాణాలో రెండో స్థానంలో ఉండేది. స్వార్థ రాజకీయాలకు మహిళల్ని అడ్డుపెట్టుకునే నీచుడు చంద్రబాబు. ఆనాడు లక్ష్మీపార్వతిని అడ్డం పెట్టుకుని ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచాడు. ఇటీవల సొంత భార్యను కూడా స్వార్థ రాజకీయానికి వాడుకోవాలని చూసిన దుర్మార్గుడు. బాబు దత్తపుత్రుడైన పవన్ ఉన్మాదంతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాడు' అని దుయ్యబట్టారు. సీఎం జగనన్న అంటే రాష్ట్ర ప్రజలకు ఒక నమ్మకం, ధైర్యమని సునీత చెప్పారు.


పేద విద్యార్థులకు చేరువగా వైద్య విద్య

- అదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం
- రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చేందుకు విశేష కృషి
- మొదటి విడతలో 5 మెడికల్ కళాశాలలు ప్రారంభం
- మంత్రి విడదల రజిని

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో వైద్య కళాశాల నిర్మాణం చరిత్రాత్మకమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మెడికల్ కళాశాలను శుక్రవారం ఆమె స్థానిక ఎమ్మెల్యే పేర్ని నానితో కలిసి సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మచిలీపట్నంలో 64 ఎకరాల విస్తీర్ణంలో రూ.560 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ నాయకుడు, ఏ ప్రభుత్వం చేయనటువంటి ఆలోచన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి నడుం బిగించడం అభినందనీయమన్నారు. ఇందుకోసం దాదాపు రూ.8,500 కోట్లు వెచ్చించి.. త్వరలోనే 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చేందుకు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలన్న సంకల్పంతో మెడికల్ కళాశాలల నిర్మాణానికి చర్యలు చేపట్టిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. మొదటి విడతలో భాగంగా రాష్ట్రంలోని ఐదు మెడికల్ కళాశాలల్లో సెప్టెంబర్ నుంచి తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాది మరో ఐదు మెడికల్ కళాశాలల్లోనూ, ఆపై ఏడాది మిగిలిన ఏడు మెడికల్ కళాశాలల్లోనూ అకడమిక్ ఇయర్‌ను పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాలను కూడా తీసుకురాలేదని దుయ్యబట్టారు. కనీసం ఆస్పత్రులనైనా అభివృద్ధి చేశారా అంటే అదీ శూన్యమన్నారు. ఆస్పత్రుల్లో మందులనైనా ప్రజలకు అందుబాటులోకి తెద్దామన్న ఆలోచన కూడా చేయని చంద్రబాబు.. సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. వైద్య రంగానికి సంబంధించి దాదాపు 50,000 ఉద్యోగాలిచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మరో 3,000 పోస్టులకు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నోటిఫికేషన్ జారీ చేసినట్టు చెప్పారు. రైతులపై చంద్రబాబుది మొసలికన్నీరేనని ధ్వజమెత్తారు. రైతును రారాజుగా చూస్తోంది, వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది జగన్ ప్రభుత్వమేనన్న విషయాన్ని చంద్రబాబు తెలుసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు పాల్గొన్నారు.

పోలవరం కాంట్రాక్టర్‌ని మార్చొద్దన్నా మార్చేశారు

- ఈ ప్రాజెక్టుకు వైఎస్ చిక్కుముళ్లు వేస్తే.. నేను విప్పాను
- వైఎస్ వల్లే పోలవరం పదేళ్లు ఆలస్యమైంది
- దయాఫ్రం వాల్ కొట్టుకుపోవడానికి జగన్ నిర్ణయాలే కారణం
- మీడియా సమావేశంలో చంద్రబాబు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్‌ను మార్చొద్దని ఎంతచెప్పినా వినకుండా సీఎం జగన్ మార్చేశారని ప్రతిపక్ష నేత చంద్రబాబు చెప్పారు. తమ హయాంలో పెట్టిన కాంట్రాక్టర్ సమర్థంగా పనిచేస్తున్నారని పీపీఏ చెప్పినా వినలేదన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును రివర్స్ చేశారని, జీవనాడి అయిన ప్రాజెక్టును నాశనం చేశారని విమర్శించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, రివర్స్ పోకడల వల్లే పోలవరం ప్రాజెక్టు సర్వనాశనమైందన్నారు. దయాఫ్రం వాల్ కొట్టుకుపోవడానికి సీఎం మూర్ఖపు నిర్ణయాలే కారణమని చెప్పారు. తమ హయాంలో పోలవరం ప్రాజెక్టుపై రూ.11,537 కోట్లు ఖర్చుచేస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.4,611 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని తెలిపారు. ప్రతిపక్ష నేతగా పోలవరం ముంపు బాధితులకు పరిహారంపై ప్రగల్భాలు పలికిన జగన్, ఇప్పుడు వారిని ముంచేశారని విమర్శించారు. వైఎస్ చేసిన పనుల వల్ల ప్రాజెక్టు పదేళ్లు ఆలస్యమైందన్నారు. 2009 వరకు ఎలాంటి పురోగతి లేదని, మొత్తం ప్రాజెక్టుని వైఎస్ సమస్యల సుడిలోకి నెట్టేశారని విమర్శించారు. వాటన్నింటినీ సరిదిద్ది తాను ప్రాజెక్టు పనులు ప్రారంభించానని చెప్పారు. తమ హయాంలో 72శాతం పనులు పూర్తిచేస్తే, వైఎస్సార్‌సీపీ వచ్చాక కేవలం నాలుగుశాతం మాత్రమే చేశారని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులకు సకల వసతులతో కాలనీలు నిర్మిస్తానని చెప్పి నాలుగేళ్లలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఈ ప్రాజెక్టులను దారిలో పెట్టడానికి నిర్దిష్ట కాలపరిమితితో పనిచేస్తానని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్దకు వెళ్లి వాళ్ల బాగోతాన్ని బట్టబయలు చేస్తానని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రానికి 6.50 కోట్ల అదనపు పని దినాలు

- ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్ 21.50 కోట్ల పని దినాలకు పెంపు
- ఆమోదం తెలిపిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పెద్దఎత్తున పనులు కల్పిస్తున్న నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్రానికి అదనంగా లేబర్ బడ్జెట్ కేటాయించేందుకు అనుమతి తెలిపింది. మన అధికారుల విజ్ఞప్తి మేరకు రాష్ట్రానికి మరో 6.50 కోట్ల పని దినాల కల్పనకు కేంద్ర అధికారులు ఆమోదం తెలిపారు. ఫలితంగా రాష్ట్రానికి ఉపాధి హామీ పథకం ద్వారా గరిష్టంగా మరో రూ.2,650 కోట్ల నిధులు కేంద్రం నుంచి పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక (2023–24) సంవత్సరానికి సంబంధించి మొదటి విడతలో 15కోట్ల పని దినాలతో కూడిన లేబర్ బడ్జెట్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మన రాష్ట్రానికి కేటాయించింది. ఏప్రిల్–జూన్ నెలల మధ్య కేవలం మూడు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం 15 కోట్ల పని దినాలను పేదలకు కల్పించింది. ఆ తర్వాత అదనపు పని దినాలు కేటాయించాలని కేంద్రాన్ని కోరింది.ఈ నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గురువారం రాష్ట్ర అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రస్తుత ఆర్థిక ఏడాది లేబర్ బడ్జెట్‌ను 21.5 కోట్ల పని దినాలకు పెంచేందుకు ఆమోదం తెలిపింది.

సంక్షేమాభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా ఏపీ

'ఆంధ్రప్రదేశ్ ప్రగతి నాడు-నేడు' నివేదిక విడుదల చేసిన ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: సంక్షేమాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మేధావులు, ప్రజా సంఘాల నాయకులు చెప్పారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని కేంద్ర నివేదికలు చెబుతుంటే.. ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు మాత్రం అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఏపీ ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్రలను పౌరసమాజం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని గత పాలకుల పాపాలు మరింత కష్టాల్లోకి నెట్టాయని చెప్పారు. బిల్డింగులు, పరిశ్రమలు, వంతెనలు కడితేనే అభివృద్ధి కాదని, సామాన్యుడి జీవనం బాగుపడాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సామాజిక న్యాయం దిశగా పయనిస్తోందన్నారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెటర్ ఫర్ ఏపీ సొసైటీ పేరుతో పౌరులకు వాస్తవాలను తెలియజేసేందుకు రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ ప్రగతి నాడు-నేడు' సమగ్ర నివేదికను శుక్రవారం విజయవాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో పలువురు మేధావులు, ప్రజా సంఘాల నేతలు మాట్లాడారు. 'ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు బేరీజు వేసుకుంటే మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. చిన్న రాష్ట్రం అయినప్పటికీ, దేశానికి ఆర్థిక శక్తిని అందించడంలో ఏపీ కీలకంగా మారింది. ఆర్బీఐ, నీతి ఆయోగ్, సోషియో ఎకనామిక్ రిపోర్టు.. ఇలా అన్ని నివేదికల్లో నాలుగేళ్లుగా ఏపీ సాధిస్తున్న వృద్ధి కనపడుతోంది. ఎటువంటి అవినీతికి తావు లేకుండా నాలుగేళ్లలో 3.26 లక్షల కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందించడం చరిత్రలోనే ప్రథమం. ఫలితంగా పేదలు ఆర్థిక పరిపుష్టి సాధించారు. వారిలో కొనుగోలు శక్తి పెరిగింది. ఫలితంగా 16.22 శాతం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటుతో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. దేశంలో అత్యధిక ప్రభుత్వ ఆస్పత్రులతో సామాన్య ప్రజలకు కార్పొరేట్ వైద్యం ఏపీలోనే లభిస్తోంది. పరిశ్రమల నెట్ అసెట్ విలువలో దక్షిణాదిన టాప్‌లో, ఫ్యాక్టరీల సంఖ్యలో దేశంలో నాలుగో స్థానం, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక యూనిట్లలో రెండో స్థానం, ఎగుమతుల్లో 9 నుంచి 4వ స్థానానికి వచ్చింది. ఇంత అభివృద్ధి జరిగింది కాబట్టే.. 2018–19లో తలసరి ఆదాయం రూ.1.50 లక్షలు ఉంటే ఇప్పుడు 2.30 లక్షలకు పెరిగింది. పేదరికం 6.6 శాతానికి దిగివచ్చింది. కోవిడ్ సంక్షోభంలోనూ రాష్ట్రాన్ని సమర్థంగా నడిపించిన తీరు సీఎం జగన్ దార్శనికతకు అద్దం పట్టింది. సంక్షేమ పథకాలు లేకుంటే కోవిడ్ సమయంలో ప్రజా జీవనం తల్లకిందులయ్యేది. వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఏపీలో పరిశ్రమలకంటే వ్యవసాయంపైనే ఎక్కువ దృష్టి సారిస్తే మంచిది' అని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో నేత్ర వైద్యులు బి.సుబ్బారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రామలింగరాజు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నగర అధ్యక్షుడు అశోక్ కుమార్, రిటైర్డు ప్రొఫెసర్ రెహ్మాన్, సీనియర్ జర్నలిస్టు పీజీకే మూర్తి, సామాజికవేత్త అనంత హృదయరాజ్, గీతా విజన్ ట్రస్టు చైర్మన్ గీతా సుబ్బారావు, ఫోరం ఫర్ బెటర్ సొసైటీ కో-కన్వీనర్ ఎస్.కోటేశ్వరరావు, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, సిల్వెస్టర్, సామాజిక కార్యకర్త బి.జయప్రకాశ్ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు కళాశాల విద్యార్థులకు 'రాష్ట్రంలో నాడు-నేడు అభివృద్ధి'పై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

అసత్యాలే వారికి ఆయుధాలు



సమాజాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య ఫేక్ న్యూస్. ఏపీలో బాధ్యతాయుత మీడియా సైతం అభివృద్ధి లేదని ప్రచారం చేయడం సిగ్గుచేటు. నిత్యం పత్రికల్లో వచ్చే వార్తలను చూసి ఏపీ అభివృద్ధిపై వాస్తవాలు తెలుసుకునేందుకు అధ్యయనం చేశాం. మా పరిశీలనలో ఏపీ ఏ రంగంలోనూ వెనుకబడలేదు.

– వీవీఆర్ కృష్ణంరాజు, అధ్యక్షుడు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్

నాలుగు రెట్ల పారిశ్రామిక వృద్ధి



ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో పయనిస్తుంటే తప్పుడు ప్రచారం చేసే మీడియాను అందరూ ఎండగట్టాలి. రాష్ట్రంలో గ్రామీణ ప్రజలను దృష్టిలో పెట్టుకుని పాలన సాగుతోంది. పారిశ్రామిక రంగం వృద్ధి గతంలో 3.2 శాతం ఉంటే ఇప్పుడు 12 శాతానికి పెరిగింది. ఒకప్పుడు 60 వేల ఎంఎస్ఎంఈలు ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 1.10 లక్షలకు చేరింది. 10 లక్షలకు పైగా ఉద్యోగులకు మేలు జరిగింది. 600 పెద్ద పరిశ్రమల్లో 6 లక్షలకు పైగా ఉపాధి వచ్చింది.

– మేడపాటి వెంకట్, అధ్యక్షుడు, ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ

సామాజిక మార్పుతోనే అభివృద్ధి సాధ్యం



సామాజిక మార్పు ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యం. జీడీపీ పెరిగిందంటే ప్రజా జీవనం బాగుపడినట్టే. రాష్ట్రంలో పేదరికం తగ్గింది. అంటే సామాజిక న్యాయం కచ్చితంగా జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం గతేడాది ఏకంగా రూ.44 వేల కోట్లు సామాజిక న్యాయానికి ఖర్చు చేసింది. – ఏఆర్ సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు, నవ్యాంధ్ర ఇంటెలెక్చువల్ ఫోరం

నిత్యం అప్పులంటూ విష ప్రచారం



రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పుల కుప్పగా మార్చేస్తే.. సీఎం జగన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. చంద్రబాబు రూ. 2.64 లక్షల కోట్లు అప్పు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1.77లక్షల కోట్లు మాత్రమే అప్పు తెచ్చింది. కానీ, ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు రూ.10 లక్షల కోట్లు అప్పు అంటూ దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు. ఇప్పుడిస్తున్న సంక్షేమ పథకాలు గతంలో ఎన్నడూ లేవు. అప్పట్లో తెచ్చిన డబ్బంతా ఎటు పోయిందని ఎవరూ అడగట్లేదు. టీడీపీ హయాంలో సంపద పంపిణీ కొంత మంది చేతుల్లోనే ఉంది. ఇప్పుడు ప్రజల చేతుల్లోకి వెళ్లింది. – పి.విజయ్‌బాబు, అధ్యక్షుడు, అధికార భాషా సంఘం

సమానత్వం కోసం కృషి జరుగుతుంది



స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇప్పుడు ఏపీలో సమానత్వం కోసం కృషి జరుగుతోంది. చంద్రబాబు 14 ఏళ్లలో ఒక్క ఇంటి పట్టా కూడా ఇవ్వలేదు. సీఎం జగన్ రూ.21 వేల కోట్లతో 30 లక్షలకు పైగా ఇళ్లు కట్టిస్తున్నారు. అసైన్డ్ భూములకు హక్కులు ఇచ్చారు. అమరావతిలో ఇప్పుడు 50 వేల ఇళ్ల పట్టాలతో రూ.3 లక్షల కోట్ల ఆస్తి రాబోతోంది.

– మాదిగాని గుర్నాథం, అధ్యక్షుడు, సోషల్ డెమోక్రాటిక్ ఫ్రంట్

పేదల అభివృద్ధే నిజమైన సూచీ



మనిషి జీవన ప్రమాణం పెరుగుదలే నిజమైన అభివృద్ధికి సూచీ. ఏపీపై కేంద్రం సవతి ప్రేమ చూపిస్తోంది. ప్రతిపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయి. సీఎం జగన్ మాత్రం పేదల సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టుల నిర్మాణం సాగుతోంది. కొత్తగా 17 వైద్య కళాశాలలు వస్తున్నాయి.

– గౌతమ్‌రెడ్డి, చైర్మన్, ఏపీ ఫైబర్ నెట్

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి తీసుకెళ్లారు



చంద్రబాబు హయాంలో దళితులు ఎంఎస్ఎంఈలు పెట్టుకోవాలంటే సబ్సిడీ వచ్చేది కాదు. కానీ, సీఎం జగన్ ఎంఎస్ఎంఈలను బలోపేతం చేశారు. ఒక్క కరోనాలోనే రూ. 2 వేల కోట్లు ఎంఎస్ఎంఈల కోసం ఖర్చు చేశారు. జగనన్న బడుగు వికాసం, ఇతర కార్యక్రమాల ద్వారా ఊపిరిపోశారు. దళితులను ఉద్యోగం చేసుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి తీసుకెళ్లారు.

– కాలే వెంకటరమణారావు, దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

ఏపీఎన్జీవో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బండి శ్రీనివాసరావు, శివారెడ్డి, చంద్రశేఖరరెడ్డి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో సంఘం రాష్ట్ర 21వ మహాసభల నిర్వహణ చరిత్రలో అతి పెద్ద కార్యక్రమంగా నిలిచిపోయేలా ఆగస్టు 21, 22 తేదీలలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలోని ఎన్జీవో రాష్ట్ర కార్యాలయంలో మహాసభల వాల్ పోస్టర్‌ను శుక్రవారం ప్రభుత్వ సలహాదారు ఎన్.చంద్రశేఖరరెడ్డితో కలిసి బండి శ్రీనివాసరావు, కె.వి.శివారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై మహాసభలో చర్చించి పలు తీర్మానాలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి కె.జగదీశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, నాయకులు ఎ.విద్యాసాగర్, ఎం.డి.ఇక్బాల్, మహిళా విభాగం చైర్‌పర్సన్ నిర్మల, కె.శివలీల తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943